



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

ఉద్యమకారులకు సముచిత గౌరవం ఇవ్వాలి

రాష్ట్ర సాధనకు ప్రాణత్యాగాలు చేసిన అమరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

03

సంపుటి 09, సంచిక: 185 | శుక్రవారం | 05-06-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## గాంధీలో ఎబోలా అనుమానితుడు

- సూడాన్ వ్యక్తికి వ్యాధి లక్షణాలు?
- గురువారం విమానంలో హైదరాబాద్ రాక
- నమూనాలు పుణేలోని వైరాలజీ ల్యాబ్‌కు

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ




ఆఫ్రికన్ దేశాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఎబోలా... ప్రస్తుతం తెలంగాణలోకి ప్రవేశించిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి గురువారం తెల్లవారుజామున చేరుకున్న సూడాన్ దేశానికి చెందిన అహ్మద్‌కు హైఫీవర్ ఉండటంతో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ అధికారులు ఎబోలా లక్షణాలు ఉన్నట్లు అనుమానించారు. ఎమర్జెన్సీ ప్రణాళిక ప్రకారం సూడాన్ వ్యక్తిని ప్రత్యేక అంబులెన్స్‌లో ఎయిర్‌పోర్ట్ నుంచి ఆస్పత్రికి తరలించారు. గాంధీ ఆస్పత్రిలోని ఐసోలేషన్ వార్డులో అతనికి చికిత్స తరువాయి 8లో

## కేరళను తాకిన 'నైరుతి'

నాలుగు రోజులు ఆలస్యంగా ప్రవేశించిన రుతుపవనాలు : ఐఎండి

**న్యూఢిల్లీ :** దేశ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు వాతావరణశాఖ చల్లని కబురు చెప్పింది. నైరుతి రుతుపవనాలు గురువారం కేరళకు ప్రవేశించాయని తెలిపింది. మండుటెండలతో అల్లాడిపోతున్న ప్రజలకు ఉపశమనం కలగనుంది. సాధారణంగా, రుతుపవనాలు జూన్ 1వ తేదీన కేరళలోకి ప్రవేశిస్తాయి, ఇది నైరుతి రుతుపవన కాలం (జూన్–సెప్టెంబర్) ప్రారంభాన్ని సూచిస్తుంది. అయితే ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు నాలుగు రోజుల ఆలస్యంగా 4వ తేదీన రాష్ట్రంలోకి ప్రవేశించాయి. రుతుపవనాల ప్రభావంతో కేరళలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అలప్పుళ, కొట్టాయం, ఎర్నాకుళం జిల్లాలకు వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. అదే విధంగా నైరుతి, ఆగ్నేయ అరేబియా తరువాయి 12లో





## మోదీ హయాంలో విద్యావ్యవస్థ నాశనం

- యువతరం మూల్యం చెల్సించుకోవాల్సి వస్తుంది
- నీట్ విద్యార్థిని బలవన్మరణంపై రాహుల్‌గాంధీ ఫైర్

**న్యూఢిల్లీ :** నీట్ విద్యార్థిని బలవన్మరణంపై లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. పదేపదే జరుగుతున్న పేపర్ లీక్ వివాదాల వల్ల విద్యార్థుల కలలు చెదిరిపోతున్నాయని మండిపడ్డారు. గత 12 ఏళ్లుగా ప్రధాని విద్యా వ్యవస్థను నాశనం చేసిన తీరుకు యువతరం మొత్తం మూల్యం చెల్లిస్తోందని ఆయన తరువాయి 12లో




రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని అందరితో పీఠికను చదివిస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

### భావ ప్రకటన స్వేచ్ఛ లేకుంటే

## ప్రజాస్వామ్య మనుగడ అసాధ్యం

- భిన్నాభిప్రాయాలు సహజం
- ఒకరి విశ్లేషణతో అందరూ ఏకీభవించాల్సిన అవసరం లేదు
- రాజకీయాల కోసం అస్తిత్వవాదానికి, ప్రాంతీయవాదానికి తేడా లేకుండా మాట్లాడుతున్నారు
- ప్రొఫెసర్ నాగేశ్వర్ తెలుగు రాష్ట్రాల ప్రజలకు విజ్ఞాన ఖని
- రౌండ్‌టేబుల్ సమావేశంలో నాగేశ్వర్‌పై కక్షపూరిత దాడులను ఖండించిన కాంగ్రెస్, వామపక్షాలు, టిజెఎస్, తదితర పార్టీలు, ప్రజా సంఘాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ కె.నాగేశ్వర్‌పై జరుగుతున్న కక్షపూరిత దాడులు, సోషల్ మీడియా ట్రోలింగ్స్, అక్రమ కేసులను రాష్ట్రంలోని రాజకీయ నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు ముక్తకంఠంతో ఖండించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో గురువారం సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు అధ్యక్షతన 'ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ రాజకీయ విశ్లేషణపై కక్షపూరిత దాడి'కి వ్యతిరేకంగా' రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, జర్నలిస్టులు, సామాజిక విశ్లేషకులు పాల్గొని తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ భావప్రకటన స్వేచ్ఛ అనేది లేకపోతే ప్రజాస్వామ్య మనుగడే సాధ్యం కాదన్నారు. 'ప్రజాస్వామ్యం ఎప్పుడూ భిన్నాభిప్రాయాలను ప్రోత్సహిస్తుంది. ఒకరి విశ్లేషణతో అందరూ ఏకీభవించాల్సిన తరువాయి 12లో

### ట్రంప్ యుద్ధోన్మాదానికి అమెరికా

## కాంగ్రెస్ అడ్డుకట్ట

- డెమోక్రాట్లతో చేతులు కలిపిన రిపబ్లికన్లు
- 215–208 తేడాతో తీర్మానం ఆమోదం
- ఇది రాజ్యాంగ విరుద్ధ ప్రయత్నం : వైట్‌హౌస్ తిరస్కృతి



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఉన్న ప్రత్యేక యుద్ధ అధికారాలను తగ్గించేందుకు, ఇరాన్‌పై తదుపరి యుద్ధ దాడులుచేయకుండా అడ్డుకునేందుకు అనుకూలంగా అమెరికా కాంగ్రెస్ ఓటు వేసింది. ఇరాన్‌పై యుద్ధం చేయడాన్ని వ్యతిరేకిస్తున్న నలుగురు రిపబ్లికన్ పార్టీ ఎంపీలు బాహాటంగా ట్రంప్‌ను వ్యతిరేకిస్తూ, డెమోక్రాట్లతో చేతులు కలిపారు. థామస్ మాస్సీ,బ్రయాన్ ఫిట్జ్‌ప్యాట్రిక్,టామ్ బారెట్, వారెన్ డేవిడ్‌సన్‌లు డెమోక్రాట్లకు ఓటింగ్‌లో సహకరించడం ఒక అరుదైన పరిణామం. దీంతో 215 – 208 ఓట్ల తేడాతో ఈ తీర్మానం ఆమోదం పొందింది. ట్రంప్ యుద్ధ అధికారాలను కట్టడి చేయడానికి ప్రతినిధులసభ నాలుగోసారి చేసిన ప్రయత్నం ఫలించింది. వాస్తవానికి దీనిని ఉభయసభలూ ఆమోదించాల్సి ఉంది. ఏకకాలంలో ఉభయసభలూ ఈ తీర్మానాన్ని ఆమోదిస్తే ఈ తీర్మానంపై దేశాధ్యక్షుడు సంతకం చేయాల్సిన అవసర ఉండదు. ప్రతిపక్ష డెమోక్రాట్లు ఆధిక్యంగా ఉన్న సెనేట్‌లో కూడా ఈ తీర్మానం ఆమోదం పొందితే దీనిపై దేశాధ్యక్షుడి సంతకం అవసరం లేదు. ఐనాగానీ ఈ తీర్మానాన్ని చట్టపరంగా సవాలు చేసే అవకాశం ఉంది. 207 మంది రిపబ్లికన్లు, ఒక ఇండిపెండెంట్ తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. 211 మంది డెమోక్రాట్లతోపాటు మరో నలుగురు రిపబ్లికన్లు అనుకూలంగా ఓటు వేశారు. ప్రతినిధులసభలో విదేశీ వ్యవహారాల కమిటీ ప్రముఖుడు,డెమోక్రటిక్‌పార్టీ ప్రతినిధి గ్రెగ్రోమిక్స్ ఈ పరిణామంపై స్పందిస్తూ, "ఇరాన్‌పై ట్రంప్ సాగిస్తున్న చట్ట విరుద్ధమైన,అత్యంత ఖరీదైన యుద్ధానికి ఇది ఉభయపక్షాల తిరస్కారం,శాశ్వతంగా యుద్ధం ముగించేందుకు వేసిన మొదటి అడుగు" అని వ్యాఖ్యానించారు. "నిర్దేశిత యుద్ధ లక్ష్యాలు సాధించడంలో ట్రంప్ విఫలమయ్యారు, దేశంలో ధరలు పెంచారు, యుద్ధం వ్యయాన్ని పెంచారు,ఇరాన్ అణ్వాయుధాన్ని అడ్డుకోవడంపై చర్చలను, ప్రయత్నాలను మరింత సంక్లిష్టంగా మార్చేశారు" అని విమర్శించారు. "ఈ రోజున ఈ తీర్మానం ఆమోదం పొందడం ఒక ముఖ్యమైన మలుపు, ఎందుకంటే ఎక్కువమంది ప్రతినిధులు తమ తమ నియోజకవర్గాలలో ప్రజల యుద్ధ వ్యతిరేక ఆలోచనలను తరువాయి 8లో



### క్రాక్రోచ్ జనతా పార్టీ వెనుక

## అర్బన్ నక్సల్స్

- కాళేశ్వరం వల్ల రైతులకు దక్కని ప్రయోజనం
- పవన్ ఎప్పుడూ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడలేదు
- 'మీట్ ది ప్రెస్'లో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్

సోషల్ మీడియాలో 'క్రాక్రోచ్ జనతా పార్టీ' లాంటి దుష్ప్రచారాల వెనుక అర్బన్ నక్సల్స్ శక్తులు, జార్జ్ సోరోస్ వంటి విదేశీ నిధుల కుట్రలు ఉన్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు ఆరోపించారు. కృష్ణా జలాల వాటాను కెసిఆర్ తాకట్టు పెడితే, రేవంత్ రెడ్డి రాష్ట్ర హక్కులను డి.కె. శివకుమార్‌కు బహుమతిగా ఇచ్చారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'హైదరాబాద్ ప్రెస్ క్లబ్' ఆధ్వర్యంలో తరువాయి 8లో

### 'మక్తల్–నారాయణపేట్–కొడంగల్' ద్వారా

## లక్ష ఎకరాలకు సాగునీరు

- ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వెల్లడి
- పాలమూరు జిల్లాలో పర్యటన
- భీమా, కృష్ణా నదులపై నిర్మిస్తున్న ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శన : పనుల పురోగతి పరిశీలన



ప్రజాపక్షం/మక్తల్

ఉమ్మడి పాలమూరు జిల్లా ప్రాజెక్టులను క్షేత్రస్థాయిలో సందర్శించి పనుల పురోగతిని పరిశీలించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి పాలమూరు జిల్లాలో పర్యటిస్తున్నారు. గురు, శుక్రవారాల్లో మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా పర్యటిస్తూ ఎత్తిపోతల పథకాలు, రిజర్వాయర్లు, పంప్ హౌస్‌లను పరిశీలిస్తున్నారు. మక్తల్–నారాయణపేట్–కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. భీమా, కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి, బెంగుళూరు నుంచి కర్ణాటక మంత్రి బోసు రాజు నేరుగా మక్తల్ చేరుకోగా, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి ఇరిగేషన్ అధికారులు వివరించారు. మక్తల్ మండలం కాట్రేవుపల్లి గ్రామ సమీపంలో తరువాయి 8లో

### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద

## జనం కిటకిట

- నేటి నుంచి భూముల మార్కెట్ విలువ పెరుగుతుండడంతో పోటెత్తిన వైనం
- తెల్లవారుజాము నుంచే కార్యాలయాలకు డాక్యుమెంట్ రైటర్లు
- రాత్రి 7.30 వరకు పనివేళలు పొడిగింపు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో భూములు, ఆస్తుల మార్కెట్ విలువలు, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు జనంతో కిటకిటలాడాయి. పెరిగిన కొత్త ధరలు నేటి నుంచి అమలులోకి రానుండటంతో, పాత ధరలకే తమ రిజిస్ట్రేషన్‌లను పూర్తి చేసుకోవాలనే ఆరాటంతో కొనుగోలుదారులు, డాక్యుమెంట్ రైటర్లు గురువారం తెల్లవారుజాము నుంచే కార్యాలయాల వద్దకు భారీగా తరలివచ్చారు. చలాన్లు కట్టేందుకు, రిజిస్ట్రేషన్ ప్రక్రియలు ముగించుకునేందుకు జనం పోటెత్తడంతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల వద్ద అసాధారణ రద్దీ, పండగ వాతావరణం నెలకొంది. కార్యాలయాల వద్ద నెలకొన్న విపరీతమైన రద్దీని, ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం తరువాయి 8లో



### ఐసియులో భారీగా మంటలు

## ఐదుగురు సజీవ దహనం

బిహార్ ముజఫర్‌పూర్ జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రిలో అగ్ని ప్రమాదం

**ముజఫర్‌పూర్ :** బిహార్‌లోని ఓ ఆసుపత్రిలో విషాద ఘటనం సంభవించింది. ముజఫర్‌పూర్ జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఒక ప్రైవేట్ ఆసుపత్రిలోని ఐసియులో చెలరేగిన అగ్నిప్రమాదంలో కనీసం ఐదుగురు మరణించారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. బ్రహ్మపురా ప్రాంతంలోని ప్రసాద్ ఆసుపత్రిలో తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో మంటలు చెలరేగి, వేగంగా ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియు) తరువాయి 12లో

## రూ.15.15 లక్షల కోట్ల స్కామ్

ఆభరణాల తయారీ సంస్థ రాజేష్ ఎక్స్‌పోర్ట్స్‌లో అవకవతకలు

- సెబీ చర్యలు
- రాజేష్ ఎక్స్‌పోర్ట్స్, రాజేష్ మెహతాలను సెక్యూరిటీల మార్కెట్లోకి ప్రవేశించకుండా నిషేధం



**ముంబయి :** ప్రముఖ బంగారు శుద్ధి, ఆభరణాల తయారీ సంస్థ రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రూ. 15.15 లక్షల కోట్ల మేర భారీ ఆర్థిక అవకతవకలు జరిగినట్టు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆరోపించింది. ఈ మేరకు 3న జారీ చేసిన ఒక మధ్యంతర ఉత్తర్వులో సెబీ రాజేష్ ఎక్స్‌పోర్ట్స్, దాని ప్రమోటర్ – చైర్మన్ రాజేష్ మెహతాలను సెక్యూరిటీల మార్కెట్లోకి ప్రవేశించకుండా నిషేధించింది. ఐదు ఆర్థిక సంవత్సరాల పాటు భారీ ఆర్థిక అవకతవకలు జరిగాయని రెగ్యులేటర్ వెల్లడించింది. ఈ ఆదేశాలు దలాల్ స్ట్రీట్లో ప్రకంపనలు సృష్టించాయి. దీని షేర్ బాగా పడిపోయింది. చివరికి కొనేవాళ్లు లేక లోయర్ సర్క్యూట్లోకి జారుకుంది. బెంగళూరు కేంద్రంగా ఉన్న ఈ సంస్థ, ప్రపంచ బంగారు దిగ్గజంగా పేరు సంపాదించింది. ఆర్థిక సంవత్సరం 2021 నుంచి 2025 మధ్య కాలంలో, కంపెనీ తన విదేశీ అనుబంధ సంస్థల ద్వారా రూ. 15.15 లక్షల కోట్ల మేర (కన్సాలిడేటెడ్ రెవెన్యూలో దాదాపు 99.8 శాతం) తప్పుడు ఆదాయాన్ని చూపించిందని సెబీ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దర్యాప్తు అధికారులు కోరిన అనేక కీలక పత్రాలను కంపెనీ అందించడంలో విఫలమైందని సెబీ తెలిపింది. ఫోరెన్సిక్ ఆడిటర్‌కు కస్టమర్ రికార్డులు, వెండర్ వివరాలు, ముఖ్యమైన అనుబంధ సంస్థల ఆర్థిక నివేదికలు సమర్పించలేదనీ, పొంతన లేని ఆదాయ వ్యయాల వివరాలు, దర్యాప్తునకు సహకరించకపోవడం లాంటి వాటిని రెగ్యులేటర్ ఎత్తి చూపింది. ఈ ఆదాయ ఆరోపణలతోపాటు ఆఫ్రికాలో ఉన్న బంగారు గనుల ఆస్తులలో రూ. 1,035 కోట్ల పెట్టుబడి పెట్టినట్లు వచ్చిన నివేదికను కూడా సెబీ ప్రశ్నించింది.

## కెఎస్ఆర్ ఫ్యాషన్స్ బుగ్గిపాలు

- మిట్టమధ్యాహ్నం రాజుకున్న అగ్గి
- భారీగా ఎగసిపడిన మంటలు
- మెస్ ఎగ్జాస్ట్ ఫ్యాన్ కారణం?
- షార్ట్ సర్క్యూట్‌గా కూడా అనుమానం?

ప్రజాపక్షం/హైదరాబాద్




భారీ అగ్ని ప్రమాదంలో కెఎస్ఆర్ ఫ్యాషన్స్ బుగ్గిపాలయ్యింది. ఒక్కసారిగా చెలరేగిన మంటలు మూడు అంతస్తుల్లోని భవనం మొత్తం వ్యాపించడంతో కాంప్లెక్స్‌లోని దుకాణాలు కాలిబూడిదయ్యాయి. మిట్టమధ్యాహ్నం మంటలు చెలరేగడంతో కాంప్లెక్స్‌లోని దుకాణాల్లో ఉన్న కస్టమర్లు, సిబ్బంది, రహదారిలో వెళ్లే వాహనదారులు, స్థానికులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురై పరుగులు పెట్టారు. అగ్ని ప్రమాదం కారణంగా ఎప్పుడూ రద్దీగా ఉండే అమీర్‌పేట్ మైత్రీవనం చౌరస్తా ప్రాంతంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పారు. ఈ క్రమంలోనే ఘటనా స్థలానికి ఎమ్మెల్యేలు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రశాంతంగా ఉన్న అమీర్‌పేట్ మైత్రీవన్ చౌరస్తాలో మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో అగ్ని ప్రమాద భయాందోళనలు నెలకొన్నాయి. చౌరస్తాకు సమీపంలోని కాంప్లెక్స్‌లోకి పక్కనే ఉన్న హర్ష మెస్ ఎగ్జాస్ట్ ఫ్యాన్ నుంచి మంటలు వచ్చాయని.. ఆర్పేందుకు యత్నించినా వీలుకాలేదని ప్రత్యక్ష సాక్షి చెబుతుండగా.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కూడా మంటలు వ్యాపించవచ్చని స్థానికులు తరువాయి 8లో

# ఎదురు 'పవనా'లు

తెలంగాణ రాజకీయాలను కదిపి చూడాలనుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాధిపతి పవన్ కల్యాణ్‌కు ఎదురుగాలి వీచింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన పుష్కరాన ఆయన హైదరాబాద్‌కు వచ్చి మరీ పాత్రికేయ సమావేశంలో చేసిన భాషణం తెలంగాణ భూమిపుత్రులకు ఏ మాత్రం రుచించలేదు. తెలంగాణ ఏర్పాటు సందర్భంగా తాను పదకొండు రోజుల పాటు నిద్రాహారాలు మానేసానని, ఇక్కడి వారి దిష్టి తగిలి కోనసీమలో కొబ్బరితోటలు ఎండిపోయాయని గతంలో ఆయన ఆంధ్రప్రదేశ్‌లో చేసిన ప్రసంగాలు తెలంగాణ మరిచిపోయిందని భావించారు కాబోలు. ప్రజల జ్ఞాపక శక్తి చాలా తక్కువని అంచనా వేసుకున్నాడేమో. కానీ, అది తప్పు అని తెలుసుకునేందుకు 24 గంటలు కూడా పట్టలేదు. పన్నెండేళ్ళైనా తెలంగాణ ప్రజల్లో భావోద్వేగం తగ్గలేదని మరుసటి రోజు అమరావతిలో పవన్ కల్యాణ్ అనడమే అందుకు నిదర్శనం.

తెలంగాణ ఎవరి జాగీరు కాదని, వచ్చే ఎన్నికలలో తన పార్టీ ఇక్కడ నుంచి పోటీ చేస్తుందని, తెలంగాణ భారతదేశంలో అంతర్భాగమని, ఇక్కడకు ఎవరైనా రావొచ్చునని పవన్ కల్యాణ్ అన్న మాటలు మామూలుగానైతే తప్పుబట్టాల్సినవేమి కాదు. పన్నెండేళ్ళైనా ఇక్కడకు రావొద్దని భయపెడితే ఎలా? ప్రాంతీయవాదం ఉగ్రవాదం కన్నా ప్రమాదకరమైనదని, దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలనడం నిస్సందేహంగా తెలంగాణ ప్రజలను కవ్వించేవిగా ఉంది. తెలంగాణ ఉద్యమ సమయంలో కానీ, పన్నెండేళ్ళ రాష్ట్ర గమనంలో కానీ ఎన్నడూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారిపై దాడులు చేసిన ఘటన మచ్చుకైనా కనిపించలేదు. పైగా స్వంత రాష్ట్రాలకు వెళ్ళాలని బెదిరించిన దాఖలాలు లేవు. ఆంధ్ర ప్రదేశ్ విభజన తరువాత కూడా సీమాంధ్రులు స్వేచ్ఛగా హైదరాబాద్‌లో ఉద్యోగ, వ్యాపారాలు చేసుకుంటున్నారు. అంతెందుకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ కూడా ఇప్పటికీ హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారు. అయినప్పటికీ ప్రాంతీయవాదం, బెదిరిస్తున్నారంటూ వపన్ కల్యాణ్ వ్యాఖ్యలు చేయడం, అందుకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజునే ఎంచుకోవడం ఉద్దేశపూర్వకంగానే జరిగినట్లు కనపడుతోంది. పైగా తాను తెలంగాణకు వ్యతిరేకం కాదంటూనే, పార్లమెంటు తలుపులు మూసి విభజన జరిగిన తీరుకు వ్యతిరేకమన్న మాటల్లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ఆయన అక్కసును చెప్పకనే చెబుతోంది. ఎందుకంటే, పార్లమెంటులోనైనా, శాసనసభలోనైనా ఏ బిల్లుపై మీదైనా డివిజన్(ఓటింగ్)ను తలుపులు మూసే నిర్వహిస్తారనే ప్రాథమిక సూత్రం ఆంధ్రప్రదేశ్‌కు డిప్యూటీ సిఎంగా, శాసనసభ్యుడిగా ఉన్న పవన్ కల్యాణ్‌కు తెలియదనుకోవడం హాస్యాస్పదమే.అందుకే ఆయన వ్యాఖ్యలను తెలంగాణ సమాజమంతా ముక్తకంఠంతో ఖండించిన తీరు నాటి తెలంగాణ ఉద్యమకాలం నాటి స్ఫూర్తిని గుర్తు చేసింది. పార్టీలు సైతం అందులో రాజకీయ ప్రయోజనాలను వెతుక్కోకుండా పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించాయి.

వాస్తవానికి తెలంగాణలో పవన్ కల్యాణ్ తిరగడం, జనసేన పార్టీ పోటీ చేయడాన్ని ఎవరూ తప్పుబట్టరు. కానీ, ఆయన తెలంగాణ ఆత్మను పట్టలేకపోయారు. ఇంకా ప్రజల మనోభావాలను ప్రాంతీయవాదంతో పోల్చడంలోనే ఆయన అవగాహన రాహిత్యాన్ని తెలియజేస్తుంది. సుప్రీం కోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి చెప్పినట్లుగా ఇది ప్రాంతీయ వాదం కాదు అస్థిత్వవాదమని గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఒక సదస్సులో కుండబద్ధలు కొట్టారు. నాకు తెలంగాణ అంటే ప్రేమ అని పదే పదే చెప్పుకున్న పవన్ కల్యాణ్, దానిని చేతల్లో ప్రదర్శిస్తే ప్రజలు విశ్వసిస్తారు. గొడవల కోసం కాదు సమస్యలపై తెలంగాణలో తిరిగేందుకు సిద్ధమని ఆయన ప్రకటించడం మంచిదే. జనసేన అధికారం పంచుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెనుకబడిన వలసల పాలమూరు జిల్లాకు నీరందించే పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టుకు మోకాలడ్డకుండా చూస్తే, తెలంగాణ ప్రజలు ఆ పార్టీ పట్ల వైఖరి మార్చుకునేందుకు ఆస్కారం ఉంటుంది.

'ప్రపంచకార్మికులారా ఏకంకండి' అని పిలుపునిచ్చిన వామపక్షాలు ఇప్పుడు ప్రాంతీయ వాదానికి మద్దతిచ్చినందుకే కమ్యూనిజం చచ్చిపోయిందన్న పవన్ కల్యాణ్ అజ్ఞానాన్ని పట్టిస్తోంది. కమ్యూనిస్టు పార్టీ మద్దతిచ్చింది ప్రాంతీయవాదానికి కాదు, అన్యాయం జరిగిన ప్రజలకనేది విస్పష్టం. అలాగే, ఆయన అన్నట్లుగా కమ్యూనిజం చచ్చిపోలేదు, ఆ సిద్ధాంతం అంతమవ్వలేదు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 21 దేశాలకు పైగా కమ్యూనిస్టు పార్టీ, సోషలిస్టు పార్టీ, వర్కర్స్ పార్టీలు ప్రత్యక్షంగా, లేదంటే ప్రభుత్వంలో భాగస్వామిగా అధికారంలో ఉన్నాయి. 800 కోట్ల ప్రపంచ జనాభాలో 220 కోట్ల మందికిపైగా ఆ ప్రభుత్వాల పాలనలో ఉన్నారు. అమెరికాలోని ప్రతిపక్ష డెమోక్రాటిక్ పార్టీ, బ్రిటన్‌లోని అధికార లేబర్ పార్టీలలో అంతర్గతంగా తమ పార్టీ వామపక్ష మొగ్గు తీసుకోవాలని పెద్ద ఎత్తున ఒత్తిడి సాగుతోంది. మరో 150 దేశాలలో కమ్యూనిస్టు పార్టీలు మనుగడ సాగిస్తున్నాయి. జనసేన సహా భారతదేశంలో కొత్తగా పుట్టుకొచ్చే ఏ పార్టీయైనా మొదట్లో ప్రజల విశ్వసనీయత కోసం తమది కమ్యూనిస్టు సిద్ధాంతమేనని, లేదా దాంతో దగ్గరని చెప్పుకునేవే. అంతెందుకు, రాజకీయాలలోకి వచ్చే ముందు తనకు ప్రపంచ విప్లవకారుడు చేగువేరా అంటే ఇష్టమని, ఆయన ఫోటోలు పెట్టుకొని, ఆయన తరహాలో బట్టలు తొడుక్కొని జనంలోకి తిరిగిన పవన్ కల్యాణ్ ఇప్పుడు వాటన్నిటినీ మరచి సనాతన ధర్మ ప్రవచనకారుడిగా మారిపోవడం చూస్తూనే ఉన్నాం. అకస్మాత్తుగా ఎన్‌డిఏ భాగస్వామి పవన్ కల్యాణ్‌కు తెలంగాణపై ప్రేమ పుట్టుకురావడం దక్షిణాదిలో పట్టుబిగించాలనే బిజెపి వ్యూహంలో భాగమేనని పరిశీలకులు భావిస్తున్నారు. అందుకు ఆయన మాటల్లో వినపడిన 'హిందీ గోబ్యాక్', 'జాతీయవాదం' అనే పదాలే ఊతమిస్తున్నాయి. దశాబ్దాల పోరాట చరిత్ర కలిగిన తెలంగాణ ప్రజలు ఎవరి వెనుక ఎవరున్నారని తెలుసుకోలేనంత అమాయకులేమీ కాదు. ●



## పవన్ కల్యాణ్.. విభజన హామీలను సాధించు

**తెలంగాణలో పవన్ కల్యాణ్ ప్రజానాయకుడిగా ఎదగాలనుకుంటే.. తప్పేమీలేదు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో తెలంగాణకు, ఆంధ్రకు ఇంకా తీర్చవలసిన హామీలు చాలా ఉన్నాయి. వాటిని సాధించడానికి కేంద్రంపై యుద్ధం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి సహకరించండి.. లేదా టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును ఒప్పించి, కూటమి తరపునో లేదా వ్యక్తిగతంగానో పోరాడి, ఆ హామీలను సాధించి ప్రజల అభిమానాన్ని చూరగొనండి. మీరు రాజశేఖరరెడ్డి పేరును ప్రస్తావిస్తూ, ఒక పోలీస్ ఉన్నతాధికారి మీకు ఏదో చెప్పాడని చేసిన వ్యాఖ్యలు పూర్తి అసత్యమని తెలుస్తోంది.. ఆయన సిఎంగా ఉన్నప్పుడు మీ మీద, మీ కుటుంబ వ్యవహారాలకు సంబంధించి మీలో మీరు పెట్టుకున్న కేసులు తప్ప, ఎలాంటి తప్పుడు రాజకీయ కేసులు బనాయించినట్లు ఆధారాలు లేవు.**

\- కాంగ్రెస్ మాజీ ఎంపి
కె.వి.పి.రామచంద్రరావు బహిరంగ లేఖ

# విద్యా కార్పొరేటీకరణను ప్రతిఘటిద్దాం

## జూన్ 5న ధర్నా

తెలంగాణలో విద్యారంగం తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుందనే దానిపై ఎవరికీ పేచీ లేదు. తెలంగాణలో విద్యా విధానం దేశానికే ఆదర్శంగా ఉండాల ని కోరుకోవడంలో ఎవరికీ భేదాభిప్రాయం లేదు. అయితే ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి ఎటువంటి విద్యా విధానం కావాలి అనే దగ్గరనే పౌరునికి, రాజ్యానికి ఘర్షణ. ఈ విషయంలోనే ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య పోరాటం. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం జాతీయ విద్యా విధానం ద్వారా విద్యారంగంలో కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణలను వేగవంతం చేస్తున్నది. అందులో భాగంగా ఈ మధ్యకాలంలో ఎన్‌టిఎ లాంటి కేంద్రీకృత పరీక్షా సంస్థకు ఆమోద ముద్రవేసి పేపర్ల లీకులు, అమ్ముకోవడాన్ని ప్రోత్సహించడం వలన ఈ సంవత్సరం నీట్ పరీక్ష రాసిన 22లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు బుగ్గిపాలైయింది. ఇటువంటి దుష్పరిణామాలకు దారితీస్తున్న జాతీయ విద్యావిధానాన్ని రాష్ట్రంలో అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు కావస్తున్నా విద్యారంగం లో రివ్యూ మీటింగ్‌లు తప్ప టిఆర్‌ఎస్/బిఆర్‌ఎస్ అమలు చేసిన కార్పొరేటీకరణ విధానాలే కొనసాగుతున్నాయి. విద్యపై పెట్టే ప్రతి రూపాయి ఖర్చు కాద ని, అది భవిష్యత్తు తరాలకు పెట్టుబడి అని చెప్పుకుంటూనే దేశంలోనే అన్ని రాష్ట్రాల కన్నా అత్యంత తక్కువగా విద్యకు బడ్జెట్ కేటాయించిన ఘనత రాష్ట్రం ప్రభుత్వానికే దక్కింది. తాను ఎన్నికల మేనిఫెస్టోలో విద్యకు 15% కేటాయిస్తానని చెప్పి తామే ఉల్లంఘించిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కింది. దేశంలోనే సగటు విద్యా బడ్జెట్ 15% అయితే, తెలంగాణలో కేటాయించింది మాత్రం 8.2 శాతం దాటలేదు. రాష్ట్రంలో ప్రతి 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ని కేటాయిస్తున్నామని ముఖ్యమంత్రి ఎంత చెప్పినా వాస్తవంగా ప్రభుత్వ లోకల్ బాడీ పాఠశాలలు 24 వేల 222 పాఠశాలలు ఉంటే 16 వేల 299 పాఠశాలల్లో ఇద్దరే టీచర్లు ఉన్నారు. ప్రాథమిక పాఠశాలలు 18 వేల 317 ఉంటే 16 వేల పాఠశాలల్లో ఐదు తరగతుల కు ఐదుగురు టీచర్లు కూడా లేరు. దాదాపు 11వేల 142 పాఠశాలలు మూడు గదులతోనే నడుస్తున్నాయి. మానిటరింగ్ వ్యవస్థ కుప్పకూలిపోయింది. మొత్తం 33 జిల్లాలలో 23 జిల్లాలకు డిఓలు లేరు. మొత్తం 633 మండలాలు ఉంటే 612 మండలాల్లో ఎంఇఒ లు లేరు. ఇలా మానిటరింగ్ వ్యవస్థ బలహీనపడటం వలన ఉపాధ్యాయుల్లో బోధన పట్ల అశ్రద్ధ, నిర్లక్ష్యం పెరుగుతూ వస్తూ ఉన్నది. పూర్వ ప్రాథమిక విద్యను 15 వేల 919 స్కూళ్లలో ప్రవేశపెట్టే బదులు కేవలం 2,500 స్కూళ్లలో మాత్రమే ప్రవేశపెడతామని ప్రభుత్వం చెపుతున్నది. ఆ స్కూళ్లలో కూడా తరగతి గదుల నిర్మాణం, సుశిక్షితులైన టీచర్ల నియామకం ఇంతవరకు జరుగలేదు. ఫలితంగా ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట దారి తప్పింది.



**ముఖ్య డిమాండ్లు:**

- కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం 20 శాతం నిధులు విద్యకు కేటాయించాలి. జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలి.
- అనుమతులు లేని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను మూసివేయాలి. ఇప్పటినుండి ఆ సంస్థలకు కొత్తగా అనుమతులు ఇవ్వరాదు. ప్రస్తుతం నడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలను నియంత్రించడానికి కావాల్సిన చట్టం చేసి పకడ్బందీగా అమలు చేయాలి.
- అన్ని ప్రాథమిక పాఠశాలల్లో ప్రమాణాలు గల పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలి. అందుకొరకు సుశిక్షితులైన ఉపాధ్యాయులను నియమించాలి.
- మధ్యాహ్న భోజన పథకంలో, అల్పాహారం, స్నాక్స్ సరఫరాను ఇస్కాన్ సంస్థకు, వందే మాతరం ఫౌండేషన్లకు అప్పజెప్పే నిర్ణయాన్ని రద్దు చేయాలి.
- పాఠశాలల్లో, కళాశాలల్లో, విశ్వవిద్యాలయాలలో ఖాళీలు నింపాలి. బోధనేతర పోస్టులను వెంటనే నింపాలి.
- ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో ఏర్పడిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి బదులు రాష్ట్రంలోని 17 ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను, అన్ని పాలిటెక్నిక్ కళాశాలలను, ఐటిఐలను సమగ్రంగా అభివృద్ధి చేసి తెలంగాణ యువతకు సామాజిక శాస్త్రాలను, ఉద్యోగాలు వచ్చే నైపుణ్యాలను నేర్పించాలి.

**వీటి సాధనకు జూన్ 5న(నేడు) హైదరాబాద్‌లోని సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు నిర్వహించే ప్రదర్శన, ధర్నాలను జయప్రదం చేయండి.**

**తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ**
(టిపిటిఎఫ్, డిటిఎఫ్,టిఆర్ఇఐటిఎ, పిడిఎస్‌యు, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు(వి), పివైఎల్, ఎఐవైఎఫ్, పివైఎల్, పిఎవి. ఎస్‌సిఐఇ)

# కీలక ఆర్థిక సవాళ్లు ఎదుర్కొంటున్న మోదీ సర్కార్

**ఆర్.సూర్యమూర్తి**

గడిచిన దశాబ్ద కాలంలో చాలామటుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇతర ఏ నాయకుడికీ లభించని ఒక రాజకీయ ప్రయోజనం చేకూరింది. అది ఒక సంక్షోభం సంభవించినప్పుడు, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన మరొక పటిష్టమైన విభాగం ఆ నష్టాన్ని పూడ్చేందుకు అండగా నిలిచేది.

సరిగ్గా నోట్ల రద్దు ఆర్థిక కార్యకలాపాలను అస్తవ్యస్తం చేసిన సమయంలో ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు తక్కువగా ఉన్నాయి. బ్యాంకింగ్ సంక్షోభం పెట్టుబడుల వేగాన్ని తగ్గించినప్పుడు వినియోగం బలంగా నిలిచింది. కోవిడ్ మహమ్మారి సందర్భంలో మునుపెన్నడూ లేని విధంగా అందిన ఆర్థిక, ద్రవ్య మద్దతు ఆ సంక్షోభ ప్రభావాన్ని తగ్గించింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కారణంగా తీవ్ర ద్రవ్యోల్బణం ఉన్న కాలంలో సైతం బలమైన పన్ను వసూళ్లు, స్థిరమైన సేవల ఎగుమతులు ఆర్థిక వ్యవస్థను కాపాడాయి.

కానీ నేడు ఆ రక్షణ కవచం మాయమవుతోంది. భారతదేశం ఒకేసారి పలు బలహీనతలు తెరపైకి వస్తున్న కాలంలోకి ప్రవేశిస్తోంది. పశ్చిమాసియా సంఘర్షణల కారణంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. రుతుపవనాల గమనం క్షీణిస్తోంది. బ్యాలెన్స్ ఆఫ్ పేమెంట్స్ (చెల్లింపుల అంతరం) లోటులోకి జారిపోయింది. విదేశీ మూలధన ప్రవాహాలు బలహీనపడుతున్నాయి. గ్రామీణ డిమాండ్ ఇప్పటికీ ఆశాజనకంగా లేదు. గత సంక్షోభాల సమయంతో పోలిస్తే ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటు చాలా వరకు కుదించుకుపోయింది. వీటన్నింటినీ కలిపి చూస్తే, ఇవి మోదీ కాలంలోనే అత్యంత ముఖ్యమైన రాజకీయ ఆర్థిక సవాలుగా మారవచ్చు. అయితే, భారతదేశం 1991తరహా సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని దీని అర్థం కాదు. అలాంటి పరిస్థితి లేదు. విదేశీ మారకద్రవ్య నిల్వలు ఇప్పటికీ పుష్కలంగా ఉన్నాయి. పదేళ్ల క్రితంతో పోలిస్తే బ్యాంకులు మెరుగ్గా ఉన్నాయి. కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు బలంగా ఉన్నాయి. సేవల ఎగుమతులు పెద్ద మొత్తంలో విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చిపెడుతూనే ఉన్నాయి.

**మొదటి సవాలు** : అసలైన ప్రమాదం ఏమిటంటే, భారతదేశం ఒకే సమయంలో తక్కువ వృద్ధి రేటు, ఎక్కువ ద్రవ్యోల్బణం ఉండే కాలంలోకి ప్రవేశించవచ్చు. ఈ విధమైన పరిస్థితిని 2014 నుండి విధాన నిర్ణేతలు చాలా వరకు నివారించగలిగారు. ఆ తేడా చాలా కీలకం. వృద్ధి రేటు బలంగా ఉంటే అధిక ద్రవ్యోల్బణాన్ని రాజకీయంగా సర్దుబాటు చేయవచ్చు. ధరలు స్థిరంగా ఉంటే నెమ్మదించిన వృద్ధి రేటునైనా భరించవచ్చు. కానీ ఆదాయాలు పెరగకుండా, ధరలు మాత్రం పెరిగితే, ప్రభుత్వాలు ఇరువైపులా చిక్కుకుపోతాయి. ప్రస్తుతం సరిగ్గా ఇలాంటి ముప్పునే ఎదుర్కొంటున్నాం. మొదటి సవాలు బాహ్యమైనది. ఇన్నాళ్లూ భారతదేశ ఆర్థిక నిర్వాహకులు ఒక సాధారణ సూత్రాన్ని నమ్ముకున్నారు. పెద్ద మొత్తంలో ఉండే వాణిజ్య లోటును విదేశీ చెల్లింపులు, సేవల ఎగుమతులు, విదేశీ మూలధనం ద్వారా భర్తీ చేయవచ్చని భావించారు. ఈ ఏర్పాటు పరిపూర్ణమైనది కాకపోయినా, ఇప్పటివరకు సాగిపోయింది.

కానీ ఇప్పుడు ఆ సమీకరణం మారుతోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నివేదిక ప్రకారం, దేశ చెల్లింపుల లోటు 30 బిలియన్ డాలర్లకు పైగా దిగువలోకి జారిపోయింది. ఈ లోటు కంటే కూడా, దీని వెనుక ఉన్న కారణమే మరింత ఆందోళన కలిగిస్తోంది. విదేశీ మూలధన ప్రవాహాలు మందగిస్తున్నాయి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) బలహీనపడ్డాయి. పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు మరింత ఆచితూచి అడుగులు వేస్తున్నారు. అత్యల్ప వడ్డీ రేట్ల కాలంలో ఉన్నంత సమృద్ధిగా అంతర్జాతీయ నిధులు ఇప్పుడు అందుబాటులో లేవు. ఇది కొత్త బలహీనతను సృష్టిస్తోంది. భారతదేశం తన ముడి చమురు అవసరాలలో దాదాపు 90 శాతాన్ని దిగుమతి చేసుకుంటుంది. చమురు ధరలు నిరంతరం పెరుగుతుండడంతో కరెంట్ ఖాతా లోటు పెరుగుతోంది, రూపాయి ఒత్తిడికి లోనవుతోంది. ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ప్రభుత్వం ఈ ప్రభావాన్ని కొంతవరకు భరించగలదు. ఆర్‌బిఐ కరెన్సీ మార్కెట్‌లో జోక్యం చేసుకోగలదు. కానీ రెండూ కూడా ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించలేవు.

**రెండవ సవాలు** దేశీయమైనది. బలహీనమైన రుతుపవనాలు కేవలం వ్యవసాయ సమస్య మాత్రమే కాదు. ఆర్థికవేత్తలు తరచుగా దీని రాజకీయ ప్రాముఖ్యతను తక్కువగా అంచనా వేస్తుంటారు. జిడిపికి వ్యవసాయం అందించే వాటా కేవలం 15 శాతం మాత్రమే కావచ్చు, కానీ దేశ శ్రామిక శక్తిలో దాదాపు సగం మంది దీనిపైనే ఆధారపడి ఉన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా, గ్రామీణ భారతదేశమే ఎన్నికల రాజకీయాలకు వెన్నెముక. కాబట్టి భారత వాతావరణ విభాగం (ఐఎండి) దీర్ఘకాల సగటు కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందంటూ ఇచ్చిన సవరించిన అంచనాను కేవలం ఒక వాతావరణ మార్పుగా కాకుండా, ఒక స్థూల ఆర్థిక ముప్పుగా చూడాలి.

భారతదేశం గతంలోనూ ఇలాంటి పరిస్థితులను చూసింది. 2002 నాటి కరవు వృద్ధి రేటును తీవ్రంగా తగ్గించింది. 2009 లో




రుతుపవనాలు మందగమనంతో ఆహార ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయికి చేరింది. 2014, 2015 లలో వరుసగా బలహీనమైన రుతుపవనాలతో గ్రామీణ డిమాండ్, వ్యవసాయ ఆదాయాలు దెబ్బ తిన్నాయి. నేటి ఆర్థిక వ్యవస్థ మరింత వైవిధ్యమైనది, మరింత పాతుకుపోయింది. అయినప్పటికీ, కొన్ని వాస్తవాలు మారలేదు. బలహీనమైన రుతుపవనాలు ఆహార ధరలను పెంచుతాయి. అధిక ఆహార ధరలు గృహాల కొనుగోలు శక్తిని తగ్గిస్తాయి. తక్కువ వ్యవసాయ ఆదాయాలు వినియోగాన్ని బలహీనపరుస్తాయి. బలహీనమైన వినియోగం చివరకు ఉత్పాదకత, గృహనిర్మాణం, రిటైల్ వ్యాపారం మరియు ఉపాధిపై ప్రభావం చూపుతుంది.

దీని రాజకీయ ప్రభావాలు కూడా అంతే ముఖ్యమైనవి. మోదీ పాలనలో చాలా కాలం వరకు, సంక్షేమ బదిలీలు , మౌలిక సదుపాయాల వ్యయం గ్రామీణ ఆదాయాల బలహీనతను భర్తీ చేశాయి. కానీ నిరంతర ఆదాయ వృద్ధికి బదులుగా కేవలం ప్రభుత్వ బదిలీలపైనే ఎంతకాలం ఆధారపడగలరనే దానికి పరిమితులు ఉన్నాయి.

ఇక్కడే **మూడవ సవాలు** ఎదురవుతోంది. ప్రభుత్వ విధానపరమైన వ్యూహాలకు వెసులుబాటు క్రమంగా తగ్గుతోంది. కోవిడ్ మహమ్మారి సంక్షోభ సమయాల్లో ద్రవ్య విస్తరణ అనివార్యమైంది. ఆ తర్వాత నుండి, న్యూఢిల్లీ మూలధన వ్యయాన్ని పెంచుతూనే, ఆర్థిక క్రమశిక్షణపై దృష్టి పెట్టింది. ఆ వ్యూహం వృద్ధికి మద్దతుగా నిలిచింది. పెట్టుబడిదారులలో విశ్వాసాన్ని పెంచింది. అయితే, అధిక చమురు ధరలు, బలహీనమైన రుతుపవనాల కలయిక ప్రభుత్వ ఖజానాపై విభిన్న ఒత్తిళ్లను తీసుకురావచ్చు. ఆహార ద్రవ్యోల్బణం పెరిగితే, అదనపు సంక్షేమ పథకాల కోసం ఒత్తిడి పెరుగుతుంది. ఎరువుల ధరలు పెరిగితే, రాయితీల అవసరాలు పెరుగుతాయి. గ్రామీణ సంక్షోభం తీవ్రమైతే, మద్దతు ధరలు, ఆదాయ బదిలీలను పెంచాలనే డిమాండ్లు పెరుగుతాయి. ప్రభుత్వం త్వరలోనే ఆర్థిక క్రమశిక్షణకు, రాజకీయ అవసరాలకు మధ్య కష్టతరమైన ఎంపికలను ఎదుర్కోవాల్సి రావచ్చు.

**నాలుగవ సవాలు** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు సంబంధించినది. ద్రవ్య విధానం పరిష్కరించలేని ఒక సమస్యను ఆర్‌బిఐ ఎదుర్కొంటోంది. వడ్డీ రేట్లు వర్షాన్ని కురిపించలేవు. ముడి చమురు ధరలను తగ్గించలేవు. భౌగోళిక రాజకీయ ఘర్షణలను ముగించలేవు. అయినప్పటికీ, ఆహారం, ఇంధనం, కరెన్సీ విలువ క్షీణత వల్ల ఏర్పడే ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, కేంద్ర బ్యాంకును తాను కోరుకున్న దానికంటే మరింత కఠినమైన వైఖరిని అవలంబించేలా చేయవచ్చు. ఇది రాజకీయ ఆర్థిక వ్యవస్థలో ఎదురయ్యే ఒక గొప్ప డోలాయమానం. విధాన నిర్ణేతల వద్ద ఉన్న సాధనాలు డిమాండ్‌ను మాత్రమే నియంత్రించగలవు, కానీ ప్రస్తుతం ఎదురవుతున్న ఒడిదుడుకులు సరఫరా వైపు నుండి వస్తున్నాయి. దీని ఫలితంగా తరచుగా విధానపరమైన నిరాశ ఎదురవుతుంది. దీని వెనుక దృష్టి సారించాల్సిన మరో లోతైన సమస్య ఉంది.

దశాబ్ద కాలానికి పైగా, భారతదేశ ఆర్థిక కథనం 'స్థితిస్థాపకత' చుట్టూనే నిర్మితమైంది. ప్రతి బాహ్య సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడల్లా, ఇతర అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల కంటే భారతదేశం మెరుగైన స్థితిలో ఉందనే వాదన వినిపించింది. అనేక విషయాల్లో ఆ వాదన ఇప్పటికీ సరైనదే. కానీ స్థితిస్థాపకత అంటే సంక్షోభాల నుండి పూర్తిగా మినహాయింపు పొందడం కాదు. దిగుమతి చేసుకునే ఇంధనంపై దేశం ఆధారపడటం ఇంకా చాలా ఎక్కువగా ఉంది. వ్యవసాయ ఉత్పత్తి ఇప్పటికీ వర్షపాతం పైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. ప్రైవేట్ పెట్టుబడులు అసమానంగా ఉన్నాయి. జిడిపి గణాంకాలు బలంగా ఉన్నప్పటికీ, ఉపాధి వృద్ధి ఇప్పటికీ ఆందోళనకరంగానే ఉంది.

ప్రస్తుత సంక్షోభాల సమ్మేళనం, 2014 తర్వాత మునుపెన్నడూ లేని విధంగా ఈ నిర్మాణపరమైన బలహీనతలను స్పష్టంగా బయటపెడుతోంది. అందుకే ప్రధాన మంత్రి మోదీ ఇటీవల ఇంధన పొదుపు, బంగారం కొనుగోళ్ల తగ్గింపు, విలాసవంతమైన ఖర్చులపై నియంత్రణ పాటించాలని చేసిన విజ్ఞప్తి శ్రద్ధ చూపించాల్సింది. ఇలాంటి సందేశం అసాధారణమైనది. ఎందుకంటే రాబోయే సవాలును కేవలం ప్రభుత్వ చర్యల ద్వారా మాత్రమే పరిష్కరించలేమనే గుర్తింపును ఇది ప్రతిబింబిస్తుంది. ఆర్థిక నిర్వహణ మరింత కష్టతరమైన దశలోకి ప్రవేశిస్తోంది. భారతదేశం తాత్కాలిక మందగమనాన్ని ఎదుర్కొంటుందా లేదా అది మరింత కాలం కొనసాగుతుందా అనేది రాబోయే కొన్ని నెలలు నిర్ణయిస్తాయి. చాలావరకు న్యూఢిల్లీ చేతుల్లో లేని అంశాలైన వర్షపాతం, చమురు ధరలు, అంతర్జాతీయ మూలధన ప్రవాహాలపైనే ఇది ఆధారపడి ఉంటుంది. అయినప్పటికీ, పెద్ద ప్రశ్న రాజకీయమైనదే.

ప్రభుత్వం ద్రవ్యోల్బణాన్ని నియంత్రిస్తూనే వృద్ధిని కొనసాగించగలదా? ఆర్థిక క్రమశిక్షణను వదలకుండా గ్రామీణ ఆదాయాలను రక్షించగలదా? స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకుంటూనే విదేశీ మూలధనాన్ని ఆకర్షించగలదా? ఇవి కేవలం ఆర్థికపరమైన ప్రశ్నలు మాత్రమే కావు. ఇవి మోదీ మూడో విడత పాలన రాజకీయ ఆర్థిక వ్యవస్థను రూపకల్పన చేసే ప్రశ్నలు.

2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా, ప్రధానమంత్రి ఒకే ఒక సంఘటన లేదా ఒకే ఒక విధాన నిర్ణయం ద్వారా మాత్రమే నిర్వచించలేని సవాలును ఎదుర్కొంటున్నారు. ఇది నిర్మాణపరమైన బలహీనతలు, బాహ్య ఒడిదుడుకులు, దేశీయ అనిశ్చితుల సమ్మేళనం. ఇది కేవలం ఒక ఆర్థిక పరీక్ష మాత్రమే కాదు. ఇది బహుశా మోదీ హయాంలోనే అత్యంత కీలకమైన పాలనా పరీక్ష కావచ్చు.

# మణిపూర్‌ది భూమి, అస్తిత్వాల పోరాటం

ఈశాన్య భారతదేశంలోని మణిపూర్ రాష్ట్రం గత కొన్నేళ్లుగా తీవ్ర సామాజిక ఉద్రిక్తతలు, జాతి విభేదాలు, భూవివాదాలతో అల్లకల్లోల పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు పరస్పర సహజీవనానికి నిలయంగా ఉన్న ఈ ప్రాంతం నేడు అనుమానాలు, అవిశ్వాసాలు, ప్రతీకార భావనలతో నిండిపోయింది. మైతేయి, కుకీ, నాగా సమాజాల మధ్య నెలకొన్న విభేదాలు కేవలం రాజకీయ లేదా పరిపాలనా సమస్యలు మాత్రమే కావు. ఇవి భూమి, అస్తిత్వం, సంప్రదాయ హక్కులు, చారిత్రక గుర్తింపు వంటి అంశాలతో ముడిపడి ఉన్న సంక్లిష్టమైన వివాదాలు.

మణిపూర్‌లోని లోయ ప్రాంతాలు ప్రధానంగా మైతేయి సమాజానికి కేంద్రంగా ఉన్నాయి. కొండ ప్రాంతాలలో నాగాలు, కుకీలు నివసిస్తూ వచ్చారు. కాలక్రమేణా భూహక్కుల విషయంలో విభిన్న అభిప్రాయాలు ఏర్పడ్డాయి. కొండ ప్రాంతాలపై తమకే సంప్రదాయ యాజమాన్య హక్కులు ఉన్నాయని నాగాలు వాదిస్తుంటే, తాము కూడా శతాబ్దాలుగా అక్కడే జీవిస్తున్నామని కుకీలు చెబుతున్నారు. ఈ విభేదాలు క్రమంగా ఘర్షణలకు దారితీశాయి. ఇప్పుడు ఈ వివాదం మళ్లీ ప్రమాదకర దశకు చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

గత శతాబ్దపు తొంభైల కాలంలో నాగా, కుకీ సమాజాల మధ్య జరిగిన ఘర్షణలు వేలాది కుటుంబాల జీవితాలను అతలాకుతలం చేశాయి. అనేకమంది ప్రాణాలు కోల్పోగా, మరెందరో తమ నివాస ప్రాంతాలను విడిచి వెళ్లవలసి వచ్చింది. ఆ చేదు జ్ఞాపకాలు ఇంకా ప్రజల మనసుల్లో చెరిగిపోలేదు. ప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలు ఆ రక్తచరిత్ర మళ్లీ పునరావృతమవుతుందనే భయాన్ని పెంచుతున్నాయి.




ఈ సంక్షోభానికి మూల కారణాలలో ప్రధానమైనది భూవ్యవస్థ. లోయ ప్రాంతాలలో ఆధునిక చట్టాలు అమలులో ఉండగా, కొండ ప్రాంతాలలో సంప్రదాయ ఆచారాల ఆధారంగా భూముల నిర్వహణ కొనసాగుతోంది. ఫలితంగా ఒకే రాష్ట్రంలో రెండు వేర్వేరు విధానాలు అమలవుతున్నాయి. ఈ పరిస్థితి అనేక అపోహలకు, వివాదాలకు కారణమవుతోంది. కొండ ప్రాంతాలలో భూములపై స్థానిక గిరిజన సమాజాలకు మాత్రమే ప్రత్యేక హక్కులు ఉండడం, ఇతర వర్గాలకు ఆ అవకాశాలు లేకపోవడం అసంతృప్తిని పెంచుతోంది.

మైతేయి సమాజం తమ భూములు, సాంస్కృతిక గుర్తింపును కాపాడుకోవడానికి ప్రత్యేక రక్షణ అవసరమని భావిస్తోంది. మరోవైపు కొండ ప్రాంతాల గిరిజన సమాజాలు తమ సంప్రదాయ హక్కులను కోల్పోతామనే ఆందోళనలో ఉన్నాయి. ఈ రెండు వర్గాల భయాలు, అనుమానాలు ఒకదానికొకటి విరుద్ధంగా కనిపించినప్పటికీ, వాటి వెనుక ఉన్న కారణాలు వాస్తవమే. అందువల్ల ఒక వర్గాన్ని మాత్రమే సమర్థించడం ద్వారా సమస్యకు పరిష్కారం లభించదు.

ఈ వివాదాన్ని మరింత క్లిష్టతరం చేస్తున్న అంశం సాయుధ గుంపుల ఉనికి. వివిధ సమాజాలకు చెందిన సాయుధ వర్గాలు తమ ప్రయోజనాల కోసం ప్రజల భావోద్వేగాలను ఉపయోగించుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల సాధారణ ప్రజల జీవితాలు మరింత అసురక్షితంగా మారుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు భయాందోళనల మధ్య జీవించవలసిన పరిస్థితి ఏర్పడుతోంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో సమస్యలకు పరిష్కారం చర్చల ద్వారానే సాధ్యమవుతుంది. కానీ మణిపూర్‌లో పరస్పర నమ్మకం పూర్తిగా దెబ్బతినడం వల్ల సంభాషణకు కూడా అవకాశాలు తగ్గుతున్నాయి. ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం, గత సంఘటనలను గుర్తుచేసుకుని ద్వేషాన్ని పెంచుకోవడం వల్ల శాంతి ప్రయత్నాలు ఫలించడంలేదు. ఈ పరిస్థితిలో ప్రభుత్వాల పాత్ర అత్యంత కీలకంగా మారుతుంది.

కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర పరిపాలన పూర్తిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. ఏ సమాజానికీ అనుకూలంగా లేదా ప్రతికూలంగా కనిపించే చర్యలు పరిస్థితిని మరింత దిగజార్చే ప్రమాదం ఉంది. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూనే, అమాయక ప్రజలకు భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రధాన బాధ్యత కావాలి. అదే సమయంలో అన్ని వర్గాల ప్రతినిధులతో నిరంతర చర్చలు జరిపి నమ్మకాన్ని పునరుద్ధరించాలి. మణిపూర్ సమస్య కేవలం ఒక రాష్ట్రానికి సంబంధించినది కాదు. ఇది దేశ సమగ్రత, జాతీయ భద్రత, సామాజిక సామరస్యంతో ముడిపడి ఉంది. అందువల్ల తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి, దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

భూమి కోసం, గుర్తింపు కోసం, హక్కుల కోసం జరుగుతున్న ఈ పోరాటం చివరకు మానవ జీవితాలను బలితీసుకోకూడదు. శాంతి, పరస్పర గౌరవం, న్యాయం అనే మూడు మూల సూత్రాల ఆధారంగానే మణిపూర్ భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుంది. చరిత్రలో జరిగిన పొరపాట్లను మళ్లీ పునరావృతం చేయకుండా, సంభాషణల ద్వారానే శాశ్వత పరిష్కార మార్గాన్ని కనుగొనడం కాలానుగుణ అవసరం.

వెంకగారి భూమయ్య
9848559863

# ఉద్యమకారులకు సముచిత గౌరవం ఇవ్వాలి

తెలంగాణ ఉద్యమ కారుల కమిటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైన వివిధ సంఘాలతో సమావేశమై అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని 'తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ' నిర్ణయించింది. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారికి సముచిత గౌరవం ఇవ్వాలని, ఈ విషయంలో మరోసారి సమావేశం కావాలని, అవసరమైతే ఆన్‌లైన్‌ద్వారా కూడా అభిప్రాయ సేకరణ చేపట్టాలని ఒక అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది. త్వరలోనే 'తెలంగాణ అమర వీరుల స్మారక స్తూపం' ప్రాంగణంలో కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ సలహాదారు, తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె.కేశవరావు అధ్యక్ష తన హైదరాబాద్‌లోని బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో గురువారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, మాజీ ఎంఎల్‌సి రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డితో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు బలరామ్ నాయక్,అంజన్‌కుమార్ యాదవ్ (కాంగ్రెస్), దాసోజు శ్రవణ్, కర్నె ప్రభాకర్ (బిఆర్‌ఎస్), తక్కలపల్లి శ్రీనివాస్‌రావు, ఇ.టి.నరసింహ(సిపిఐ), రాజేశ్వర్ రావు, అశోక్ కుమార్(బిజెపి), పోటు రంగారావు (సిపిఐ(ఎం.ఎల్‌మాస్‌లైన్), కె.గోవర్ధన్ (సిపిఐఎం.ల్ న్యూడెమోక్రసి), సంధ్య (పిఒడబ్ల్యు), ధర్మర్జున్, అంబటిశ్రీనివాస్ (టిజెఎస్), హేమ సుదర్శన్ జిల్లోజు(ఆప్), అశోక్ (టిడిపి)తో పాటు బిఎస్‌పి నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సహకరించిన అప్పటి యుపిఎ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, ప్రధాని మన్మోహన్ సింగ్, స్పీకర్ మీరా కుమార్‌కి పలువురు ముఖ్యులకు కమిటీ




ధన్యవాదాలు తెలిపింది.

**పాఠ్యాంశాలలో చేర్చాలి :** పాఠ్యపుస్తకాల్లో ఉద్యమకారుల చరిత్ర ఉండాలని బిఆర్‌ఎస్, 1947లో జరిగిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని సిపిఐ సూచించింది. అయితే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకించిన రాజకీయ పార్టీలను తెలంగాణ ఉద్యమ కారుల కమిటీ సమావేశానికి ఆహ్వానించడాన్ని పలువురు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. కాగా సమావేశం అనంతరం కమిటీ సభ్యులతో కలిసి కె.కేశవరావు సమావేశ వివరాలను మీడియాకు వెల్లడించారు.

తొలితరం తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామని, కె.కేశవరావు అన్నారు. ఉద్యమారుల గుర్తించే విషయంలో పని విభజన చేస్తామన్నారు. కమిటీకి కాలపరిమతి విధించే అంశాన్ని కూడా ఆలోచిస్తామన్నారు. తెలంగాణకు అనుకూలంగా ఉన్న రాజకీయ పార్టీలతో పాటు, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణను వ్యతిరేకించిన రాజకీయ పార్టీల అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని ఆయన చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఉద్యమ సమయంలో గాయపడిన, కేసులు నమోదైన ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా అందరీ సలహాలను, సూచనలను స్వీకరిస్తామని, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా విజ్ఞప్తులను స్వీకరిస్తామన్నారు. ప్రొఫెసర్ ఎం. కోదండరామ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థి సంఘాల జెఎసిలతో సమావేశమై, వారి అభిప్రాయాలను తీసుకుంటామన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములయ్యామని, తమ జీవితం, యవ్వనం పోయిందని, తమను ఆదుకోవాలని విద్యార్థులు కోరుతున్న విషయాన్ని గుర్తు చేశారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ 1969 ఉద్యమకారులను కూడా గుర్తిస్తామన్నారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులను, గాయపడిన,కేసులతో జైలుకు వెళ్లిన వారిని గుర్తించి, వారిని గౌరవించుకోవాలన్నదే ముఖ్యమంత్రి ఆలోచన అని అన్నారు. ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు.

ఉద్యమకారులకు ఏం చేయాలనే విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి స్పష్టత లేదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ ఎంఎల్‌సి కర్నె ప్రభాకర్‌తో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుందని, 610 మంది ఉద్యమకారులను గుర్తించి, ఆదుకున్నామని, 582 మంది కళాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని గుర్తు చేశారు. తెలంగాణ కర్నె ప్రభాకర్ మాట్లడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని వ్యతిరేకించిన పార్టీలను ఉద్యమకారుల సమావేశానికి ఆహ్వానించారని మండిపడ్డారు.

## రాష్ట్ర సాధనకు ప్రాణ త్యాగాలు చేసిన
# అమరుల చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నరసింహ్మా



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేటి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమానికి స్ఫూర్తి, దిక్సూచి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమేనని, నాటి వీరయోధులు మొదలు, 1969 ఉద్యమకారులతో పాటు, తమ ప్రాణ త్యాగాల ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అంకురార్పణ చేసి అ ఉద్యమకారుల చరితను పాఠ్య పుస్తకాల్లో పొందుపర్చడంతో పాటు ఈ కుటుంబాలను అన్నివిధాలు ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నరసింహ్మాలు తెలంగాణ ఉద్యమ కారుల కమిటీకి విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్ర సచివాయలంలో తెలంగాణ ఉద్యమకారుల కమిటీ ఆధ్వర్యంలో, జరిగిన అఖిలపక్ష సమావేశంలో సిపిఐ తరపున హాజరైన తక్కలపల్లి శ్రీనివాసరావు, ఈటి నరసింహ కమిటీకి పలు సూచనలు చేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన సిపిఐ, ఉద్యమకారుల ఆకాంక్షలు, వారి కుటుంబాల రక్షణకు సంబంధించి ప్రధాన ప్రతిపాదనలను కమిటీ దృష్టికి తీసుకువెళ్లారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు ఇళ్లు, ప్రభుత్వ ఉద్యోగం, ఆర్థిక సాయం అందేలా చూడాలని, ఇప్పటివరకు సాయం అందని మిగిలిన కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని సూచించారు. అదేవిధంగా ఉద్యమ సమయంలో విద్యార్థులు, యువకులు, ఉద్యమకారులపై నమోదైన అన్ని రకాల పోలీస్ కేసులను ఎలాంటి షరతులు లేకుండా పూర్తిగా ఎత్తివేయాలని, వయసు పైబడిన, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న ఉద్యమకారులకు నెలవారీ గౌరవ వేతనం అందించాలి. అలాగే వారి కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య కార్డులు అందించి ఉచిత కార్పొరేట్ వైద్య సదుపాయం కల్పించాలన్నారు. కమ్యూనిస్టులు ఇతర సామాజిక శక్తులు చేసిన సాయుధ పోరాటాలు, మలిదశ ఉద్యమ చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని, గన్‌పార్క్‌తో పాటు జిల్లా కేంద్రాల్లో అమరవీరుల జ్ఞాపకార్థం స్మారక చిహ్నాలను నిర్మించాలనిసూచించారు. తెలంగాణ సిద్ధించి ఒక టిన్నర దశాబ్దం కావస్తున్నా నీళ్లు, నిధులు, నియామకాలతో పాటు సామాజిక సమానత్వం అనే ఉద్యమ ఆకాంక్షలు ఇంకా పూర్తిగా నెరవేరలేదని, ఉద్యమకారులను గౌరవించుకోవడం అంటే ఆ ఆకాంక్షల సాధన కోసం పనిచేయడమేని వారు పేర్కొన్నారు. 'ఉద్యమకారుల కమిటీ కేవలం నామమాత్రంగా కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల నుంచి వినతులు స్వీకరించి ప్రభుత్వానికి త్వరితగతిన నివేదిక సమర్పించాలనివారు డిమాండ్ చేశారు.

# తెలంగాణలో పవన్ సభ పెట్టడం సరైన సమయం కాదు

ఎపి అభివృద్ధి చూసుకోవాలి.. తెలంగాణ వైపు రావొద్దు

'చిట్ చాట్'లో మండలి చైర్మన్ గుత్తా



**ప్రజాపక్షం/నల్లగొండ :** పవన్ కళ్యాణ్ సభ పెట్టడం సరైన సమయం కాదు..ఓ వైపు తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతుంటే పవన్ సభ ఏంటి అని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం నల్లగొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మీడియా చిట్ చాట్‌లో మాట్లాడారు. పవన్ భాష తీరు సరిగా లేదని చంద్రబాబు, కూటమి నేతలు అమరావతి బ్రంహ్మాడమైన రాజధాని అంటున్నారని అందుకే సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు అమరావతిలోనే నివాసం ఉండాలన్నారు.తెలంగాణ కన్నా ఏపీలో ఎక్కువ సోర్స్ ఉన్నాయని సముద్ర తీరం రకరకాల పోర్టులు ఉన్నాయని ఏపీ అభివృద్ధి చూసుకోవాలి తప్ప తెలంగాన వైపు చూడొద్దన్నారు.తెలంగాణలో విద్వేషాలు పెట్టే ప్రయత్నం చేయొద్దని సూచించారు. తెలంగాణలో 75 ధాన్యం సేకరణ పూర్తి అయిందని ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదని అందువల్లే కొంత ఆలస్యమైందని తెలిపారు.

# ఎసిబి వలలో అటవీశాఖ రేంజ్ ఆఫీసర్

**ప్రజాపక్షం/కొడిమ్యాల :** చెట్ల నరికివేత, రవాణా అనుమతుల పేరుతో లంచం డిమాండ్ చేసిన కొడిమ్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎసిబి అధికారుల వలలో చిక్కాడు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల రేంజ్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ట్రాప్‌లో ఎఫ్‌ఆర్‌వో గులాం మొయినుద్దీన్‌ను ఎసిబి కరీంనగర్ యూనిట్ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి డిఎస్పీ విజయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాదుదారుడికి 120టేకు చెట్ల నరికివేతకు,వాటి రవాణాకు అనుమతి మంజూరు చేయడం కోసం మొదట రూ.2లక్షల లంచం కోరిన అధికారి, గతంలోనే రూ.1లక్ష తీసుకున్నాడు.అధికారిక ప్రక్రియ పూర్తయిన తర్వాత మిగిలిన మొత్తాన్ని రూ.80వేలకు తగ్గించి, గురువారం తన కార్యాలయంలో స్వీకరిస్తుండగా ఎసిబి అధికారులు దాడి నిర్వహించారు.ఎఫ్‌ఆర్‌ఓ డ్రాయర్‌లో ఉంచిన రూ.80వేల లంచం నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించాల్సిన అధికారి, వాటిని ఆదాయ మార్గంగా మార్చుకున్నాడని ఎసిబి అధికారులు పేర్కొన్నారు. అనంతరం నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిందితుడిని కరీంనగర్‌లోని ప్రత్యేక ఎసిబి కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. లంచం అడిగితే 1064కు సమాచారం ఇవ్వాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినా,స్వీకరించినా వెంటనే ఎసిబి టోల్‌ఫ్రీ నంబర్ కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. ఫిర్యాదుదారుల వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. ఎసిబి డిఎస్పి విజయ్ కుమార్, సిఐ తిరుపతి, పున్నము చందర్,ప్రేమ్‌కుమార్, సిబ్బంది శ్రీకాంత్ పాల్గొన్నారు.

# ప్రతీ చరిత్రాత్మక పోరాటంలో ఎఐఎస్‌ఎఫ్ ముద్ర

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులను ప్రారంభించిన కూనంనేని




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశ సమగ్రత, విద్యారంగ సమస్యలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం నిరంతరం పోరాటాలు సాగిస్తున్న విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) అని కూనంనేని సాంబశివరావు అన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమం నుంచి సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య పరిరక్షణ వరకు ప్రతీ చరిత్రాత్మక పోరాటంలో ఎఐఎస్‌ఎఫ్ తనదైన ముద్ర వేసిందని తెలిపారు. గురువారం సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో మూడు రోజులపాటు జరగనున్న ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర స్థాయి విద్య, వైజ్ఞానిక, సైద్ధాంతిక, రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు.

ప్రారంభానికి ముందు ఎఐఎస్‌ఎఫ్ శ్వేతారుణ పతాకాన్ని జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ.స్టాలిన్ ఎగురవేశారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభను ఉద్దేశించి కూనంనేని మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని, దేశ అభివృద్ధిలో వారి పాత్ర అత్యంత కీలకమని అన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, నైతిక, వైజ్ఞానిక, మానవీయ విలువలను అందించే సాధనం విద్య అని, అలాంటి విద్యను ప్రస్తుత పాలకులు వ్యాపారంగా మార్చరని విమర్శించారు. ప్రభుత్వ విద్య పరిరక్షణ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తెలంగాణలో సాగిన ఉద్యమాల్లోనూ, విశాలాంధ్ర ఉద్యమంలోనూ, ఉచిత విద్య కోసం జరిగిన పోరాటాల్లోనూ ఎఐఎస్‌ఎఫ్ కీలకపాత్ర పోషించిందని గుర్తు చేశారు. దేశ విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసిన కొఠారి కమిషన్ సిఫారసుల రూపకల్పనలో విద్యార్థి ఉద్యమాల ప్రభావం కీలకమైందని, అందులో ఎఐఎస్‌ఎఫ్ పాత్ర చారిత్రాత్మకమని పేర్కొన్నారు.

శాస్త్రీయ, లౌకిక, సామాజిక న్యాయ విలువలతో కూడిన విద్యావిధానం కోసం ఎఐఎస్‌ఎఫ్ దశాబ్దాలుగా పోరాడుతోందన్నారు. ప్రస్తుతం విద్యను హక్కుగా కాకుండా వ్యాపార వస్తువుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణ కోసం విద్యార్థి నాయకులు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు రావాలని సూచించారు.

విద్యార్థి ఉద్యమం కేవలం సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా సమాజ మార్పుకు మార్గదర్శక శక్తిగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. త్యాగాలు, పోరాటాలు, సిద్ధాంతబద్ధతతో నిర్మితమైన ఎఐఎస్‌ఎఫ్ గొప్ప వారసత్వాన్ని నేటి తరం ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

అనంతరం 'మార్క్సిజం – సమకాలీన ప్రాధాన్యత' అంశంపైమధుకర్ విశ్లేషణాత్మక ఉపన్యాసం ఇవ్వగా, 'తీవ్ర ఆర్థిక సంక్షోభంలో భారతదేశం–పర్యవసానాలు' అంశంపై బి.ఎస్.ఆర్. మోహన్ రెడ్డి బోధించారు.

ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ పూర్వ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లాఖాద్రి, జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.ఎ. స్టాలిన్, పూర్వ రాష్ట్ర నాయకులు మంద పవన్, రామావత్ అంజయ్య నాయక్, పల్లె నరసింహ, మారుపాక అనిల్ కుమార్, లక్ష్మీ నారాయణ, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర నాయకులు గ్యార నరేష్, రెహమాన్, బానోత్ రఘురాం, సి. రాజు, బాలసాని లెనిన్, కాసోజు నాగజ్యోతి తదితరులతో పాటు రాష్ట్రంలోని 31 జిల్లాలు, వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులపై వ్యాఖ్యలను పవన్ కళ్యాణ్ ఉపసంహరించుకోవాలి : ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కమ్యూనిస్టు పార్టీలపై చేసిన వ్యాఖ్యలు రాజకీయ అజ్ఞానానికి, అవకాశవాదానికి నిదర్శనమని ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర విమర్శించారు. కమ్యూనిస్టు ఉద్యమాలపై విషం చిమ్మడం మానుకుని, చేసిన వ్యాఖ్యలపై ప్రజల ముందు బహిరంగ క్షమాపణ చెప్పాలని గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతులు, కార్మికులు, విద్యార్థులు, యువత హక్కుల కోసం నిరంతరం పోరాడిన కమ్యూనిస్టు ఉద్యమాలను విమర్శించే నైతిక హక్కు పవన్ కళ్యాణ్‌కు లేదన్నారు. ప్రజల కోసం జైళ్లకు వెళ్లి ప్రాణత్యాగాలు చేసిన వేలాది మంది కమ్యూనిస్టుల చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు సఫలం కావని చెప్పారు. దేశంలో నిరుద్యోగం, ప్రైవేటీకరణ, ఖాళీ ఉద్యోగాల భర్తీ, విద్య వ్యాపారీకరణ లాంటి ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించాల్సిన సమయంలో ప్రజల దృష్టి మళ్లించేందుకు కమ్యూనిస్టులపై విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. 2019 ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీలతో కలిసి పనిచేసిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు వారినే విమర్శించడం రాజకీయ అవకాశవాదానికి నిదర్శనమని పేర్కొన్నారు.కమ్యూనిస్టు ఉద్యమాల చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను యువత తిప్పికొడుతుందని హెచ్చరించారు.

## న్యాయం కోసం నిరంతర పోరాటమే
# ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు ప్రధాన లక్ష్యం



సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళల హక్కుల పరిరక్షణ, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం కోసం నిరంతరం పోరాడటమే భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) ప్రధాన లక్ష్యమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ పేర్కొన్నారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర కార్యాలయంలో పశ్యపద్మ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక అసమానతలు, లింగ ఆధారిత హింస వంటి సమస్యలకు వ్యతిరేకంగా మహిళలను సంఘటితం చేయడంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు కీలక పాత్ర పోషించిందన్నారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు రూపకల్పనలో మాజీ ఎంపి, ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు నాయకురాలు గీతా ముఖర్జీ ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందినప్పటికీ అమలు విషయంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆమె విమర్శించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు పూర్తిగా అమలయ్యే వరకు దేశవ్యాప్తంగా ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు సీనియర్ నాయకురాలు, తెలంగాణ వర్కింగ్ ఉమెన్ ఫోరం అధ్యక్షురాలు పి.ప్రేమ్ పావని మాట్లాడుతూ మహిళలకు తగిన చట్టపరమైన రక్షణ, సామాజిక న్యాయం కల్పించేందుకు 1954లో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ ఒక ప్రజాసంస్థగా ఏర్పాటైందన్నారు. పెట్టుబడిదారీ విధానాలు, మతపరమైన విభజనలు, ధరల పెరుగుదల, ఆహార కొరత, మహిళలపై హింస వంటి సమస్యలపై దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. ప్రజా సమస్యలతో పాటు మహిళా కార్మికుల ఆర్థిక, సామాజిక, లింగ సమానత్వం కోసం మరింత బలమైన ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన, ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద సదాల, ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు షేక్ ఫైమీద బేగం, జె.లక్ష్మి, హైదరాబాద్ జిల్లా అధ్యక్షురాలు పడాలి నళిని, కార్యదర్శి సక్రిబాయి, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు ఉజ్జిని హైమావతి తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠా గుట్టురట్టు

థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు హైడ్రోపోనిక్ గంజాయి సరఫరా

రూ. 12 కోట్ల విలువైన 25.9 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం

తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు హైడ్రోపోనిక్ గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న అంతర్జాతీయ మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాను తెలంగాణ ఈగల్ ఫోర్స్, కస్టమ్స్ అధికారులతో కలిసి ఛేదించినట్లు ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సందీప్ శాండిల్య వెల్లడించారు. ఈ కేసులో ఇప్పటివరకు పలువురిని అరెస్టు చేయగా, మరికొందరు పరారీలో ఉన్నారని తెలిపారు. బంజారాహిల్స్‌లోని టిజిఐసిసిసిలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏప్రిల్ 8న రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడు మోహసన్ బహదూర్ భాయ్ సోధా వద్ద 13.2 కిలోల హైడ్రోపోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం చేపట్టిన దర్యాప్తులో అతని సహచరుడు హరషద్ మన్సుఖ్ భాయ్ ప్రజాపతితో పాటు సందీప్ వాసాని అలియాస్ రాహుల్ జైన్‌లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మరో 12.739 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దర్యాప్తులో ఈ ముఠా థాయ్‌లాండ్‌హైదరాబాద్ ముంబై మధ్య విస్తృత నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడైందని చెప్పారు. గుజరాత్‌కు చెందిన దల్ అబ్దుల్లాయ్ సద్రుద్దీనాయ్ యువకులను ప్రలోభపెట్టి థాయ్‌లాండ్ నుంచి మాదకద్రవ్యాల రవాణాకు వినియోగించినట్లు అధికారులు గుర్తించారు. ఈ ఘటనపై క్రైమ్ నం.01/2026 కింద ఎన్‌డిపిఎస్ చట్టంలోని పలు సెక్షన్లు, భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్)లోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. నిందితుల నుంచి రూ.12 కోట్ల విలువైన 25.9 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి, మొబైల్ ఫోన్లు, గుర్తింపు కార్డులు, ప్రయాణ టికెట్లు, ఇతర కీలక ఆధారాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. విచారణ కొనసాగుతుందని, పరారీలో ఉన్న నిందితులను త్వరలోనే పట్టుకుంటామని అధికారులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్‌పిలు పద్మజ, కృష్ణమూర్తి, ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

**ముఠా కార్యకలాపాలు..** ప్రధాన నిందితుడు హేమాంగ్ ప్రమోద్ కెలుస్కర్ తన తండ్రి, సోదరుడి సహకారంతో 2023లో థాయ్‌లాండ్‌లో వ్యాపారాన్ని ప్రారంభించి, అక్కడ లభ్యమయ్యే అధిక టిహెచ్‌సి కలిగిన హైడ్రోపోనిక్ గంజాయిని భారత్‌కు అక్రమంగా తరలించే వ్యవస్థను ఏర్పాటు చేశాడు. ఇందుకోసం స్థానిక క్లబ్‌లు, హోటళ్ల ద్వారా భారతీయ యువకులను గుర్తించి, వారిని 'క్యారియర్ల'గా ఉపయోగించినట్లు విచారణలో తేలింది. ముంబై, హైదరాబాద్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు ఈ నెట్‌వర్క్‌లో భాగస్వాములైనట్లు గుర్తించారు. సుమారు 300 మంది క్యారియర్లను వినియోగించి గంజాయిని భారత్‌కు తరలించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

**ప్రజలకు పోలీసుల సూచనలు :** మాదకద్రవ్యాలు ఆరోగ్యాన్ని, భవిష్యత్తును నాశనం చేస్తాయని పోలీసులు హెచ్చరించారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని సూచించారు. వైద్య చికిత్సలకు గంజాయి ప్రత్యామ్నాయం కాదని, ఆరోగ్య సమస్యల కోసం నిపుణుల సలహా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే క్రీడాకారులు, ఐటీ నిపుణులు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు డ్రగ్ రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

## మోదీ పాలనలో నిత్యావసరాల
# ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయ్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ఎఐటియుసి జాతీయ సమావేశాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకోవాలని, పనిచేసే ప్రదేశంలో సరైన సౌకర్యాలు కల్పించడంతో పాటు నెలకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. మోదీ పాలనలో విపరీతంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగటంతో పాటు పెట్రోల్, గ్యాస్, డీజిల్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఆకాశాన్ని అంటుతున్నాయని, ప్రభుత్వం పెరుగతున్న ధరలకు కళ్ళెం వేసి, ప్రజా పంపిణీ పథకం ద్వారా నిత్యావసర వస్తువులను పెంచాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాలు త్రిస్సూర్ (కేరళ)లో జూన్ 1 నుండి 3 వరకు జరిగాయి. ఈ సమావేశంలో ఎస్.బాల్ రాజ్ మాట్లాడుతూ ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి ప్రతినెలా చివరి శనివారం, ఆదివారాలలో కార్యక్రమాల రిపోర్టును ప్రవేశపెడుతూ ట్రేడ్ యూనియన్ క్లాసులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. వలస కార్మికుల రాష్ట్ర వ్యాపిత యూనియన్లు ఏర్పాటు చేసి, అన్ని జిల్లాల్లో వలస కార్మిక మహాసభలు జరపడంతో పాటు వలస కార్మికుల ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్‌టిసి కార్మికుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వం మెడలు వంచి కార్మికుల హక్కులను సాధించుకునేందుకు సమ్మె చేయటం జరిగిందని, ప్రభుత్వం దిగివచ్చి ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమలు చేయటం లేదని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు 2026 సెప్టెంబర్ 6 నుండి 8 వరకు కరీంనగర్ పట్టణంలో ఉత్సాహపూరితమైన వాతావరణంలో మహాసభలు జరిపి తీర్మానాల అమలుకు, పోరాటాలను, ఉద్యమాలను ఉధృతం చేసేందుకు నిర్ణయాలు తీసుకుంటామని ఆయన తెలిపారు. రాష్ట్ర మహాసభల సందర్భంగా ఎఐటియుసి కానిస్టిట్యూషన్‌ను, నీతి అయోగ్ 2025, లేబర్ కోడ్‌లు, రూల్స్‌ను పుస్తకాల రూపంలో ప్రింటింగ్ చేసి ప్రతినిధులకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. జాతీయ సమితి సమావేశాలలో ప్రధానంగా ట్రేడ్ యూనియన్ క్లాసులు, కార్మిక విద్యాపై ప్రధానమైన దృష్టిపెట్టి కార్మికులలో చైతన్యాన్ని నింపుతామని ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చి ఉపాధి హామీ చట్టాన్ని విబిజిరామ్ అనే కొత్త చట్టాన్ని తెచ్చి, ఉపాధి హామీ కార్మికుల గుర్తింపు యాప్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలలో 10 లక్షల ఖాళీల ఉద్యోగాలను నిరుద్యోగులతో నింపాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. ఎఐటియుసి జాతీయ ఉప ప్రధాన కార్యదర్శి మారగోని ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నిర్మాణ రంగంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారానికి యూనియన్ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు వాటి ఫలితాలను వివరించారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



**ప్రజాపక్షం/కాటారం;** రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అధికారులను ఆదేశించారు.గురువారం మండలంలోని ఏఎంసి గోదాం,రుద్ర కాటన్ మిల్లు,మీనాక్షి జిన్నింగ్ మిల్‌లను జిల్లా అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పరిశీలించారు.ఈ సందర్భంగా ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేసారు.ధాన్యం దిగుమతి సమయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబందిత ఇంచార్జ్‌లను ఆదేశించారు.ధాన్యం తూకం ,నిల్వ,రవాణా ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.గోదాలలో రైతులకు అవసరమైన మౌళిక వసతులు కల్పించడంతో పాటు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేసారు.అలాగే ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

## రక్త పరీక్ష కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు




**ప్రజాపక్షం/మంగపేట:** మండలంలో ములుగు జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ క్రాంతి కుమార్ డా॥ అఖిల గురువారం మంగపేటలోని స్థానిక డయాగ్నస్టిక్ ల్యాబ్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు ఒపి రిజిస్టర్లు ల్యాబ్ సౌకర్యాలను పరిశీలించారు. తనిఖీలో గుర్తించిన లోపాలకు సంబంధించి ఆయా డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు ఆరోగ్య రక్త పరీక్ష కేంద్రం ఈఎస్ఆర్ డయాగ్నస్టిక్స్ సెంటర్ యజమానులకు నోటీసులు జారీ చేసి అందజేశారు.

## కామ్రేడ్ లక్ష్మినారాయణ ఆశయాలను సాధిద్దాం



**ప్రజాపక్షం/గార్ల ;** సిపిఐ సీనియర్ నాయకుడు కామ్రేడ్ వెల్లంకి లక్ష్మి నారాయణ ఆశయాలను సాదిద్దామని, ఆయనపోరాటం సేవలు ప్రజల్లో ఎప్పటికి నిలిచి ఉంటాయని సిపిఐ రాష్ట సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్ అన్నారు. సిపిఐ సీనియర్ నాయకుడు రాంపురం శాఖ మాజీ కార్యదర్శి వెల్లంకి లక్ష్మినారాయణ 5వ వర్ధంతిని గురువారం నాడు సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని స్థానిక పాకాల ఏటి ఒడ్డున ఉన్న వెల్లంకి స్మారక స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కట్టబోయిన శ్రీనివాస్ మాట్లాడుతూ రాంపురం పరిసర గ్రామాలకు ప్రధాన సమస్యగా అయిన పాకాల ఏటిపై హైలెవల్ వంతెన నిర్మాణానికై చివరి శ్వాస వరకు ఎనలేని పోరాటం చేశారన్నారు.ఆయన ఆశయసాధనకై సిపిఐ గార్ల మండల సమితి కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ గార్ల మండల కార్యదర్శి జంపాల వెంకన్న ,సింగు రమేష్,దార్ల నాగేష్,లావుడ్య బీముడు,గుండా సుదాకర్ రెడ్డి,సిరిమర్తి నాగరాజు,లాలూ,వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు



**ప్రజాపక్షం/దామెర :** మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ద్వారా ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా దామెర మండలం ల్యాదేళ్లలోని మహిళా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్ ద్వారా నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాలు, శిక్షణకు సంబంధించిన మెటీరియల్, సెంటర్ లోని వివిధ శిక్షణ విభాగాలను పరిశీలించారు. సౌకర్యాలను పరిశీలించి కేంద్రం గురించిన వివరాలను డిఆర్డిఓ మేన శ్రీను, అధికారులు కలెక్టర్ కు వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మహిళలకు ఉపయోగపడే విధంగా వారం రోజుల్లో శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండల సమైక్య కార్యాలయం కోసం శంకుస్థాపన చేసిన భూమి వివరాలను తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మి దేవిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి రవి యాదవ్, అడిషనల్ డిఆర్‌డిఒలక్ష్మి ప్రసన్న, ఎంపిడిఒ కల్పన, డిపిఎం రాజేంద్రప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి అవకాశాలు పెంపుకు పరిశ్రమలు సహకరించాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** యువతకు ఉపాధి అవకాశాల పెంపుకు పరిశ్రమలు అప్రెంటిస్ అవకాశాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశాలు కల్పించే అంశంపై పరిశ్రమలు, పాలిటెక్నిక్, ఐటీఐ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలు అప్రెంటిస్ నియామకానికి నాట్స్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. జెన్‌కో, ఎఎంఆర్ తాడిచర్ల వంటి పరిశ్రమలు విద్యార్థులకు అప్రెంటిస్ అవకాశాలు కల్పించే విషయంలో చొరవ చూపాలని, అవసరమైతే తన ద్వారా అనుమతులు కొరకు సిఫారసు చేస్తానని తెలిపారు. అన్ని పరిశ్రమలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అప్రెంటిస్ నియామకంలో భాగస్వాములు కావాలని, యువత ఉపాధి అవకాశాల పెంపులో సహకరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి సిద్ధార్థ రెడ్డి, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

# మహిళా డెయిరీ అభివృద్ధి పనులు వేగవంతం

### హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, అధికారులతో ఎమ్మెల్యే రేవూరి సమీక్ష



**ప్రజాపక్షం/హనుమకొండ :** పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మరింత వేగవంతంగా పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి సూచించారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,డిఆర్‌డిఒలు మేన శ్రీను, నాగ పద్మజతో పాటు సంబంధిత శాఖల అధికారులతో పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఇటీవల హైదరాబాద్‌లోని సెర్ప్ కార్యాలయంలో నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులతో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాల నేపథ్యంలో, పరకాల మహిళా డెయిరీ పరిధిలోని హనుమకొండ, వరంగల్ జిల్లాల ఆరు మండలాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఎమ్మెల్యే సమగ్రంగా సమీక్షించారు.డెయిరీ అభివృద్ధి ద్వారా గ్రామీణ మహిళలకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించడంతో పాటు, మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు మరింత ఊతం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. డెయిరీ కార్యకలాపాల విస్తరణ, పాల సేకరణ కేంద్రాల బలోపేతం, మౌలిక సదుపాయాల కల్పన, సభ్యుల నమోదు తదితర అంశాలను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సమావేశంలో కలెక్టర్లు చాహత్ బాజ్ పాయ్, డాక్టర్ సత్య శారద డెయిరీ అభివృద్ధికి అవసరమైన అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టి, ప్రణాళికాబద్ధంగా పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో సహకార శాఖ అధికారి సంజీవరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారులు రాధాకిషన్, బాలకృష్ణ, అడిషనల్ డిఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, డిపిఎంలు సరిత, వరలక్ష్మి , మెప్మా కోఆర్డినేటర్లు రజిత రాణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతా

పరకాల పట్టణానికి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న అడ్వాన్సు ట్రైనింగ్ సెంటర్ (ఎటిసి) ఏర్పాటుకు సంబంధించి భూమిని అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యుడురేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పరకాల ప్రాంత యువతకు నైపుణ్య అభివృద్ధి అవకాశాలను పెంచేందుకు అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్ కీలకంగా మారుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ అందించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు.వ్యవసాయం, విద్య, ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశలో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.అడ్వాన్సు ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం ద్వారా పరకాల పట్టణ అభివృద్ధికి తోడ్పాటు అందుతుందని అన్నారు. అలాగే పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతున్నామని, అందులో భాగంగానే రాజుపేట సమీపంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, నూతన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఆసుపత్రి, ఏటీసీ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరకాల పట్టణ అభివృద్ధికి,యువతకు నైపుణ్యాభివృద్ధి కేంద్రంగా ఏటీసీ ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను పరిశీలించారు.

## గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కీలకం

### కలెక్టర్ స్నేహ శబరీష్ పిలుపు



**ప్రజాపక్షం/గూడూరు;** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో గ్రామస్థాయిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నా రు.గురువారం గూడూరు మండలంలోని అప్పరాజుపల్లి పడమట్టితండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు గ్రామాల్లో పచ్చదనం పెంపొందించడం పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం ప్రతి పౌరుడి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.బాల్యవివాహాల నిర్మూలన గంజాయి ఇతర మాదకద్రవ్యాల వినియోగం రవాణాను అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సేంద్రియ సహజ వ్యవసాయానికి ప్రాధాన్యం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నేల ఆరోగ్యం పరిరక్షణ నీటి సంరక్షణ సమతుల్య ఎరువుల వినియోగం సేంద్రియ జీవ ఎరువుల ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని తెలిపారు.జనగణన ఇందిరమ్మ ఇళ్లపై క్షేత్రస్థాయి పరిశీలన గ్రామ సభల అనంతరం కలెక్టర్ గ్రామాల్లో కొనసాగుతున్న జనగణన నమోదు చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీనువాస్ తహసీల్దార్ నాగభవాని మండల ఇన్‌చార్జి ఎంపిడిఒ పృథ్వీరాజ్ అప్పరాజుపల్లి సర్పంచ్ భరత్ పడమట్టి తండా సర్పంచ్ భాస్కర్ వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ మాలిక్ ప్రజాప్రతినిధులు అధికారులు స్వయం సహాయక సంఘూల సభ్యులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల

### బిసిహక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు డిమాండ్



**ప్రజాపక్షం/ వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పేద విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించాలని లేకుంటే తగిన గుణపాఠం తప్పదని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు హెచ్చరించారు. గురువారం బిసి హక్కుల సాధన సమితి ప్రతినిధి వర్గం వరంగల్ తహసీల్దార్ శ్రీకాంత్ ద్వారా ముఖ్యమంత్రికి వినతి పత్రం పంపించారు. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ ఎన్నికల ముందు బిసి విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తామని, విద్యార్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని చేసిన వాగ్దానాలన్నీ విస్మరించి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడడం దుర్మార్గమన్నారు. ఫీజురియింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులకు టిసిలు, మెమోలు ఇవ్వకపోవడంతో పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జిఒనెంబర్ 7తో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు చదువును అందుబాటులో లేకుండా చేయడమే ప్రభుత్వ విధానంలా ఉందన్నారు. బడుగు బలహీన వర్గాల విద్యార్థి వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడి ప్రభుత్వం ఆ జిఒను రద్దు చేయాలన్నారు. లేనిచో బిసి సంఘాలన్నీ సమైక్యమై పోరాటాలు ఉధృతంగా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా నాయకులు చెలుకల రాజు, కె. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## మానుకోట మున్సిపల్ సమావేశంలో రసాభాస

### మీడియాను అనుమతించకపోవడంతో సిపిఐ, బిఆర్ఎస్ నిరసన



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** మహబూబాద్ మున్సిపాల్టీలో జరుగుతున్న సమావేశం రసాభాసగా జరిగింది. ముఖ్యంగా సిపిఐ బిఆర్ఎస్ కౌన్సిలర్లు 59 కోట్ల నిధులపై వార్డుకు 50 లక్షల పనులు జరగడం లేదని అడగగా కాంగ్రెస్ పక్షం వార్డుల్లో వర్కులు జరుగుతున్నాయి అనగానే పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఏ వార్డులో 50 లక్షల నిధులతో వర్కులు జరుగుతున్నయో చెప్పాలని అధికార పక్షాన్ని అధికారులను నిలదీశారు. అదేవిధంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలోకి మీడియాను అనుమతించకపోవడంతో పెద్ద ఎత్తున సిపిఐ, బిఆర్ఎస్ కౌన్సిలర్లు పోడియం దగ్గరికి వచ్చి అధికారులను ప్రజా ప్రతినిధులను నిలదీశారు. సమావేశంలోకి మీడియాను అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్రావు బిఆర్ఎస్, సిపిఐ కౌన్సిలర్లతో కలిసి సమస్యలన్నీ పరిష్కరించాలని వార్డుకు నిధులు కేటాయించాలని అభివృద్ధి పనులు చేపట్టాలని శృతి కలిపారు. ఈ సందర్భంగా సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ మహబూబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధానమైన 33 వ వార్డు లోగల కొత్త కూరగాయల మార్కెట్ ను వెంటనే వినియోగంలోకి తేవాలని డిమాండ్ చేశారు. 18వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్ మాట్లాడుతూ వార్డులోని స్మశాన వాటికలు అభివృద్ధి చేయాలని నిధులు కేటాయించాలని 50 లక్షలతో సిసి రోడ్లు సిసి డ్రైనేజీలు నిర్మించాలని వార్డులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 25వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్యా శ్రావణ్ మాట్లాడుతూ జగన్ కాలనీలోని బావిని స్క్రీనింగ్ చేసి వార్డులో ఉన్నటు వంటి సమస్యలను పరిష్కరించాలి మంచినీటి సమస్య లేకుండా చూడాలని 50 లక్షలు వార్డుకు నిధులు కేటాయించి వెంటనే పనులు చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రజా సమస్యలు గుర్తించడానికే గ్రామ, వార్డు సభలు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికే గ్రామాల్లో స్థాయి నుండి మున్సిపాలిటీలలో వార్డు సభలను నిర్వహించడం జరుగుతుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గం లోని రేగొండ, గణపురం, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం విద్య వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విద్యుత్ సమస్యలను గ్రామ సభలో తెలియజేస్తే సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు. నియోజకవర్గానికి ఒక మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. పాఠశాలలోనే విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏండ్లుగా సాగుచేస్తున్న భూములకు పట్టాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని వాళ్ళందరికీ పట్టాలింపించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు జిల్లాలో విజయవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 12నుండి వరకు కార్యక్రమాలు ఉన్నాయని అందులో భాగంగా 4,6,8,10 తేదీలలో మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ లలో వార్డు, గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఓటర్ తమ యొక్క ఓటు వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు తప్పకుండా పరిశీలన చేయాలని తెలిపారు. ప్రతి ఇంటికి బూతు స్థాయి అధికారులు వస్తారని తమ వివరాలు అందజేయాలని తెలిపారు. స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, జిల్లా వైద్యశాఖ అధికారి మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, డిడబ్ల్యుఓ మల్లేశ్వరి, 9, 10వ వార్డ్ కౌన్సిలర్లు అప్పం కిషన్, పుల్లూరి మంజుల మాధవరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని ఆలీంపూర్, కొడవటూర్ గ్రామ పంచాయితి పరిధిలో గల ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియ, నిల్వలు, రవాణా వ్యవస్థను సమగ్రంగా పరిశీలించారు. ఇప్పటి వరకు 992 క్వింటాళ్ల ధాన్యం కాంటా పూర్తయిందని, మిగిలి ఉన్న ధాన్యం కాంటా పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కేంద్ర నిర్వాహకులను ఆదేశించారు. ధాన్యాన్ని అదనంగా పది ట్రాక్టర్ల ద్వారా త్వరితగతిన మిల్లులకు తరలించాలని రెండు, మూడు రోజులలో కొనుగోళ్లను పూర్తి చేయాలని సూచించారు. రవాణాలో ఎలాంటి ఆలస్యం లేకుండా సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఆయన వెంట కేంద్ర నిర్వాహకులు ఉన్నారు.

## ఓ మోస్తారు వర్షం...తడిసి ముద్దైన ధాన్యం



**ప్రజాపక్షం/జనగామ:** జనగామ జిల్లాలో మోస్తారు వర్షానికే ధాన్యం తడిసి ముద్దైంది. ధాన్యం రాసులతో పాటు, బస్తాల్లో నింపిన ధాన్యం సైతం తడవడంతో రైతులు బోరున విలపించారు. మోస్తారు వర్షానికికే పరిస్థితి ఇలా ఉంటే భారీ వర్షం కురిస్తే ధాన్యం రాసులు కొట్టుకుపోయే పరిస్థితి కనిపిస్తుంది. 75 శాతం ధాన్యం కొనుగోలు చేసి తరలించగా మరో 25 శాతం ధాన్యం కళ్లాల్లోనే ఉండడంతో ఎప్పుడు పూర్తి చేస్తారన్నది రైతుల్ని వెంటాడుతుంది. జనగామ జిల్లాలో భారీగా ధాన్యం దిగుబడైంది. గురువారం నాటికి 30వేల 164 మంది రైతుల నుండి 191775.700 మెట్రిక్ టన్నులు కొనగోలు చేసి 183606.080 మెట్రిక్ టన్నులు మిల్లులకు తరలించారు. మరికొంత ధాన్యాన్ని మిల్లులకు తరలించాల్సి ఉంది. ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం 15 నుండి 25 శాతం వరకు ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం రాసులతో కళ్లాలు నిండి ఉన్నాయి. అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ధాన్యం కొనుగోళ్లు పూర్తి కాలేదు. గురువారం ఉదయం వేడిగా ఉండడమే కాకుండా 11 గంటల వరకు ఎండ తీవ్రంగా కాసింది. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వర్షం మొదలు కావడం, కొన్ని చోట్ల మోస్తారు, కొన్ని చోట్ల భారీగా వర్షం కురిసింది.
జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం తడిసి ముద్దైంది. పూర్తి స్థాయిలో ధాన్యం తరలించలేదు. రెండు మూడు కుప్పలుగా ఉండగా కొంత ధాన్యం బస్తాల్లో నింపి ఉంది. వర్షంతో ధాన్యం రాసులు తడిసి ముద్దయ్యాయి. కొంత ధాన్యం వర్షంలో కొట్టుకుపోయి తేలియాడింది. ఇక బస్తాలు సైతం తడిసాయి. బస్తాల కింద పూర్తిగా వర్షం నీరు చేరింది. ధాన్యం రాసుల వద్ద చెరువును తలపించే విధంగా వర్షం నీరు నిలవడంతో పూర్తిగా తడిసింది. జనగామ వ్యవసాయ మార్కెట్‌లోనే కాకుండా జిల్లాలోని పలు చోట్ల కళ్లాల్లో కూడా దాన్యం తడిసి ముద్దైంది. కొందరు రైతులు కుప్పలు పోసి పరదాలు కప్పలేదు. కొందరు రైతులు పరదాలు కప్పినా గాలికి లేచిపోవడంతో ధాన్యం తడిసింది. ఇలా జిల్లా వ్యాప్తంగా భారీగా నష్టం జరిగింది.

## గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక

### కలెక్టర్ హేమంత్ సహదేవరావు



**ప్రజాపక్షం/ములుగు:** గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని, రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని, ఉపాధి హామీ పథకంలో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. 99 రోజుల ప్రజాపాలన....ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వెంకటాపూర్ మండలం కేశవాపూర్ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పాల్గొని గ్రామ ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలను సందర్శించి గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామసభలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి పనులను ప్రణాళికబద్ధంగా అమలు చేస్తామని, డిఆర్‌డిఎ, ఎంపిడిఒలు, ఎంపిఒల సమన్వయంతో పాటు ఇతర అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని సంబ ఢిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు అందించే పథకాల ప్రయోజనాలు సకాలంలో అందాలంటే నమోదు కీలకమని తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు రైతుల వేదికల ద్వారా రైతులకు పూర్తి సహకారం అందుబాటులో ఉంటుందని చెప్పారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రజలు అధికంగా పాల్గొనాలని, ఉపాధి పనుల్లో కార్మికుల భాగస్వామ్యం పెరిగితే గ్రామాల్లో సిసి రోడ్లు, డ్రైయినేజీ, వివో భవనాలు తదితర మౌళిక సదుపాయాల అభివృద్ధికి మరింత నిధులు లభించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ వెంకయ్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, గ్రామ సర్పంచ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు: ఎఇ



**ప్రజాపక్షం/గార్ల ;** ప్రభుత్వ అనుమతి లేని గడువు దాటిన విత్తనాలను,ఎరువులను ధుకాణాలలో నిల్వుంచినా అమ్మాలని చూసినా కఠిన చర్యలు తప్పవని సీడ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మండల వ్యసాయధికారి కావటి రామారావు,ఎస్ఐ సాయికుమార్‌లు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల,విత్తనాలదుకాణాలను తనికీ చేశారు. దుకాణాలలో విత్తనాల నిల్వలు,లైసెన్సులు స్టాక్ రిజిస్టార్,లు బిల్లులు లేబులింగ్, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేని బీటి 3,విత్తనాలను షాపు యందు నిల్వఉంచినా రైతులకు అమ్మాలని చూసినా సంబందిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అనధికార గడువు దాటిన విత్తనాలను రైతులకు అమ్మితే ఉపేక్షించేది లేదని హచ్చరించారు. షాపులలో విత్త నాల నిల్వ బోర్డులను రైతులకు కనిపించేలా ఏర్పాటు చేయాలని,విత్తనాలు అమ్మే సమయంలో రైతులకు బిల్లులు తప్పకుండా ఇవ్వాలని,నాన్యమైన విత్తనాలు మాత్రమే రైతులకు అమ్మాలని,రైతులు కోరిన విత్తనాలను ఇవ్వాలని తెలిపారు.స్టాక్ రిజిస్టర్ లు ఎప్పటికప్పుటు అప్‌డేట్ చేయాలని, స్టాక్ రిపోర్ట్ స్టాక్ వచ్చిన వెంటనే వ్యవసాయ అధికారికి తెలియజేయాలని అలసత్వం వహిస్తే శాఖా పరమైన కఠిన చర్యలు తప్పవని సూచించారు.రైతులు విత్తనాలు కొనేముందు ప్రభుత్వ లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేసి బిల్లులను పంట సీజన్ ముగిసే వరకు భద్రపరుచుకోవాలని,గ్రామాలలో సంచరిస్తూ గుడ్డ సంచులలో లేబుల్ లేని విత్తనాలు అమ్మేవారివద్ద కొని మోసపోవద్దని రైతులకు సూచించారు.

ఖమ్మం
శుక్రవారం
05-06-2026
www.prajapaksham.in
ప్రజాపక్షం
Telugu National Daily



# భద్రాద్రికి పోలవరంతో ముప్పే

అంచనాలకు మించి ముంపు

కరకట్టల నిర్మాణం జరగకపోతే మరింత నష్టం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పోలవరం ప్రాజెక్టు నుంచి భద్రాచలం పట్టణంతో పాటు పారిశ్రామిక ప్రాంతమైన సారపాకకు ఇంకా ఎగువన ఉన్న గోదావరి పరివాహక ప్రాంతానికి ముంపు ప్రమాదం పొంచి ఉంది. గతంలో నిపుణుల అంచనా మేరకు ఉన్న ముంపు కంటే పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. 2021–22 సంవత్సరాల్లో వచ్చిన గోదావరి వరదలు కానీ, 2021 నుంచి 2025 వరకు నమోదైన వరద ప్రవాహం ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తే ఈ విషయం అవగతమవుతుంది. అదృష్టవశాత్తు గడిచిన మూడేళ్లుగా గోదావరికి వరదలు వచ్చిన ప్రతి సమయంలోనూ భద్రాచలం ప్రాంతంలో వర్షం లేకపోవడం కొంత మేర సానుకూలంగా మారింది. పోలవరం ముంపు కారణంగా భద్రాచలం పట్టణంతో పాటు పారిశ్రామిక ప్రాంతమైన సారపాక లోని ఐటిసి పేపర్ బోర్డ్, అశ్వాపురం హెవి వాటర్ ప్లాంట్, దుమ్ముగూడెం ఐడెల్ ప్రాజెక్టు ప్రాంతాలు కూడా ముంపుకు గురయ్యే అవకాశం ఉందని గతంలో వచ్చిన వరదలను బట్టి అంచనా వేస్తున్నారు. గతంలో పోలవరం ముంపు అంచనా వేసిన సమయంలో ప్రస్తుత బూర్గంపాడు మండలంలోని చాలా ప్రాంతాలను, గ్రామాలను ముంపు నుంచి మినహాయించారు. కానీ ఇప్పుడు పరిస్థితులను అధ్యయనం చేస్తున్న సాంకేతిక బృందానికి బూర్గంపాడు మండలంలోని పలు గ్రామాలు గో దావరి పరివాహక ప్రాంతం ముంపునకు గుర య్యే అవకాశం ఉందని తెలుస్తుంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలం రక్షణకు ఇప్పుడు ఉన్న కరకట్టలను మరింత పెంచడంతో పాటు కరకట్టలు దాటిన తర్వాత వెనక్కి వచ్చే వరద నీటి నుంచి భద్రాచలంను రక్షించేందుకు కరకట్టలను మరో ఐదు కిలో మీటర్ల మేర పెంచాల్సి ఉంది. భద్రాచలానికి ఎగువ, దిగువ ప్రాంతాల్లో కరకట్టల పొ డవు పెంచడంతో పాటు భద్రాచలంలో వాటర్ పంపింగ్ స్టేషన్లు నిర్మించాల్సి ఉంది. భద్రాచలం లో వర్షపు నీటిని గోదావరిలోకి ఎత్తిపోసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను రూపొందించకపోతే ప్రసిద్ధ దేవాలయం ముంపునకు గురికాక తప్పదు.

## 'నేడు' ఎమ్మెల్యే కూనంనేని పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు శుక్రవారం బోనకల్ మండలం బ్రాహ్మణపల్లి, కలకోట ఎంపిటిసి పరిధిలోని గ్రామాల సిపిఐ జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి సిపిఐ నాయకులను, కార్యకర్తలను కూనంనేని కలవనున్నారు. బ్రాహ్మణపల్లిలో జరిగే జనరల్ బాడీ సమావేశంలో కూనంనేనితో పాటు సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహయ కార్యదర్శి జితేందర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బత్తినేని నీరజ, జిల్లా కౌన్సిల్ సభ్యులు రోషన్‌కుమార్, రాము తదితరులు పాల్గొననున్నారని సిపిఐ మండల కార్యదర్శి వెంగళ ఆనందరావు తెలిపారు.

## రేపు జాబ్‌మేళా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ప్రైవేటు రంగం ఖమ్మం నేషనల్ మార్ట్‌లో ఉద్యోగాలు కల్పించుటకు 6న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మం ఇల్లందు క్రాస్ రోడ్డులోని టిటిడిసిలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. హ్యూమన్ రిసోర్స్ (మేల్) ఉద్యోగానికి ఎంబిఎ హెచ్‌ఆర్ అర్హత గల వారు, క్యాషియర్, సిఎస్ఎ, సిఎస్ఆర్ ఉద్యోగాలకు పురుష, మహిళా అభ్యర్థులు ఎస్ఎస్‌సి ఉత్తీర్ణత కలిగి ఉండాలని, 27 సంవత్సరాల లోపు వయస్సు గల వారు అర్హులని తెలిపారు. మొత్తం 40 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇట్టి ఉద్యోగ ఖాళీలు ఖమ్మంలో ఉన్నాయని ఆసక్తి గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లతో జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు హెచ్‌ఆర్ సెల్ నెం. 7337444265 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

కలెక్టర్ అంకిత్




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం/చంద్రుగొండ :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం, లక్ష్యమని కలెక్టర్ అంకిత్ అన్నారు. జిల్లా పరిధి లోని చంద్రుగొండ మండలం తిప్పనపల్లిలో గురువారం గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతంగా నడుస్తుందన్నారు. గ్రామసభలు ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేసే వేదికలన్నారు. విద్యా,వైద్య, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షా కాలంలో అంటు వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని అన్నారు. ప్రభుత్వబడుల్లో విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్, రైతులు, గ్రామస్తులు పంట పొలాలకు వెళ్లే రహదారుల అభివృద్ధి, అదనపు విద్యుత్ లైన్లు, అంతర్గత రహదారుల నిర్మాణం, ఆర్వోవాటర్ ప్లాంట్ల ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామారావు, డిఆర్‌డిఓ విద్యాచందన, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## కూసుమంచి డిసిసిబిలో ఆకస్మిక తనిఖీ

డిపాజిట్ల పెంపు, గోల్డ్ లోన్ల ప్రచారంపై ప్రత్యేక దృష్టి

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండల కేంద్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డిసిసిబి)శాఖను బ్యాంకు సిఇఒ ఎన్‌వి ఆదిత్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా బ్యాంకు వ్యాపారాభివృద్ధి, డిపాజిట్ల సేకరణ, రుణాల మంజూరు, ఖాతాదారులకు అందుతున్న సేవలను సమీక్షించారు. ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో సిఇఒ మాట్లాడుతూ బ్యాంకు అభివృద్ధికి డిపాజిట్లే ప్రధాన బలమని, ప్రతి ఉద్యోగి డిపాజిట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గోల్డ్ లోన్లు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, వాటిపై విస్తృత ప్రచారం నిర్వహించి ఖాతాదారులకు చైతన్య పరచాలని ఆదేశించారు. డిజిటల్ బ్యాంకింగ్ సేవల వినియోగాన్ని పెంచి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రైతులకు అందిస్తున్న పంట రుణాలు, ఎరువులు, విత్తనాల సరఫరా, రుణాల వసూళ్లు, సభ్యుల నమోదు, డిపాజిట్ల సేకరణపై వివరాలు తెలుసుకున్నారు. సహకార సంఘాలు గ్రామీణ రైతాంగానికి వెన్నెముకలాంటివని పేర్కొన్న ఆయన, రైతులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చూడాలని, రుణాల పంపిణీలో పారదర్శకత పాటించి రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సొసైటీ అభివృద్ధి, సభ్యులు సంఖ్య పెంపు, ఆర్థిక లావాదేవీల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. ఈ తనిఖీలో బ్యాంకు అధికారులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాపాలన: చైర్‌పర్సన్ చంద్రకళ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం 6,9 వార్డుల గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మున్సిపల్ చైర్మన్ రామచంద్రరావు పాల్గొన్నారు. ప్రజల సూచనలను సలహాలను తీసుకొని ప్రజల యొక్క అవసరాలకు అనుగుణంగా వినతులను తీసుకున్నారు. గ్రామసభ వద్ద తాగునీటితో పాటు హెల్త్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం ప్రజల మన్ననలను పొందింది అన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యలను పరిష్కరించడం కోసమే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని, ప్రజలు కూడా డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకొని మున్సిపాలిటీలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, హౌసింగ్ ఏఈ కల్యాణ్, సుధీర్, ఏఈవో కీర్తి, జిపివో మస్తాన్, పలువురు రాజకీయ పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వరదల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్ష**

వరదల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై కమిషనర్ రామచందర్‌రావు, తహసీల్దార్ సురేష్, ఎస్ఐ రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరద పరిస్థితులపై సన్నద్ధత, అత్యవసర సేవల సమన్వయంగా, ప్రజల భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, ఏఈ శ్రీమాన్య, సుధీర్ పాల్గొని తమ సూచనలు తెలియజేశారు.

## గంజాయి పట్టివేత

నలుగురిని అదుపులోకి తీసుకొన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



**ప్రజాపక్షం/పాల్వంచ :** అక్రమంగా గంజాయిని తరలిస్తున్న నలుగురు యువకులను ఖమ్మం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం పట్టుకొన్నారు. వివరాల్లోకి వెళితే ఒడిశా రాష్ట్ర మల్కాన్‌గిరి నుండి గంజాయిని రవాణా చేస్తున్నట్లు పక్కా సమాచారం మేరకు ఎస్ఐ హరిరావు తన సిబ్బందితో కలిసి మండల పరిధి కేశవాపురం గ్రామ పంచాయితీలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో భద్రాచలం వైపు నుండి పాల్వంచ వైపునకు రెండు బైక్‌లపై వస్తున్న యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. స్పందించిన అధికారులు బైక్‌లను ఆపి తనిఖీ చేయగా రెండు సంచులలో 4. 480 కిలో గ్రాముల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే నలుగురిని అదుపులోకి తీసుకొని రెండు ద్విచక్ర వాహనాలను, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొన్నారు. పట్టుబడిన వారిని తమదైన శైలిలో విచారణ చేయగా ఆంధ్రప్రదేశ్ కర్నూల్‌కు చెందిన ఎస్‌కే. మహమ్మద్ ఆవేజ్‌భాషా, పశుపాల జగన్నాథ్, ఒరిస్సా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా నాలగుంటకి చెందిన ప్రసన్నజీత్ మండల్, ప్రీతంరాయ్‌లుగా తెలిసిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ తెలిపారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ ఎండి ఖలీల్ అహ్మద్, జమాల్ షరీఫ్, కానిస్టేబుల్స్ ప్రసన్న, ఉపేదర్, నాగరాజు, వి. శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బిఎస్ఎన్ఎల్ సేవలు మెరుగుపర్చాలి

ఎంపి రఘురాంరెడ్డి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలో బిఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరిచి, ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్య లేకుండా నిరంతరాయంగా సేవలు అందేలా చూడాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని తన నివాసంలో టెలికం విభాగం (డివోటి), ఎపిఎల్ఎస్ఎ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. భాస్కర్‌రావు, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ జి. గణేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె. లక్ష్మణ్‌కుమార్, బిఎస్ఎన్ఎల్ హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సి. రమణలతో ఎంపి రఘురాంరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ఇటీవల కేంద్ర టెలికం కార్యదర్శిని కలిసి ఉభయ జిల్లాల్లో, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటి సమస్యను అధిగమించడానికి 25 నూతన టవర్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, సరిహద్దు గ్రామాల్లో ఫోన్, ఇంటర్నెట్ సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను గుర్తించి సత్వర చర్యలు తీసుకోవాలని ఎంపి ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రస్తుత స్థితిగతులు, సాంకేతిక అంశాలను ఎంపికి వివరించారు.

## బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలి

డిఎంహెచ్‌ఒకు టిఎన్‌జిఒస్ నేతలు వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టనున్న సాధారణ బదిలీలు పారదర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహించాలని టిఎన్‌జిఒస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. సాధారణ బదిలీల సందర్భంగా తలెత్తే పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం టిఎన్‌జిఒస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రామారావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గుంటుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ సాధారణ బదిలీల ప్రక్రియలో ఉద్యోగులకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి పారదర్శకంగా, న్యాయబద్ధంగా నిర్వహించాలని కోరారు. డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ సంబంధిత అంశాలను రాష్ట్ర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చ ర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. డిఎంహెచ్‌ఒ సానుకూల స్పందన పట్ల నాయకులు హర్షం వ్య క్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జైపాల్, జిల్లా జా యింట్ సెక్రటరీ శ్రీకాంత్, మెడికల్ హెల్త్ ఫోరం జిల్లా అధ్యక్షుడు సి. సైదులు, అసోసియేట్ అధ్యక్షుడు జి. వీరన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ, డిఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బంది, నర్సింగ్, వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు పాల్గొన్నా రు.

## పోలవరం ముంపుపై తక్షణ చర్యలు

పిపిఎ, సిడబ్ల్యుసి అధికారులకు ఎమ్మెల్యే పాయం వినతి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ప్రభావంతో పినపాక నియోజకవర్గంలోని గ్రామాలు, వ్యవసాయ భూములు, ప్రజల జీవనోపాధి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయని పేర్కొంటూ పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ(పిపిఎ), సెంట్రల్ వాటర్ కమిషన్(సిడబ్ల్యుసి) అధికారులకు సమగ్ర వినతిపత్రం సమర్పించారు. బూర్గంపాడు, అశ్వాపురం మండలాలతో పాటు నాగినేనిప్రోలు రెడ్డిపాలెం తదితర గ్రామాలు ముంపు ముప్పులో ఉన్నాయని, అధికారిక అంచనాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో భూములు ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వందలాది కుటుంబాలు నిర్వాసితులయ్యే పరిస్థితి నెలకొంటోందని ఆందోళన వ్యక్తం చేశారు. గోదావరి వరదలతో ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావం మరింత సమస్యాత్మకంగా మారుతోందని, వాగులు, ఉప వాగులు, సహజ నీటి పారుదల మార్గాలపై ప్రభావం వల్ల వ్యవసాయం, గ్రామీణ జీవనం దెబ్బతింటోందన్నారు. అశ్వాపురంలోని జాతీయ ప్రాధాన్యత కలిగిన హెవీ వాటర్ ప్లాంట్ భద్రతపైనా ముప్పు పొంచి ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభావిత ప్రాంతాల్లో శాస్త్రీయ సర్వే, ప్రత్యేక పునరావాస ప్యాకేజీ, రైతులకు న్యాయమైన పరిహారం, ఉపనదులపై అధ్యయనం, శాశ్వత వరద నియంత్రణ చర్యలు, రక్షణ కరకట్టలు, ఫ్లడ్ ప్రొటెక్షన్ వాల్స్ నిర్మాణం తదితర పది ప్రధాన డిమాండ్లను వినతి పత్రంలో పొందుపరిచారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నిపుణులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టాలని, ప్రజల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి నిర్ణయాలు అమలు చేయరాదని ఎంఎల్‌ఏ స్పష్టం చేశారు. పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు సంపూర్ణ న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం, పీపీఏ, సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పలు డివిజన్లలో సభలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో సభలు నిర్వహించారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఒకటి, మూడు, నాలుగు, ఏడు, తొమ్మిది, 11, 12, 14, 16, 17, 19, 22, 24, 25, 28 డివిజన్లలో సభలు నిర్వహించారు. ఈ సభలకు స్థానిక ప్రజలు హాజరై తమ సమస్యలు, వినతులను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు, వార్డు ఆఫీసర్లు సభల్లో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ పలు డివిజన్లలో పర్యటించి సభలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం

సమస్యల పరిష్కారానికి కృషి

మేయర్ మూడ్ గణేష్




**ప్రజాపక్షం/పాల్వంచ :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యావరణలో భాగంగా పాల్వంచలోని 4, 5వ డివిజన్‌లో వార్డ్ సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం అందజేస్తున్న పథకాలను అర్హులైన ప్రతీ పేదవారికి అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదయలపై స్పందిస్తూ వార్డ్‌లలో నెలకొన్న సైడ్ డ్రైన్స్, సిసి రహదారులు, నీటి సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగూడెం నగర పాలక సంస్థను అన్ని రంగాలలో అభివృద్ధి చేయటానికి కృత నిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్లు నూకల సరిత, చెరుకు భాగ్యలక్ష్మి, అడిషనల్ కమిషనర్ విజయానంద్, ప్రత్యేక అధికారి ఎల్.వి. సత్యనారాయణ, ఎస్ఐ నాగరాజు, జిపిఒ, వార్డు ఆఫీసర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో ప్రజా దర్బార్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ తెలిపారు. గురువారం ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజా దర్బార్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సౌజన్యంతో అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ కార్యకర్తలే కాకుండా ప్రజలు కూడా ప్రజా దర్బార్‌లో సమస్యలపై దరఖాస్తులు ఇవ్వవచ్చునని తెలిపారు. ప్రజా దర్బార్‌పై మండలాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రజావాణిలో 15 దరఖాస్తులు అందాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సేవాదళ్ అధ్యక్షుడు సయ్యద్ గౌస్, కాంగ్రెస్ ఉపాధ్యక్షులు లక్ష్మి నర్సింహారావు, కంచర్ల వెంకటనర్సయ్య, చిట్టిబాబు, గోవిందరావు, కర్నాటి రామారావు, బండి మాధవరావు, మద్దినేని రమేష్, పార్థసారధి, కొట్టే రాజశేఖర్, పాటి నర్సయ్య, గజ్జి సూర్యనారాయణ, ఫరీద్ ఖాద్రి, నరేందర్, స్వరూప, శ్రీలత, సుగుణ, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం

గ్రామాలలో చెత్త నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

ప్రత్యామ్నాయ పంటల సాగు,

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

కలెక్టర్ దివాకర టిఎస్




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** భవిష్యత్ తరాల కోసం మనమందరం పర్యావరణాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గ్రామ, వార్డు సభలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్య వేదికలన్నారు. 'సర్' కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేసి, ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిపై గ్రామస్తులతో చర్చించారు. రాబోమే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్ పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో చెత్తను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, ప్రస్తుతం స్వచ్ఛమైన తాగునీటి కోసం డబ్బులు చెల్లిస్తున్నామని భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి కోసం కూడా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలు మెరుగైన జీవనం సాగించాలంటే పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమని అన్నారు. జిల్లాకు సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరాన్ని వివరించిన కలెక్టర్, రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి బి. జ్యోతి, ఆత్మ పిడి బి.సరిత, ఎఒ ఉమానగేష్, పశువైద్యులు జగ్గులాల్, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల హక్కులను కాపాడుతాం

ఎఐటియుసిలో చేరికలు



**ప్రజాపక్షం/పాల్వంచ :** ఎఐటియుసిలో చేరిన హమాలీ కార్మికుల హక్కులను కాపాడి, వారికి దక్కాల్సిన సంక్షేమ ఫలాలను అందించేందుకు కృషి చేస్తామని ఎఐటియుసి జిల్లా నాయకుడు అన్నారపు వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధి ఉల్వనూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పని చేస్తున్న 45 మంది కార్మికులు ఎఐటియుసిలో చేరారు. వారందరికి సభ్యత్వాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎఐటియుసి సభ్యత్వం పొందిన ప్రతీ కార్మికుడికి లేబర్ ఇన్సూరెన్స్ కార్డులను, ధాన్యం కొనుగోలుదారులు, ప్రభుత్వం నుండి రావాల్సిన న్యాయమైన హక్కులను సాధించే వరకు పోరాటం చేసి వారికి నిరంతరం అండగా ఉంటామని స్పష్టం చేశారు. అనంతరం ఎఐటియుసి అనుబంధ నూతన హమాలీ కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కర్రి వెంకటేష్, కార్యదర్శిగా మహంకాళి క్రిష్ణ, కోశాధికారిగా కాలం సురేష్, ఉపాధ్యక్షుడిగా మోట నాగేష్, సహాయ కార్యదర్శిగా తునికి శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు నిమ్మల రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వేములపల్లి శ్రీనివాస్, సిపిఐ ఉల్వనూర్ గ్రామ కార్యదర్శి నిట్ట అమృతరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/జగిత్యాల:** అర్హులయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పథకాలు అందించాలని ప్రభుత్వం విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.99 రోజుల ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామసభలో వర్షాకాల ముందస్తు చర్యలు, ఘన వ్యర్థాల నిర్వహన, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, జల సంరక్షణ, వన మహోత్సవం, సురక్షిత తాగునీరు, వ్యవసాయ రంగంలో తీస్కుకోవాల్సిన జాగ్రత్తలు,మహిళా సంరక్షణ, అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన తదితర అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని అన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిరోధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. జల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. మహిళల భద్రత,రోడ్డు భద్రత అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూగ్రామాల్లో సురక్షితమైన తాగునీటి సరఫరా కోసం అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రానున్న వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు వినియోగిస్తూ వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలని తెలిపారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, నీటి వనరులను సంరక్షిస్తూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. గ్రామంలో ఐదు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉండగా, ఇప్పటికే ఒక భవనానికి మంజూరు లభించిందని, మిగిలిన భవనాలకు అవసరమైన భూమి అందుబాటులో ఉంటే మంజూరు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే మూడు వీఓ భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉండగా, ఒక భవనానికి ఇప్పటికే మంజూరు లభించిందని, మిగిలిన రెండు భవనాలకు భూమి అందుబాటులో ఉంటే మంజూరు కల్పిస్తామని పేర్కొన్నారు. మంజూరైన భవనాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి,జిల్లా సంక్షేమ శాఖ అధికారి భాస్కర్,ఎంపీడీవో,తహసీల్దార్,సంబంధిత శాఖల అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు,గ్రామస్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.



## వరి కొయ్యలు కాలుస్తూ ప్రమాదవశాత్తు రైతు దుర్మరణం



**ప్రజాపక్షం/దుబ్బాక:** వ్యవసాయ పొలంలో వరి కొయ్యలను తగలబెడుతుండగా జరిగిన ప్రమాదంలో ఓ రైతు మంటల్లో, దట్టమైన పొగలో చిక్కుకుని ఊపిరాడక అక్కడికక్కడే సజీవదహనమైన విషాద సంఘటన సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మిరుదొడ్డికి చెందిన మద్దెల మల్లయ్య(60) తన వ్యవసాయ పొలంలో వరి కొయ్యలను తగలబెట్టడానికి గురువారం నిప్పు పెట్టారు. ఆ సమయంలో గాలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంటలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున లేచాయి. చూస్తుండగానే పొలం చుట్టూ దట్టమైన పొగ అలుముకుంది. పొగ తీవ్రతకు ఊపిరి పీల్చుకోలేక తీవ్రమైన వేడి కారణంగా మల్లయ్య స్పృహ తప్పి పొలంలోనే పడిపోయారు. అదుపు తప్పిన మంటలు ఆయనకు సైతం అంటుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మిరుదొడ్డి పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.
రైటప్:04డిబికె01, ప్రమాదంలో మృతి చెందిన మల్లయ్య

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/రాయికల్ :** రాయికల్ పట్టణానికి చెందిన ధన రేకుల రాజేష్ (37) అనే వ్యక్తి వ్యవసాయం మరియు గొర్ల పెంపకంలో నష్టం రాగా రెండు సంవత్సరాల క్రితం బలుపు దేశానికి వెళ్లగా అక్కడ పని సరిగా దొరకపోవడం వల్ల అప్పులు ఇంకా ఎక్కువై డిప్రెషన్ కు లోనై మద్యానికి బానిస అయినాడు.అప్పులు ఎక్కువ అవ్వడం వల్ల ఎప్పుడు అప్పుల వల్ల చనిపోతానంటూ అనేవాడు అదే క్రమంలో బుధవారం రాత్రి 11 గంటలకు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుని భార్య ధన రేకుల లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాయికల్ ఎస్సై సుదీర్ రావు తెలిపారు.

## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి



**ప్రజాపక్షం/కథలాపూర్ :** జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా కథలాపూర్ మండలం కలికోట గ్రామంలో వరి ధాన్య కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా,సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు.అదేవిధంగా మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.అలాగే రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ పరిశీలనలో కోరుట్ల ఆర్.డి.వో జివాకర్ రెడ్డి, డి.టి.ఓ సంధాని, డి.సీ. ఎస్.ఓ. జితేందర్ రెడ్డి, తహసిల్దార్ రమేష్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## 'బడిబాట' కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలి: అదనపు కలెక్టర్




**ప్రజాపక్షం/కరీంనగర్ :** జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించి వయస్సు గల బాలబాలికలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా.అశ్విని తాజాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాధికారి ప్రశాంత్ రెడ్డితో కలిసినిర్వహించిన జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. బడిబయట ఉన్న పిల్లలు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, మౌళిక సదుపాయాలు, సంక్షేమ పథకాలు, వినూత్న కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామాలు, కాలనీలు, తండాలు, గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో నమోదు చేయాలని ఆదేశించారు. ఐదేళ్లు నిండిన ప్రతి బాలబాలికలను ప్రథమ తరగతిలో చేర్పించడంతోపాటు ట్రాన్సిషన్ తరగతులైన 5 నుంచి 10వ తరగతి అనంతర ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి పరిశుభ్రత, తాగునీటి సౌకర్యాలు, పచ్చదనం, ఆకర్షణీయమైన వాతావరణంతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల విద్యాధికారులకు సూచించారు. విద్యార్థులకు మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందేలా చూడాలని, పాఠశాలల ఆవరణలను రంగురంగులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. బడిబాట కార్యక్రమ విజయవంతానికి గ్రామీణాభివృద్ధి శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామస్థాయిలో బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు చేయించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని విద్యాశాఖతో సమన్వయంగా పని చేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి జడ్పీ సీఈవో పవన్ కుమార్, కార్మిక శాఖ డిప్యూటీ కమీషనర్ ప్రసాద్, విద్యాశాఖ కోఆర్డినేటర్లు శ్రీనివాస్, అశోక్ రెడ్డి, శ్రీనివాస్, జిల్లా స్థాయి అధికారులు, సీడీపీఓలు, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు, తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సహకార శాఖ, మెప్మా, రవాణా శాఖ, వ్యవసాయ శాఖ, తదితర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, హమాలీల సంఖ్య, గన్ని సంచులు, ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు. అపరెల్ పార్క్, గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.

## దేవాలయాల్లో వరుస చోరీల కేసులు ఛేదించిన పోలీసులు

భార్యాభర్తల అరెస్ట్ , 20 గ్రాముల బంగారం, 1.250 కిలోల వెండి స్వాధీనం




**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:** మెట్పల్లి సర్కిల్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు గ్రామాల దేవాలయాల్లో వరుసగా జరుగుతున్న చోరీల కేసులను పోలీసులు విజయవంతంగా ఛేదించారు.ఈ సందర్భంగా మెట్పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ సురేష్ బాబు స్థానిక ఎస్సై జి నవీన్ కుమార్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించ మని, వెల్లుల గ్రామానికి చెందిన ఆరే శంకర్ (50), అతని భార్య ఆరే అనూష (45)లను అదుపులోకి తీసుకుని విచారించగా, విచారణలో ఇబ్రహీంపట్నం మండలంలోని బండలింగాపూర్, వర్షకొండ, తిమ్మాపూర్, వేములకుర్తి గ్రామాలతో పాటు మెట్పల్లి మండలంలోని ఆత్మకూర్, వేంపేట్, మల్లాపూర్ మండలంలోని సిర్పూర్, రాఘవపేట్, కథలాపూర్ మండలంలోని ఊట్‌పల్లి గ్రామ దేవాలయాల్లో జరిగిన మొత్తం 8 చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి చోరీకి గురైన 20 గ్రాముల బంగారం, 1.250 కిలోల వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జి. నవీన్ కుమార్ తెలిపారు. కేసు ఛేదనలో పాల్గొన్న పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

## 'నేడు' వేములవాడలో సిపిఐ రాజకీయ శిక్షణ శిబిరాలు ప్రారంభం

సిపిఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథం

**ప్రజాపక్షం/కోరుట్ల:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలని రైతులు కూలీలు కార్మికులు పేద వర్గాలు ఎదుర్కొంటున్న దేశంలో అనేక సమస్యలపై ఈ శిక్షణ తరగతులలో చర్చిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి చిన్న విశ్వనాథం తెలిపారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో గురువారం రోజున సి.ప్రభాకర్ భవన్ లో సిపిఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది ఈ సమావేశంలో నేతలు మాట్లాడుతూ అంతరాలు లేని సమ సమాజ స్థాపన కోసం పెట్టుబడుదారి విధానానికి వర్గ దోపిడీకి శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన రాజకీయ పార్టీ సిపిఐ అని 100 సంవత్సరాలు పూర్తి చేస్తుందని ఈ క్రమంలో ఉపాధి హామీ పథకం చట్టం, సమాచార హక్కు చట్టం,భవన నిర్మాణ కార్మిక చట్టం,మేక కార్మిక చట్టాలు తేవడానికి విశేష కృషి చేసింది సిపిఐ అన్నారు,నిజాం సర్కారును గద్దె దించడానికి రజాకర్ ఆగడాలను ఎదిరించడానికి వెట్టి చాకిరి విముక్తి కోసం భూమి కోసం ముక్తి కోసం బానిసత్వానికి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం లో సిపిఐ అగ్ర భాగాన నిలిచిందన్నారు. ఈ పోరాటంలో 4500 మంది ప్రాణాలు కోల్పోయారని 3000 పైగా గ్రామాలు విముక్తి కాబడ్డాయని పది లక్షల ఎకరాల భూమి పేదలకు పంచబడిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీ ధర్నా తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించి ఉద్యమాలలో ముందుండి రాష్టం సిద్ధించే వరకు సిపిఐ పోరాడిందని సాధించుకున్న తెలంగాణ అనేక సమస్యలు ఉన్నాయని వాటికోసం నిరంతరం పోరాటం చేస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులకు కార్యకర్తలకు




మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొదించుకొనుటకు సమాజ మార్పులు అవగాహన చేసుకోవడానికి సామాజిక ఆర్థిక రాజకీయ అంశాలపై సంపూర్ణ అవగాహన కల్పించడం కోసం వారిని సాంకేతికంగా రాజకీయంగా చైతన్యవంతం చేయడం కోసం ఈ నెల 5,6,7 తేదీలలో మూడు రోజులపాటు వేములవాడ పట్టణంలో మహానందీశ్వర బంకెట్ హాల్ లో నాలుగు జిల్లాల రాజకీయ శిక్షణ శిబిరాలు జరుగుతున్నాయన్నారు. ఈ శిక్షణ శిబిరాలకు సిపిఐ మాజీ ఎమ్మెల్యే జాతీయ నాయకులు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాస రావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేన శంకర్, భాగం హేమంతరావు, సీపీఐ నాయకులు, కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొంటారని తెలిపారు.

## మహిళల సమస్యల పరిష్కారం కోసమే ఎన్ఎఫ్ఐడబ్ల్యు ఉద్యమిస్తోంది

ఎన్ఎఫ్ఐడబ్ల్యు సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపిటిసి గూడెం లక్ష్మి




**ప్రజాపక్షం/కరీంనగర్ :** సమాజంలో మహిళల హక్కుల పరిరక్షణ కోసం వారి అభ్యున్నతి కోసం, సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేసేది భారత జాతీయ మహిళా సమాఖ్య అని ఎన్ఎఫ్ఐడబ్ల్యు సీనియర్ నాయకురాలు, మాజీ ఎంపిటిసి గూడెం లక్ష్మీ అన్నారు. భారత జాతీయ మహిళా సమాఖ్య 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్ఎఫ్ఐడబ్ల్యు జెండాను ఆమె ఎగురవేశారు. అనంతరం లక్ష్మీ మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన మహిళల చట్టాలను, హక్కులను మహిళా లోకానికి తెలియజేసేందుకు వారిలో చైతన్యాన్ని నింపడానికి అన్యాయాలను, అత్యాచారాలను అరికట్టేందుకు భారత జాతీయ మహిళా సమాఖ్య ఆవిర్భవించిందని అన్నారు. 72 సంవత్సరాలుగా ఈ దేశంలో మహిళల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిందని ప్రధానంగా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం కోసం పాలక ప్రభుత్వాలపై సాధించేవరకు పోరాటాలు నిర్వహించింన ఘనత మహిళా సమాఖ్యదని పేర్కొన్నారు. ఆరుట్ల కమలాదేవి లాంటి గొప్ప గొప్ప మహిళలు ఈ సమాఖ్యలో పని చేశారని లక్ష్మీ గుర్తు చేశారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బీర్ల పద్మ, కొట్టె అంజలి లు మాట్లాడుతూ వంటింటికే పరిమితమైన మహిళలను చైతన్యవంతం చేసి వారిలో ధైర్యాన్ని నింపి సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో మహిళలకు సముచిత స్థానం కావాలని విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో కూడా ప్రాధాన్యత ఇవ్వాలని పోరాడిన సంఘం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అని ఎక్కడ మహిళలను చిన్న చూపు చూసినా అవహేళన చేసినా, వరకట్న వేధింపులకు గురి చేసినా, అత్యాచార ఘటనలు జరిగినా బాధితుల పక్షాన ముందుండి పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక మహిళా సమాఖ్య ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి సావిత్రి, కోశాధికారి రాగుల మల్లిక, జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ సభ్యులు ఎ.సంధ్య, జి.రజిత, బి.మున్నీ, డి.సరోజన, ఎం.పద్మ, ఎ.భాగ్య, ఎస్.శోభ, ఎన్.లక్ష్మీ, బి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

## పంటల మార్పిడిపై రైతులు దృష్టి సారించాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు

**ప్రజాపక్షం/సుల్తానాబాద్:** ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలో భాగంగా సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని 2,3,4,5 వార్డుల సభ కార్యక్రమాన్ని గురువారం పట్టణంలోని స్థానిక ఆర్యవైశ్య భవన్ లో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ రైతులు ఎప్పటికీ ఒకే పంటపై ఆధారపడవద్దని కోరారు. పంటల మార్పిడి చేస్తే భూసారం పెరుగుతుందన్నారు. ఇందులో భాగంగా లాభసాటిగా ఉండే పామాయిల్ తోటలు పెంచాలని రైతులకు పిలుపునిచ్చారు. లేదా ఆరుతడి, వాణిజ్య పంటలు వేయాలని సూచించారు. తన మూడు ఎకరాల పొలంలోనూ పామాయిల్ తోట సాగు చేయనున్నట్టు చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 98 శాతం వడ్ల కొనుగోలు పూర్తి చేసినట్టు చెప్పారు. పంటల నిల్వలకు 1.70 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాముల నిర్మాణం ఇప్పటికే ఎలిగేడు మండలంలో ప్రారంభించినట్టు చెప్పారు. రైతులకు మేలు జరిగితే ఓర్వలేక పోతున్నారని చెప్పారు. గతంలో బస్తాకు 10 కిలోల చొప్పున వడ్ల కటింగ్‌లు పెట్టి వారిని నిలువునా ముంచిన బిఆర్ఎస్ నేతలు ఇప్పుడు రైతుల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నారని అన్నారు.రాబోయే వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రోగులకు వైద్య సేవలు అందించడంలో పెద్దపల్లి ఆసుపత్రి రాష్ట్రంలోని మంచి గుర్తింపు పొందిందని, ఇటీవల ఈ ఆసుపత్రి 6 అవార్డులను పొంది ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మున్సిపల్ చైర్మన్ రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ రమేష్, డిఏఓ, తహసిల్దార్ బషీరుద్దీన్, ఏవో పైడితల్లి, ఉద్యానవన శాఖ శాస్త్రవేత్త, పీహెచ్సీ వైద్య అధికారులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.



## సువాసిన స్వర్చన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ హైమావతి



**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ గ్రామంలో శ్రీ విజయదుర్గ సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో నిర్వహించిన సహస్ర బ్రాహ్మణ సువాసిన స్వర్చన (రజతోత్సవం) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మాధవనానంద సరస్వతి వెదురుపాక గాడ్, చెప్యాల హరినాథశర్మ వారి ఆధ్వర్యంలో వేద పండితులు, గాన భజనాలతో దైవత్యం ఉట్టిపడేలా కార్యక్రమం అంగరంగవైభవంగా పండుగ వాతావరణంలో నిర్వహించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి 1200 మహిళలు కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీర్వచనాలు స్వీకరించారు. ఈకార్యక్రమాన్ని కంటి కామకోటి పీఠాధిపతి జగద్గురు విజయేంద్రసరస్వతి. శంకరాచార్య స్వామిగల్ చరవాణి ద్వారా వీక్షించి ఇంతటి మహోన్నత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి ప్రతి ఒక్కరికి దివ్యాశీస్సులు అందచేశారు.

## దుకాణాల వారీగా హమాలీల కేటాయింపు

**ప్రజాపక్షం/పెద్దపల్లి:** గోదావరిఖని కూరగాయల మార్కెట్లో పని చేస్తున్న హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని గత కొన్ని సంవత్సరాలుగా పోరాడుతున్న కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ ప్రయత్నాలు ఫలితాన్నిచ్చాయి. జిల్లా లేబర్ కమిషనర్ సమక్షంలో హోల్‌సేల్ వ్యాపారులతో పలుమార్లు జరిగిన చర్చల నేపథ్యంలో, దుకాణాల వారీగా హమాలీల కేటాయింపు ప్రక్రియ పూర్తయిందని కరీంనగర్ జిల్లా హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మరియు ఏఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఏ. గౌస్ తెలిపారు. గురువారం గోదావరిఖని కూరగాయల మార్కెట్లో హోల్‌సేల్ వ్యాపారులకు దుకాణాల వారీగా హమాలీల కేటాయింపు కోసం పేర్లతో కూడిన జాబితాను అందజేశామని ఆయన అన్నారు. హమాలీల కూలీ రేట్ల పెంపు అంశంపై జూన్ 10 లోపు హోల్‌సేల్ వ్యాపారులు, హమాలీ యూనియన్ ఇరు వర్గాలు పరస్పర అంగీకారానికి వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలని జిల్లా లేబర్ కమిషనర్ (డీసీఎల్) సూచించారని గౌస్ పేర్కొన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీలకు కూలీ రేట్లు పెంచాలని హోల్‌సేల్ వ్యాపారులను ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానీ మియా, గాలిపెల్లి సతీష్, పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు: ఎస్పి

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా, విస్తృతంగా ప్రతి రోజు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితె పేర్కొన్నారు. జిల్లాలో మద్యం సేవించి వాహనాలు నడిపినా, నంబర్ ప్లేట్లు మార్ఫింగ్ చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం రోజు జిల్లా వ్యాప్తంగా రాత్రి వరకు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 55 గురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, వాహనాలకు నంబర్ ప్లేట్ తొలగించిన,కనపడకుండా మార్ఫింగ్ చేసిన 24 వాహనాలను గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడు తన వాహనానికి నంబర్ ప్లేట్‌ను స్పష్టంగా కనిపించే విధంగా అమర్చుకోవాలన్నారు. సరైన నంబర్ ప్లేట్లు ఉండడం వల్ల దొంగిలించబడిన వాహనాలను సులభంగా గుర్తించడంతో పాటు,నేరాలకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడం సులభమవుతుందన్నారు.

# మోదీకి విదేశీ ప్రయోజనాలే ముఖ్యం

- కీలకమైన సామాజిక-ఆర్థిక రక్షణలను కేంద్ర ప్రభుత్వం క్రమపద్ధతిలో నిర్వీర్యం చేస్తోంది
- 'పరివర్తన్ కా శంఖనాద్' బహిరంగ సభలో రాహుల్‌గాంధీ



**డెహ్రాడూన్ :** ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. మోదీ విదేశీ ప్రయోజనాలను నెరవేర్చేందుకు పనిచేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం కీలకమైన సామాజిక–ఆర్థిక రక్షణలను క్రమపద్ధతిలో నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఉత్తరాఖండ్‌లోని అల్మోరాలో జరిగిన ఒక బహిరంగసభలో రాహుల్‌గాంధీ ఫోన్ ద్వారా ప్రసంగించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో రాహుల్ తన అల్మోరా పర్యటనను వాయిదా వేసుకుని మధ్యలోనే పంత్‌నగర్ విమానాశ్రయానికి తిరిగి వచ్చారు. ఆ తర్వాత, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఉత్తరాఖండ్ ఇన్‌చార్జి కుమారి సెల్జా ఏర్పాటు చేసిన ఫోన్ కాల్ ద్వారా 'పరివర్తన్ కా శంఖనాద్' అనే బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్ర సహజ వనరుల దోపిడీలో కేంద్ర ప్రభుత్వం పాలుపంచుకుంటోందని విమర్శించారు. సామాన్యుడిని శక్తివంతం చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన ఆర్థిక పునాదిని నరేంద్ర మోదీ, అమిత్ షా బృందం నాశనం చేసిందని మండిపడ్డారు. అత్యవసర పరిస్థితుల కోసం మీరు ఇంట్లో దాచుకున్న డబ్బును పెద్ద నోట్ల రద్దు దోచుకుంది, జిఎస్‌టి దేశవ్యాప్తంగా చిన్న వ్యాపారాలకు హాని కలిగించిందని రాహుల్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కూడా లక్ష్యంగా చేసుకుని, కేంద్ర ప్రభుత్వం కీలకమైన సామాజిక–ఆర్థిక రక్షణలను క్రమపద్ధతిలో నిర్వీర్యం చేస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ రక్షణలు క్షీణించాయని పేర్కొంటూ నాలుగు నిర్దిష్ట రంగాలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. మొదటగా, ప్రజల గృహ పొదుపు గుర్తించి ప్రస్తావిస్తూ వారి వద్ద ఉన్న బంగారం తగ్గిపోయిందని ఆయన ఆరోపించారు. రెండవదిగా, వస్తు సేవల పన్ను (జిఎస్‌టి)ని లోపభూయిష్టంగా అమలు చేయడం వల్ల, ముఖ్యంగా వస్త్ర, ఆహార శుద్ధి రంగాలలోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆయన పేర్కొన్నారు. మూడవదిగా, బాహ్య భౌగోళిక రాజకీయ ఒత్తిళ్ల కారణంగా భారతదేశ ఇంధన భద్రత ఇప్పుడు పరిమితమైందని పేర్కొంటూ, ప్రస్తుత విదేశాంగ విధాన పొత్తును ఆ కాంగ్రెస్ నాయకుడు విమర్శించారు. 'ఈ రోజు మనం అమెరికా ఆమోదించిన దేశాల నుండి మాత్రమే చమురును కొనుగోలు చేయగలం. ఈ కీలకమైన రక్షణను నరేంద్ర మోదీ, అమిత్ షా నిర్వీర్యం చేశారు' అని ఆయన ఆరోపించారు. ఇరాన్, అమెరికా మధ్య జరిగిన సంఘర్షణ సమయంలో హోర్ముజ్ జలసంధిని మూసివేశారని భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను ఉదహరించారు. మోదీ ప్రభుత్వం దేశంలో వ్యవసాయం, విద్య రెండింటినీ బలహీనపరిచిందని, దేశ విదేశాంగ విధానం అమెరికాకు దాసోహం అయిందని ఆయన ఆరోపించారు. 'ప్రస్తుతం, అమెరికా–ఇరాన్ మధ్య ఘర్షణ భారతదేశం వంటి దేశానికి సంభావ్య ఆర్థిక సునామీని సృష్టిస్తోంది, అయినప్పటికీ మోదీ ప్రభుత్వం మన దేశంలోని అమెరికా, కొద్దిమంది ధనిక వ్యాపారవేత్తల ప్రయోజనాలను కాపాడటం పైనే దృష్టి పెట్టింది' అని ఆయన అన్నారు. చివరగా, రైతుల కోసం ఉన్న వ్యవసాయ రక్షణ వ్యవస్థను బలహీనపరిచారని, ప్రధానమంత్రి జాతీయ ప్రాధాన్యతల కంటే బాహ్య ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడానికి పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఉత్తరాఖండ్ ఏర్పాటు వెనుక ఉన్న ఆశయాన్ని దెబ్బతీస్తున్నారని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. బాహ్య శక్తులచే పాలించబడటానికి బదులుగా, స్వీయనిర్ణయాధికారాన్ని నిలుపుకునే భవిష్యత్తును రాష్ట్ర ప్రజలు ఊహించుకున్నారని ఆయన అన్నారు. 'భారతదేశం, అంటే భారత్, రాష్ట్రాల సమాఖ్య అని రాజ్యాంగం చెబుతోంది. ఈ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడానికి మీరు అపారమైన త్యాగాలు చేశారు. నేడు ఉత్తరాఖండ్‌ను సొంత ప్రజలు పరిపాలించుకోవడం లేదు; దీనిని ఢిల్లీ నుంచి రిమోట్ కంట్రోల్ ద్వారా నడుపుతున్నారు' అని రాహుల్ అన్నారు. బయటి వ్యక్తులు రాష్ట్రంలోని సహజ వనరులను దోపిడీ చేస్తున్నారని, తద్వారా స్థానిక ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలను దూరం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రస్తుత ధామీ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని కూడా రాహుల్ ఆరోపించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ బహిరంగ సభకు, రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడు యశ్‌పాల్ ఆర్య, మాజీ ముఖ్యమంత్రి హరీష్ రావత్‌తో సహా పలువురు సీనియర్ రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం రాహుల్ గాంధీ గురువారం ఉదయం ఉత్తరాఖండ్‌కు చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా, ఆయన గఢ్వాల్, కుమావోన్ డివిజన్లలో పర్యటించి బహిరంగ సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు, పార్టీ కార్యకర్తలను కలవనున్నారు, మాజీ సైనికుల కుటుంబాలతో సంభాషించనున్నారు.

# ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్-6 డేటాతో బిజెపి అసమర్థత బట్టబయలు

- మోదీ ప్రభుత్వం భారతదేశ మహిళలకు, పిల్లలకు ద్రోహం
- బిజెపి తన పాపాలను దాచుకోవడానికి ఐదు అంచెల సూత్రాన్ని అనుసరిస్తోంది : ఖర్గే



**న్యూఢిల్లీ:** ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్–6 డేటా ద్వారా బి జెపి 'సంపూర్ణ అసమర్థత' బయటపడిందని కాం గ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గురువారం ఆరోపించారు.ఆరోగ్య సంరక్షణ, పోషణ విషయంలో మో దీ ప్రభుత్వం భారతదేశ మహిళలకు, పిల్లలకు ద్రోహం చేసిందని మండిపడ్డారు. బిజెపి తన పాపాలను దాచుకోవడానికి ఐదు అంచెల సూ త్రాన్ని అనుసరిస్తోందని ఖర్గే అన్నారు. ఎంపిక చే సిన డేటాను పూడ్చిపెట్టడం, 'సబ్కా సాథ్', 'అమృ త్ కాల్' అని ప్రచారం చేయడం, కథనాన్ని తారుమారు చేయడం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిఆర్‌ను అన్ని విధాలా కాపాడటం వంటి ఆరోపణలను ఆయన బిజెపిపై చేశారు. మోదీ ప్రభుత్వం ఆరోగ్య సంరక్షణ, పోషణ విషయంలో భారతదేశ మహిళలకు, పిల్లలకు ద్రోహం చేయడమే కాకుండా, తన వైఫల్యాలను బయటపెట్టే కీలకమైన డేటాను కూడా ఉద్దేశపూర్వకంగా దాచిపెడుతోందన్నారు. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్–6 గణాంకాలతో బిజెపి పూర్తి అసమర్థత బట్టబయలైందని, ప్రతి ఐదుగురు పిల్లల్లో ఒకరు తీవ్ర పోషకాహార లోపంతో బాధపడుతున్నారన్నారు. మూడింట ఒక వంతు భారతీయ పిల్లలు తక్కువ బరువుతో ఉన్నారని, 6 నుండి 23 నెలల వయస్సు గల పిల్లలలో 84% క ంటే ఎక్కువ మందికి తగినంత పోషణ అందడం లేదని చెప్పారు. ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్– ప్రకారం, 15 నుండి 49 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళల్లో 57% మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రతి ఐదుగురు మహిళల్లో ఒకరు పోషకాహార లోపంతో ఉన్నారు అని ఎన్‌ఎఫ్‌హెచ్‌ఎస్ గ ణాంకాలను ఉటంకిస్తూ ఖర్గే అన్నారు. ఎన్‌ఎఫ్‌హె చ్‌ఎస్–6 సర్వేను 2023–24 సంవత్సరంలో ఆ రోగ్యశ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, ము ంబయిలోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పా పులేషన్ సైన్సెస్ (ఐఐపిఎస్)ను నోడల్ ఏజెన్సీగా నియమించి నిర్వహించింది. 715 జిల్లాల్లోని దా దాపు 6.79 లక్షల కుటుంబాలను కవర్ చేస్తూ, ఈ సర్వే జనాభా, ఆరోగ్యం, పోషణ, కుటుంబ స ంక్షేమ సూచికలపై ఆధారాలను అందిస్తుంది. జిల్లా స్థాయి వరకు కార్యక్రమాల అమలుకు మద్దతు ఇస్తుంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఆరవ విడత నివేదిక ప్రకారం, రోగనిరోధక టీకాల కవరేజ్, పోషకాహార ఫలితాలతో సహా బాలల ఆరోగ్య సూచికలలో భారతదేశం గణనీయమైన మెరుగుదలలను నమోదు చేసింది.

# డెల్సీ రోడ్రిగ్జ్‌తో మోదీ భేటీ



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం వెనిజులా ఉపాధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్‌తో సమావేశమయ్యారు. ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడుల రంగాలలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంపై దృష్టి సారించి చర్చలు జరిపారు. పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా సరఫరాకు అంతరాయాలు ఏర్పడిన నేపథ్యంలో, న్యూఢిల్లీ తన ముడి చమురు కొనుగోళ్లను వైవిధ్యపరచాలని చూస్తున్నందున, ఇరుపక్షాలు ఇంధన సహకారాన్ని విస్తరించుకోవాలని చూస్తున్నాయి. వెనిజులా ఉపాధ్యక్షురాలు బుధవారం భారత్‌కు చేరుకున్నారు. ఈ పర్యటన భారత్–వెనిజులా సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. జనవరిలో అప్పటి అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా దళాలు నిర్బంధించిన తర్వాత, రోడ్రిగ్జ్ వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. అమెరికా విధించిన విస్తృత ఆంక్షలు, పెరుగుతున్న నిబంధనల ఉల్లంఘన ప్రమాదాల కారణంగా 2020లో కొనుగోళ్లు బలవంతంగా నిలిచిపోయే వరకు, భారత్ ఒకప్పుడు వెనిజులా భారీ ముడి చమురును అత్యధికంగా శుద్ధి చేసే దేశంగా ఉండేది. గరిష్ట స్థాయిలో రోజుకు 40 లక్షల బ్యారెళ్లకు పైగా దిగుమతి చేసుకునేది. మదురోను పట్టుకున్న తర్వాత ఆంక్షలు ఎత్తివేయడంతో న్యూఢిల్లీ వెనిజులా నుండి ముడి చమురును కొనుగోలు చేయడం ప్రారంభించింది. ప్రధానంగా పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా, భారత చమురు మార్కెటింగ్ కంపెనీలు గత కొన్ని వారాలుగా వెనిజులా నుండి ముడి చమురు సేకరణను గణనీయంగా పెంచాయి. వెనిజులా తాత్కాలిక అధ్యక్షుడితో పాటు విదేశీ వ్యవహారాలు, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, సమాచార, రవాణా శాఖల మంత్రులతో సహా పలువురు మంత్రులు ఉన్నారు.

# ఢిల్లీ అగ్నిప్రమాద భవనంలో అన్నీ లోపాలే!

- ఎమర్జెన్సీ ఎగ్జిట్, వెంటిలేషన్ లేదు
- దర్యాప్తులో వెలుగు చూసిన కొత్త విషయాలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీ మాలవీయ నగర్‌లో జరిగిన అగ్నిప్రమాదం దర్యాప్తులో పలు కీలక విషయాలు వెలుగు చూశాయి. మంటలు చెలరేగినప్పుడు భవనం పైకప్పు మార్గం మూసి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కారణంగానే లోపల ఉన్నవారు ప్రాణాలతో తప్పించుకునేందుకు అవకాశం లేకుండా పోయిందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. ఇంకా అనేక లోపాలను కూడా అధికారులు గుర్తించారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఘటన జరిగిన తర్వాత పోలీసులు గెస్ట్ హౌస్‌లోని గదుల్లో సోదాలు నిర్వహించి దాదాపు 50 నుంచి 60 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సోదాల్లో సుమారు 30 పాస్‌పోర్ట్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా, దర్యాప్తు సమయంలో భవనం భద్రతా, మౌలిక సదుపాయాల్లో అనేక తీవ్రమైన లోపాలను కూడా అధికారులు గుర్తించారు. భవనం కిటికీలు, గ్లాసులు పూర్తిగా మూసివేసి ఉన్నాయని, ఫలితంగా పొగ బయటకు వెళ్లేందుకు ఎలాంటి మార్గం లేకుండా పోయిందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ అగ్నిప్రమాదంలో భవనంలోని మూడో అంతస్తు, బేస్‌మెంట్‌లో ఉన్నవారు ఎక్కువగా ప్రాణాలు కోల్పోయినట్టు అధికారులు తెలిపారు. దట్టమైన పొగ వల్ల ఊపిరి ఆడకనే అత్యధిక మరణాలు సంభవించినట్లు పేర్కొన్నారు. ఆ భవనంలో సరైన వెంటిలేషన్ ఏర్పాట్లు లేవని, ఎమర్జెన్సీ ఎగ్జిట్ గేటు కూడా లేదని దర్యాప్తులో వెల్లడైంది. ఈ లోపాల కారణంగా పొగ భవనం అంతటా వేగంగా వ్యాపించిందని, తరలింపు ప్రయత్నాలకు తీవ్ర ఆట ంకం కలిగించిందని పేర్కొంది. మంటలను అ దుపులోకి తెచ్చిన తర్వాత కూడా గెస్ట్ హౌస్‌లోని గదులు అత్యంత వేడిగా ఉన్నాయని, ఇది మంటల తీవ్రతను సూచిస్తోందని తెలిపాయి. ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షిగా భావిస్తున్న కేసర్ సింగ్ కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.



**చట్టవిరుద్ధంగా హోటల్‌లో అదనపు అంతస్తులు నిర్మించిన యజమాని**

మరోవైపు ఈ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేసిన ఢిల్లీ పోలీసులు మొత్తం 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పరారీలో ఉన్న హోటల్ మేనేజర్ జైమిశ్రాను పట్టుకునేందుకు 5 బృందాలు గాలిస్తుండగా మిగిలిన 5 బృందాలు ఇతర కోణాల్లో విచారణ జరుపుతున్నాయి. బుధవారం హోటల్ యజమాని లవ్‌కేశ్ శర్మ అరెస్టుకు ముందు దేశం విడిచి పారిపోకుండా ఆయనతో పాటు ఆయన భార్యపై ముందస్తు చర్యగా పోలీసులు లుక్ ఔట్ సర్క్యులర్ జారీ చేశారు. అయితే ఆయనకు నాలుగు రోజుల పోలీసు కస్టడీకి పంపిస్తూ ఢిల్లీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ భాను ప్రతాప్ సింగ్ ఈ ఆదేశాలు ఇచ్చారు. దర్యాప్తు కోసం కస్టడీలోకి తీసుకోవాలని ఢిల్లీ పోలీసులు అభ్యర్థించారు. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 105(హోమిసైడ్), 326(జీ)(అగ్నిప్రమాదం), 324(5)(ప్రాపర్టీ డ్యామేజ్), 125(ఏ)(భద్రతా నిర్లక్ష్యం), 125(బీ)(తీవ్ర నిర్లక్ష్యం), 287(అగ్నిప్రమాదం వేళ నిర్లక్ష్యం) కింద కేసు బుక్ చేశారు. కాగా, మొదట 2 అంతస్తులతో మాత్రమే హోటల్ ప్రారంభించిన యజమాని, ఆ తర్వాత చట్టవిరుద్ధంగా అదనంగా మరో రెండున్నర అంతస్తులను నిర్మించినట్లు విచారణలో తేలింది. మరోవైపు ఇప్పటివరకు ఐదుగురు మృతులను గుర్తించారు దర్యాప్తు అధికారులు. మిగిలిన బాధితుల గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోందని తెలిపారు. వారిని గుర్తించేందుకు పోస్ట్ మార్టం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మృతుల శరీరాలపై తీవ్రమైన కాలిన గాయాలు లేవని చెప్పాయి. ఘటనా స్థలంలో లభ్యమైన పాస్‌పోర్టుల ఆధారంగా విదేశీయుల గుర్తింపు ప్రక్రియను చేపట్టారు. ఆ గెస్ట్ హౌస్‌లో బస చేస్తున్న విదేశీయుల్లో అధిక శాతం మంది వైద్య వీసాలపై భారతదేశానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఆ గెస్ట్ హౌస్‌లో ప్రతి నెలా సుమారు 80 మంది విదేశీయులు బస చేసేవారని తెలిపాయి. ఢిల్లీలోని మాలవీయ నగర్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 21 మంది మరణించారు. వారిలో 11 మంది విదేశీయులు ఉన్నారు. రక్షించిన 58 మందిలో 35 మంది చికిత్స పొందుతున్నారు. 19 మంది పరిస్థితి అత్యంత విషమంగా ఉంది.

# కెపిసిసి చీఫ్‌గా బి.కె.హరిప్రసాద్



**బెంగళూరు :** కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) అధ్యక్షుడిగా బికె హరిప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు ర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్దరామయ్య అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత శివకుమార్ కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడంతో ఈ నియామకం జరిగింది. బుధవారం, జరగబోయే రాష్ట్ర శాసన మండలి ఎన్నికలకు హరిప్రసాద్ పార్టీ అభ్యర్థిగా కూడా నామినేట్ అయ్యారు. పార్టీ నాయకులు, కార్యవర్గ సభ్యులను ఉద్దేశించి శివకుమార్ మాట్లాడుతూ, 'నేను కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశాను. హరిప్రసాద్ కొత్త అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయన పార్టీలో సీనియర్, నిజాయితీపరుడైన కార్యకర్త. ఆయన రాజ్యసభ సభ్యుడిగా, ఎమ్మెల్సీగా పనిచేశారు... ఆయన నాయకత్వంలో మనం పార్టీని నిర్మించి, బలోపేతం చేయడానికి కృషి చేయాలి' అని అన్నారు. జూన్ 18న జరగనున్న కర్ణాటక రాజ్యసభ ఎన్నికలకు ఎఐసిసి చీఫ్ మల్లికార్జున్ ఖర్గే రెండు రోజుల్లో నామినేషన్ దాఖలు చేస్తారని కూడా ముఖ్యమంత్రి సూచించారు. బుధవారం శివకుమార్, తన మంత్రివర్గంలో మంత్రులుగా ఉండనున్న 13 మంది పార్టీ శాసనసభ్యులతో కలిసి కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇదిలా ఉండగా, హరిప్రసాద్‌ను అభినందిస్తూ, సిద్దరామయ్య ఎక్స్ పోస్ట్ పెట్టారు. 'మీ సైద్ధాంతిక నిబద్ధత, సుదీర్ఘ రాజకీయ అనుభవం, పార్టీ పట్ల అంకితభావం, పోరాట జీవితం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని కొత్త దిశలో నడిపిస్తాయనే నమ్మకం ఉంది' అని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి, ప్రజాస్వామ్య వ్యతిరేకులకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలలో చైతన్యం పెంచడానికి హరిప్రసాద్ చేస్తున్న ప్రయత్నాలకు విజయం చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఇప్పటివరకు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీని చాలా సమర్థవంతంగా నడిపించిన శివకుమార్ పని కూడా ప్రశంసనీయమని ఆయన అన్నారు.

# 43 లక్షల టన్నుల పప్పుధాన్యాల నిల్వ



**న్యూఢిల్లీ :** ఈ ఏడాది ఎల్ నినో రానున్నట్లు ఇప్పటికే భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. దీంతో వర్షపాతం తగ్గనుందని కూడా తెలిపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వద్ద ఉన్న 43 లక్షల టన్నుల రికార్డు స్థాయి పప్పుధాన్యాల నిల్వ, ఎల్ నినో వాతావరణ దృగ్విషయం వల్ల సంభవించే సరఫరా అంతరాయం లేదా ధరల పెరుగుదల వంటి వాటికి వ్యూహాత్మక రక్షణగా ఉపయోగపడుతుందని ఒక ఉన్నత ప్రభుత్వ అధికారి గురువారం తెలిపారు. 'దీనిని మనం ఇప్పుడే ఖాళీ చేయాల్సిన అవసరం లేదు. ఒకవేళ ఎల్ నినో ప్రభావం ఉండి, అది ఖరీఫ్ సాగుపై ప్రభావం చూపిస్తే, ఈ పప్పుధాన్యాల బఫర్ నిల్వను ఉపయోగిస్తాము' అని ఫిక్కీ కార్యక్రమం సందర్భంగా వినియోగదారుల వ్యవహారాల కార్యదర్శి నిధి ఖరే పిటిఐకి తెలిపారు.ప్రభుత్వ గణాంకాల ప్రకారం, ప్రస్తుత పప్పుధాన్యాల బఫర్ నిల్వ, మే 2025లో ఉన్న 18 లక్షల టన్నుల కంటే రెట్టింపుకు పైగా ఉంది. అలాగే, మే 2024లో నమోదైన 21 లక్షల టన్నుల కంటే గణనీయంగా అధికంగా ఉంది. దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, ధరల అస్థిరత నుండి వినియోగదారులను రక్షించడం కోసం ప్రవేశపెట్టిన కేంద్రం హామీతో కూడిన సేకరణ విధానం కారణంగా ఈ నిల్వలు భారీగా పెరిగాయి. పప్పుధాన్యాలు త్వరగా పాడవవని, వాటిని రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు సురక్షితంగా నిల్వ చేసుకోవచ్చని పేర్కొన్నారు. భారత వాతావరణ శాఖ, నైరుతి రుతుపవనాలు (జూన్–సెప్టెంబర్) సాధారణం కంటే తక్కువగా ఉంటాయని అంచనా వేయడంతో పాటు, రానున్న నెలల్లో ఎల్ నినో ఏర్పడే అవకాశం ఉందని కూడా హెచ్చరించింది. ఖరీఫ్ (వేసవి) పంటలపై ఈ దృగ్విషయం ప్రభావాన్ని తగ్గించడానికి వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఇప్పటికే ఆకస్మిక ప్రణాళికలను రూపొందించడం ప్రారంభించింది.

ఇంటర్న్‌లు, రెసిడెంట్ డాక్టర్లకు...

# 7 వైద్య కళాశాలలు స్టైఫండ్స్ చెల్లించడం లేదు

'సుప్రీంకోర్టు'కు ఎన్‌ఎంసి వెల్లడి



**న్యూఢిల్లీ :** 756 వైద్య కళాశాలల్లో ఏడు కాలేజీలు ఇంటర్న్‌లు, జూనియర్ రెసిడెంట్లు లేదా సీనియర్ రెసిడెంట్లకు స్టైఫండ్స్ చెల్లించడం లేదని,అందువల్ల వాటికి షోకాజ్ నోటీసులు జారీచేశామని జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసి) సుప్రీంకోర్టుకు తెలియజేసింది. 756 అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కళాశాలల్లో 573 కాలేజీల నుండి స్టైఫండ్ చెల్లింపులకు సంబంధించి ఎలాంటి వివాదం లేదని న్యాయమూర్తులు జస్టిస్ అరవింద్‌కుమార్, జస్టిస్ పి.బి. వరలేలతో కూడిన ధర్మాసనానికి నేషనల్ మెడికల్ కమిషన్ తరపు న్యాయవాది వివరించారు.ఇటీవల అదనంగా 176 వైద్య కళాశాలలు స్థాపించబడ్డాయని చెప్పారు. ఏడు వైద్య కళాశాలలు స్టైఫండ్ చెల్లించడం లేదని, దీనిపై జరిమానా విధించేందుకు షోకాజ్ నోటీసులు జారీ చేయడం ద్వారా ఎన్‌ఎంసి ఇప్పటికే చర్యలు తీసుకుందని, సమాధానం అందిన తర్వాత వారు తదుపరి చర్యలు తీసుకుంటారని కూడా ఆయన సమర్పించారు. ఒక వైద్య కళాశాల మూసివేయబడిందని, ఆ కళాశాలలో ఇంటర్న్‌లు ఎవరూ కూడా లేరని, 562 కళాశాలలు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను నిర్వహిస్తూ ఇంటర్న్‌లకు స్టైఫండ్స్ చెల్లిస్తున్నాయని, కేవలం రెండు వైద్య కళాశాలల్లో మాత్రమే ఇంటర్న్‌లు లేరని, అందువల్ల ఆ రెండు కళాశాలలూ స్టైఫండ్ చెల్లించే ప్రశ్నే తలెత్తదని ఆయన తన వాదనను మరింత విపులీకరిస్తూ వివరించారని ధర్మాసనం పేర్కొంది. ధర్మాసనం న్యాయవాది చారు మజుందార్‌ను నోడల్ కోర్టుగా నియమించి, పార్టీల తరపున హాజరయ్యే న్యాయవాదులను సారాంశం, చార్టులు, వాదన పత్రాలను ఆమెకు సమర్పించాలని ఆదేశించింది.'అవసరమైన చోట ఈ విషయాలలో తదుపరి ఆదేశాలు జారీచేయడం కోసం ఒక సౌకర్యవంతమైన సంకలనాన్ని తయారుచేసి, తదుపరి విచారణ తేదీకి కోర్టుకు సమర్పించాలి' అని ఈ విషయాన్ని ఆగస్టు 24వ తేదీకి విచారణను వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. వైద్య విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించే విషయమై వైద్య పట్టభద్రుడు అభిషేక్ యాదవ్, ఇతరులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. అక్టోబర్‌లో ప్రారంభమయ్యే ఇంటర్న్‌లకు నెలకు రూ.25,000 స్టైఫండ్ తప్పనిసరిచేస్తూ 2023 సెప్టెంబరులో ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ ఇదివరకే గమనించిన విషయమేమిటంటే..2023లో మునుపటి బ్యాచ్‌కు నష్టపరిహారం అందలేదు.

కోర్టులలో 'ఏఐ' వినియోగంపై..

# ముసాయిదా నిబంధనలను విడుదల చేసిన 'సుప్రీం'

భాగస్వాములు, సాధారణ ప్రజల అభిప్రాయాలు కోరిన 'అపెక్స్ కోర్టు'

**న్యూఢిల్లీ :** న్యాయవ్యవస్థ సమగ్రతను కాపాడుతూనే న్యాయవ్యవస్థ స్వరూపాన్ని ఆధునీకరించే చర్యలో భాగంగా సుప్రీంకోర్టు, కోర్టులలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వినియోగానికి సంబంధించిన నిబంధనల ముసాయిదాను రూపొందించింది. ఇందులో అనుమతించబడిన, నిషేధించబడిన వినియోగాల జాబితాను పొందుపరిచింది.'ఫలితం అల్గారిథమిక్ నిర్ణయ–నిర్మాణం ద్వారా సాధించబడాలి' అని పేర్కొంది. కాగా జూన్ 20లోగా భాగస్వాములు, సాధారణ ప్రజల నుంచి వ్యాఖ్యలు, సూచనలను ఆహ్వానిస్తూ సుప్రీంకోర్టు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కమిటీ 'కేసు మేనేజ్‌మెంట్ (కొత్తగా దాఖలుచేసిన వాటిలోని లోపాలను గుర్తించడం సహా) కారణాల జాబితా తయారీ, విచారణల షెడ్యూలింగ్‌లో డాకెట్ ప్రాధాన్యత'లో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సాధనాలను అనుమతించడానికి వీలు కల్పిస్తుంది. కోర్టులలో ఏఐ వినియోగానికి సంబంధించిన ముసాయిదా నిబంధనలు భారత భూభాగంలోని, భారత సుప్రీంకోర్టు, హైకోర్టులు, ట్రిబ్యునల్స్‌తో సహా కోర్టులు తీర్పు విధులను నిర్వర్తించే చట్టబద్ధమైన కమిషన్ల ఏదైనా న్యాయ, తీర్పు లేదా పరిపాలనా విధిలో ఏఐ వినియోగం, విస్తరణ లేదా ఏకీకరణకు వర్తిస్తాయి.ఎఐ సాధనాల దుర్వినియోగంపై సుప్రీంకోర్టు పలు హైకోర్టులు ఆందోళన వ్యక్తం చేయడంతో అటువంటి నియంత్రణ వ్యవస్థ ఆవశ్యకత అంతకంతకూ స్పష్టం అవుతోంది. ఈ సాధనాల వల్ల కొన్నిసార్లు ఉనికిలో లేని కేసు చట్టాలు ఏర్పడి, అవి అసలు తీర్పులను కూడా ప్రభావితం చేశాయి. అదే సమయంలో తీర్పులను స్థానిక భాషల్లోకి అనువదించడం, న్యాయశోధనను క్రమబద్ధీకరించడం వంటి ప్రయోజనాలను మెరుగుపర్చడానికి ఎఐ సాధనాలను ఉపయోగించాల్సిన ప్రాముఖ్యతను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు నొక్కిచెప్పారు. 'మానవ ప్రాధాన్యత, పారదర్శకత, జవాబుదారీతనం, డేటా రక్షణ, న్యాయ స్వాతంత్ర్యం వంటి సూత్రాల ఆధారంగా ఆర్టిఫీషియల్ వినియోగాన్ని నియంత్రించడం, అదే సమయంలో భారతదేశ న్యాయవ్యవస్థ అంతటా బాధ్యతాయుతమైన ఏఐ స్వీకరణ కోసం ఒక సంస్థాగత చట్రాన్ని ఏర్పాటు చేయడం ఈ నిబంధనల లక్ష్యం' అని సుప్రీంకోర్టు తన నోటీసులో పేర్కొంది. 35 పేజీల ముసాయిదా సాంకేతికతకు సంబంధించి ఒక స్పష్టమైన రెడ్‌లైన్‌ను ప్రతిపాదిస్తోంది. ఏఐ సహాయపడగలిగినప్పటికీ అది మానవమేధస్సును ఎప్పటికీ భర్తీ చేయలేదని ఆ ముసాయిదా సూచిస్తోంది. నిబంధనలలో ఒకదాని ప్రకారం కోర్టులలో ఏఐ వాడకం ప్రక్రియలు అన్ని సమయాలలో మానవ వివేచనకు, న్యాయాధికారానికి కచ్చితంగా లోబడి ఉండాలి. ప్రతీ న్యాయవ్యవస్థ కేవలం సహాయక సామర్థ్యంతో మాత్రమే పని చేయాలి. సక్రమంగానియమించబడిన న్యాయాధికారి యొక్క స్వతంత్ర న్యాయాధికార వినియోగాన్ని భర్తీ చేయకూడదు లేదా రాజీ పడకూడదు, చట్టం, వాస్తవం, న్యాయానికి సంబంధించిన విషయాలను నిర్ణయించే అంతి మ అధికారం ప్రత్యేకంగా సమర్థ అధికార పరిధిలోని న్యాయాధికారులకే ఉంటుంది. తీర్పులు, శిక్షలు విధించడం లేదా సాక్షుల విశ్వసనీయతను నిర్ధారించడం వంటి న్యాయపరమైన ఫలితాలను సాధించడానికి ఎఐ వినియోగాన్ని నిబంధన 20 ఖచ్చితంగా నిషేధిస్తుంది.అన్ని తీర్పు విధులలో 'మానవ స్థాయి (హెచ్ఐటిఎల్) విధానం 'తప్పనిసరిగా ఉండాలి. తుది నిర్ణయం తీసుకునే అధికారం కేవలం సక్రమంగా నియమించబడిన న్యాయాధికారి వద్ద మాత్రమే ఉండేలా చూసుకోవాలి. 'కేవలం అల్గారిథమిక్ నిర్ణయ–నిర్మాణం ద్వారా లేదా ఏఐ–ఉత్పత్తి చేసిన సమాచారం, డేటా లేదా విశ్లేషణ ఆధారంగా మాత్రమే ఎలాంటి న్యాయపరమైన ఫలితం ( ఏ తీర్పు, ఉత్తర్వు లేదా వాస్తవ లేదా చట్టపరమైన ముగింపుతో సహా) తీసుకోరాదు. అంతేకాకుండా తీర్పు నిర్ణయాలలో మానవ న్యాయాధికారియే నిర్ణయాత్మక అధికారం కలిగి ఉంటారు' అని ధర్మాసనం పేర్కొంది. న్యాయవ్యవస్థపై ఉన్న పనిభారాన్ని ఎదుర్కోవడానికి ఏఐని స్వీకరించేందుకు సంబంధించిన వ్యూహాత్మక మార్గసూచిని ఆ ముసాయిదా వివరించింది. ఇతర విషయాలతో పాటు చట్టపరమైన పరిశోధన, పూర్వ నిర్ణయాల సేకరణ, ఉల్లేఖన ధృవీకరణ, వాదనలు, తీర్పులు, పత్రాలను సంగ్రహించడం, ఇంకా తీర్పులు, ఉత్తర్వులు, చట్టపరమైన పత్రాల అనువాదం కోసం ఏఐని ఉపయోగించవచ్చు. ఏఐ వినియోగాలను నిషేధించే ప్రాంతాలను కూడా ఈ ముసాయిదాలో స్పష్టంగా పేర్కొన్నారు. ఈ డిజిటల్ పరివర్తనను పర్యవేక్షించడానికి, ముసాయిదా ఒక శక్తివంతమైన మూడంచెల సంస్థాగత చట్రాన్ని ప్రతిపాదించింది. తప్పనిసరి ప్రమాణాలను నిర్దేశించడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన సుప్రీంకోర్టు స్థాయిలో ఒక శాశ్వత, పూర్తికాల అత్యున్నత నియంత్రణ సంస్థ ఉంటుందని పేర్కొంది. అదనంగా స్థానిక అమలును పర్యవేక్షించడానికి ప్రతీ హైకోర్టులో ప్రత్యేక ఏఐ కమిటీలను ఏర్పాటు చేస్తారని ముసాయిదాలో పేర్కొన్నారు.

## డెన్మార్క్ ప్రభుత్వంలో మహిళలకే ప్రాధాన్యత

**కొపెన్‌హాగన్:** డెన్మార్ ప్రధానమంత్రి మెట్టే ఫ్రెడరెక్సన్ ఎన్నికలు జరిగిన 69రోజుల తర్వాత ఎట్టకేలకు కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు నెలరోజులపాటు ప్రతిపక్షాలు,మిత్రులతో సంప్రదింపులు జరిగిన తర్వాత మహిళలే అత్యధిక సంఖ్యాకులున్న మంత్రివర్గాన్ని మెట్టే ఏర్పాటు చేశారు. 179 స్థానాలున్న డెన్మార్క్ పార్లమెంటులో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే ఏ పార్టీ అయినా 90 స్థానాలు గెలుచుకోవాలి. వరుసగా మూడవసారి ఆమె ప్రధానమంత్రి కాగలిగినప్పటికీ,కేవలం 38 సీట్లు మాత్రమే గెలుచుకుని ప్రభుత్వ ఏర్పాటుకు చాలా దూరంలో ఉండిపోయారు. డెన్మార్క్‌లో మార్చినెలలో జరిగిన ఎన్నికలు అసంపూర్ణంగా ముగిశాయి. ఏకైక పెద్దపార్టీగా ఏర్పడినప్పటికీ మెట్టేకు ఎవరూ కలిసిరాలేదు. సొంత సోషల్ డెమోక్రాట్స్,సోషలిస్ట్ పీపుల్స్‌పార్టీ, వామపక్ష రాడికల్ వెన్స్ట్రే, మధ్యేవాద మోడరేట్ పార్టీల భాగస్వామ్యంతో చివరకు ఆమె ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారు. ఇప్పటివరకూ అమె తాత్కాలిక ప్రధానమంత్రి పదవిలో కొనసాగారు. మార్చినెలలో జరిగిన ఎన్నికల్లో అనిశ్చిత పరిస్థితి ఏర్పడింది. పన్నెండు పార్టీలు సీట్లు గెలుచుకున్నాయి. గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకునేందుకు ట్రంప్ పథకం పన్నిన తర్వాత ఈ మంత్రాన్ని ఉపయోగించుకుని సానుభూతి ఓట్లతో తిరిగి గెలవాలనే ఉద్దేశంతో నిర్ణీత గడువుకంటే ముందుగానే ఆమె ఎన్నికలు నిర్వహించి ఆశాభంగం చెందారు. ఎన్నికల్లో అధికార సోషల్ డెమోక్రాట్లు ఎక్కువ ఓట్లు సంపాదించినప్పటికీ కూడా 123 ఏళ్ళ చరిత్రలో అత్యంత బలహీనమైన మెజారిటీని ప్రదర్శించడం ఆ పార్టీకి ఇదే మొదటిసారి. అమెరికాను చైనా,రష్యాల నుండి కాపాడుకోవాలంటే గ్రీన్‌లాండ్ అత్యంత ప్రాముఖ్యత గల కీలక వ్యూహాత్మక ప్రాంతంగా ఉందని, అందువల్ల గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించిన తర్వాత డెన్మార్క్‌లో ప్రకంపనలు మొదలై చివరకు ఈ దశకు వచ్చాయి.

# కాల్పుల విరమణ పునరుద్ధరణకు ఇజ్రాయెల్–లెబనాన్ అంగీకారం

హెజ్బొల్లా నిషేధానికి పైలట్ భద్రతామండలాలు
ఇజ్రాయెల్– లెబనాన్ అంగీకారం
లెబనాన్ సైన్యానిదే నియంత్రణాధికారం
ఒప్పందం జరిగాక మళ్ళీ ఉల్లంఘన

**వాషింగ్టన్:** అమలు కాకుండా అపహాస్యంగా మారిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాలని వాషింగ్టన్‌లో జరిగిన సమావేశంలో ఇజ్రాయెల్–లెబనాన్ అంగీకరించాయి. ఐతే హెజ్బొల్లా ఉగ్రవాద సైన్యాలు దాడులు నిలిపివేస్తేనే కాల్పుల విరమణకు అంగీకరిస్తామని ఇజ్రాయెల్ మెలిక పెట్టింది. హెజ్బొల్లా ఉగ్రవాద సైన్యాల కార్యకలాపాలను నిషేధించి, నియంత్రించడానికి వీలుగా అనేక పైలట్ భద్రతా మండలా(పైలట్ సెక్యూరిటీ జోన్స్)లను లెబనాన్ లోపల ఏర్పాటు చేయాలని, కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించుకోవాలని అమెరికా విదేశీ మంత్రిత్వశాఖ కార్యాలయంలో దౌత్యవేత్తలస్థాయిలో జరిగిన సమావేశంలో రెండు దేశాలూ అంగీకరించాయి. అమెరికా విదేశీమంత్రిత్వశాఖ ఈ ఉమ్మడి ప్రకటనను గురువారం విడుదల చేసింది. ఐతే ఒప్పందం కుదిరినాగానీ గురువారంనాడు లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగినట్లు ప్రభుత్వ వర్గాలు ప్రకటించాయి. ఈ దాడుల్లో అనేకమంది గాయపడ్డారు. హెజ్బొల్లా తెగబడితే దక్షిణ లెబనాన్‌లో దాడులు కొనసాగిస్తామని ఇజ్రాయెల్ రక్షణమంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ప్రకటించారు. మార్చి రెండో తేదీ నుండి ఇప్పటివరకూ లెబనాన్‌లో 3,516 మంది మరణించారు. లెబనాన్ భవిష్యత్తును నిర్దేశించడానికి ఏ విదేశీ సంస్థకు, సైన్యానికీ హక్కు,అధికారం లేదని, దానిని బందీగా ఉంచకూడదని కూడా ఒప్పందం ప్రధానంగా పేర్కొంది. అలాంటి ప్రయత్నాలను ఈ



ఒప్పందం తిరస్కరించింది. ఇది ప్రధానంగా హెజ్బొల్లాను, ఇరాన్‌ను ఉద్దేశించినదే. అమెరికా–ఇరాన్ మధ్య సంఘర్షణ ముగించాలంటే లెబనాన్‌లో ఇజ్రాయెల్ యుద్ధం తక్షణం నిలిపివేయాలని, తాత్కాలిక ఎంఓయులో ఈ అంశాన్ని చేర్చాలని ఇరాన్ పట్టుబడుతున్న పూర్వరంగంలో ఈ ఒప్పందం జరిగింది. లిటానీ నదికి దక్షిణంగా ఉన్న ప్రాంతం నుండి హెజ్బొల్లా దళాలు ఇజ్రాయెల్ ఐడిఎఫ్‌పై కాల్పులు జరపడం మానుకోవాలి. అక్కడి నుండి హెజ్బొల్లా సాయుధ సైన్యాలను తరలించాలి. ఈ రెండు విషయాలపైనే ప్రధానంగా ఈ ఒప్పందం ఆధారపడి ఉందనే విషయాన్ని ఇరు పక్షాలు అంగీకరించాయి. లెబనాన్‌ను హెజ్బొల్లా దళాలు అనవసరంగా ఈ యుద్ధంలో ఇరికించాయని లెబనాన్ ప్రభుత్వాధినేతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు.
జూన్ మూడు, నాలుగో తేదీలలో ఈ రెండు దేశాల ప్రతినిధులమధ్యా అమెరికా మధ్యవర్తిగా నాలుగో విడత కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు,శాంతి చర్చలు జరిగాయి. రెండు దేశాలమధ్యా కాల్పుల విరమణ ఒప్పందం ఉన్నప్పటికీ అది సజావుగా,సక్రమంగా అమలు కావడంలేదు.ఈ పరిస్థితులను చక్కబెట్టుకోవడానికి, కాల్పుల విమరణ ఒప్పందాన్ని ఖరాఖండీగా అమలు చేసేందుకు, ఇజ్రాయెల్ దళాలు ఆత్మరక్షణ దాడులు చేయకుండా ఉండేందుకు వీలుగా ఈ పైలట్ భద్రతామండలాలు ఉపయోగపడతాయని భావిస్తున్నారు. ఐతే ఈ భద్రతా మండలాలను ఏ విధంగా ఏర్పాటు చేస్తారనే విషయం ఇంతవరకూ అధికారికంగా స్పష్టం కాలేదు. ఐతే ఈ పైలట్ భద్రతా మండలాలపై పూర్తిగా లెబనాన్ సైన్యాలకే నియంత్రణాధికారాలు ఉంటాయని ఒప్పందం పేర్కొంది. ఈ చర్యలు సమగ్రశాంతి,భద్రతా చర్యలకు దారితీస్తాయని అమెరికా విదేశీమంత్రిత్వశాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఏప్రిల్‌లో అమెరికా కుదిర్చిన ఒప్పందం విఫలమైన తర్వాత ట్రంప్ ఇప్పుడు మళ్ళీ ఈ కొత్త కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదిర్చారు. సోమవారం బీరూట్‌లో ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఐతే అంతకుమించిన స్థాయిలో ఇజ్రాయెల్ దళాలు ముందుకు వెళ్ళలేదు. దక్షిణ లెబనాన్‌లో బ్యూఫోర్ట్ కోటను ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకున్న తర్వాత పెద్ద రగడ జరిగింది. దీనివల్ల అమెరికా–ఇరాన్ మధ్య ఒప్పందానికి సమస్యలు రావడంతో ఫోన్ సంభాషణల్లో నెతన్యాహూపై ట్రంప్ విరుచుకుపడ్డారు. ''నీకు పిచ్చి పట్టింది, నువ్వో పిచ్చోడివి, నేను నిన్ను కాపాడుతూ వస్తున్నాను, నేను లేకపోతే నువ్వు ఈ పాటికి జైలులో ఉండేవాడివి'' అని ట్రంప్ బూతు పురాణం అందుకోవడంతో నెతన్యాహూ బీరూట్‌పై భారీ దాడుల ప్రణాళికను నిలిపివేశారు. లెబనాన్‌తో,ఇరాన్‌తో యుద్ధం ముగించేందుకు ఒక ఒప్పందం కుదుర్చుకునేందుకు వాషింగ్టన్‌లో చేసిన ఈ కొత్త ప్రకటన ద్వారా విడిగా ఒక ప్రయత్నం జరుగుతుంది.
లెబనాన్ కేంద్రంగా ఇరాన్ అనుకూల ఉగ్రవాద దళం హెజ్బొల్లా ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా పనిచేస్తూ ఉండటంతో తరచు ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై ఈ దళాలు రాకెట్ దాడులు చేస్తున్నాయని, తమ దేశంలో అశాంతి సృష్టిస్తోందని ఐడిఎఫ్ ఆరోపిస్తోంది

## భద్రతామండలి ఎన్నికల్లో జర్మనీకి ఎదురుదెబ్బ

ఆస్ట్రియా, పోర్చుగల్ సహా ఐదు దేశాలకు సభ్యత్వం

**న్యూయార్క్:** ఆస్ట్రియా, పోర్చుగల్ సహా ఐదుదేశాలకు ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో తాత్కాలిక సభ్యత్వం లభించింది. 2027–2028 కాలానికిగాను ఆస్ట్రియా,పోర్చుగల్,కిర్గిజ్‌స్థాన్,ట్రినిడాడ్, టోబోగో,జింబాబ్వే దేశాలు తాత్కాలిక సభ్యులుగా ఎన్నిక య్యాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన జర్మనీకి పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. పశ్చిమ యూరోపియన్,ఇతర దేశాల విభాగంలో జరిగిన ఎన్నికల్లో జర్మనీ 104 ఓట్లతో ఓడిపోయింది. దీనిపై జర్మనీవిదేశాంగమంత్రి జోహన్ వాడేపుల్ మీడియాతో మాట్లాడుతూ, దీనిని పెద్ద చేదు అనుభవంగా పేర్కొన్నారు. ఈ తీవ్రమైన పోటీలో తాము ఆలస్యంగా చేరడంవల్ల తాము మొదటినుండీ ప్రతికూలస్థితిలోనే ఉన్నామని,తీవ్రంగా నిరాశ చెందామని చెప్పారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ పట్ల ఒక ప్రత్యేక బాధ్యతతో వ్యవహరించాలని తాము కోరుకున్నందువల్ల కూడా ఈ పోటీలో తాము ఓడిపోయి ఉండవచ్చునన్నారు. ఈ రెండేళ్ళకాలంలో ఈ ఐదు దేశాలతో తాము ఎంతో సన్నిహితంగా కలిసి పనిచేస్తామని భారతదేశం ప్రకటించింది. మొత్తం 193 మంది సభ్యులున్న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ తీవ్ర పోటీ మధ్య పైన పేర్కొన్న ఐదు దేశాలను రెండేళ్ళకాలానికిగాను ఎన్నుకుంది. డెన్మార్క్,గ్రీస్,పాకిస్థాన్, పనామా, సోమాలియా దేశాలు గడచిన రెండు సంవత్సరాలుగా భద్రతామండలిలో తాత్కాలిక సభ్యులుగా కొనసాగాయి. 2026 డిసెంబరునాటికి ఈ దేశాల సభ్యత్వ పదవీకాలం ముగియగానే కొత్తగా ఎన్నికైన దేశాలు ఆ స్థానాలను భర్తీచేస్తాయి. కొత్తగా ఎన్నికైన సభ్యులకు భారత్ అభినందనలు తెలియజేసింది. ఐక్యరాజ్యసమితిలో భారత్ తరపున శాశ్వత ప్రతినిధి,రాయబారి హరీశ్ పర్వతనేని ఎక్స్‌వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, ''భద్రతామండలికి కొత్తగా ఎన్నికైన సభ్యదేశాలకు అభినందనలు,మీతో కలిసి పనిచేసేందుకు మేం ఎదురుచూస్తున్నాం, మీకు విజయం చేకూరాలి'' అని 2027 జనవరి 1 వ తేదీ నుండి 2028 డిసెంబరు 31వ తేదీ వరకూ ఈ ఐదు దేశాలు సభ్యులుగా కొనసాగేందుకు రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నికయ్యాయి..




## ట్రంప్–బిబి క్రేజీ ఫోన్‌కాల్‌పై మీడియా హల్‌చల్

ఇరాన్‌తో బెడిసికొట్టిన ఒప్పందం

**వాషింగ్టన్:**డోనాల్డ్ ట్రంప్–నెతన్యాహూ (బిబి) మధ్య గడచిన సోమవారం (జూన్ 1వతేదీ) జరిగిన క్రేజీ ఫోన్ సంభాషణ ఇప్పుడు అంతర్జాతీయ మీడియాలో అతిపెద్ద చర్చనీయాంశంగా మారింది. ట్రంప్–నెతన్యాహూ మధ్య విభేదాలు రాజుకున్నాయని, నెతన్యాహూవల్లనే అమెరికా–ఇరాన్ మధ్య చివరివరకూ వచ్చిన ఒప్పందం కాస్తా బెడిసికొట్టిందని పుంఖానుపుంఖాలుగా వార్తలు,సంపాదకీయాలు,రకరకాల కథనాలతో మీడియా హోరెత్తుతోంది. వీరిద్దరి మధ్య సంబంధాలపై పలు వ్యంగ్య చిత్రాలు హల్‌చల్ చేస్తున్నాయి. ట్రంప్–నెతన్యాహూ మధ్య విడదీయరాని సంబంధం ఉందని, వారి మధ్య సమన్వయం అనిర్వచనీయమైనదని ప్రపంచంలో అందరికీ తెలిసిందే. ఐనప్పటికీ ఈసారి ట్రంప్ తిట్టిన తిట్లు మాత్రం మామూలుగా లేవు. ''అసలు నువ్వేమనుకుంటున్నావ్? నువ్వో పిచ్చోడివి,నీకు పిచ్చిపట్టింది, నేను నిన్ను కాపాడుతూ వస్తున్నాను, లేకపోతే ఈపాటికి నువ్వు జైల్లో ఉండేవాడివి'' అని చెప్పిన మాటలు అక్షరాలా నిజాలన్న వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. కానీ తర్వాత ట్రంప్ ఈన మాటలను సరిచేసుకున్నారు. బీబీపై తాను విరుచుకుపడినమాట నిజమేనని, కానీ ఉత్తమ కుటుంబాలలో మాదిరిగానే తమ మధ్య కూడా అప్పుడప్పుడు ఈ విధమైన వ్యూహాత్మక విభేదాలు వస్తాయని సిఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో కొట్టిపారేశారు.పాత్రికేయులు ఈ విషయాలపై అడిగిన ప్రశ్నలకు నవ్వుతూ పక్కకు తోసిపారేశారు.''మీరు చెప్పింది నిజమే, నేను ఆ క్షణంలో ఆగ్రహం వ్యక్తం చేశాను, సోమవారం ఉదయం మేం విభేదించుకున్నాం, కానీ మధ్యాహ్నానికల్లా ఏకాభిప్రాయానికి వచ్చాం'' అని ట్రంప్ చెప్పారు. ట్రంప్ పదే పదే చెప్పినా గానీ వినకుండా నెతన్యాహూ లెబనాన్‌పై పిచ్చిపట్టినట్లు దాడులు చేయడం ప్రారంభించారు. ట్రంప్ మధ్యవర్తిగా ఉండి కుదిర్చిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఆయన లెక్కచేయడం లేదు. ఒకవైపు నవంబరులో అమెరికాలో మధ్యంతర ఎన్నికలు ముంచుకువస్తున్నాయి. ప్రతిపక్ష డెమోక్రాట్లు విపరీతంగా ప్రతికూల అంశాలను ప్రజల్లో ప్రచారం చేస్తున్నారు. పైగా ఎన్నడూలేనివిధంగా ట్రంప్ రేటింగ్ అమెరికాలో 36 శాతానికి పడిపోయింది. దీంతో డెమోక్రాట్లకు ఎంతో మేలు కలుగుతోంది. రెండోవైపు ట్రంప్‌కు ఉన్న యుద్ధాధికారాలను తగ్గించేందుకు అమెరికా కాంగ్రెస్‌లో చాలా పెద్ద ప్రయత్నం జరుగుతోంది. లెబనాన్‌లో యుద్ధం ముగింపు కూడా ఒప్పందంలో చేర్చాలని ఇరాన్ పట్టుపట్టింది. ఈ పరిస్థితులమధ్య ఏదో విధంగా ఒప్పందం చేసుకుని డిసెంబరువరకూ ప్రశాంతంగా ఉండాలని ట్రంప్ ప్రయత్నం చేస్తుంటే అందుకు నెతన్యాహూ మధ్యలో దూరి ట్రంప్‌కు చికాకు కలిగించడంతో సోమవారంనాడు ఆ ఇద్దరిమధ్యా ''పిచ్చివాడి'' సంభాషణ జరిగింది. ఈ సంభాషణ కాస్తా ప్రపంచవ్యాప్తంగా మీడియాకు ముఖ్యంగా ఇరాన్‌కు అతిపెద్ద వనరుగా మారింది. ఈ అంశం వ్యంగ్యమైన ఎ.ఐ వీడియోల క్రియేషన్‌కు పెద్ద మార్కెట్ వస్తువుగా మారింది. వాషింగ్టన్ ఏం చెప్పినాగానీ నెతన్యాహూకు తనదైన శైలిలో వ్యవహరించడం అలవాటుగా మారిందని వైట్‌హౌస్ గ్లోబల్ సిత్యుయేషన్ రూమ్ అధ్యక్షుడు బ్రెట్ బ్రూన్ చెప్పారు.



## అర్బన్ నక్సల్స్

(మొదటి పేజీ తరువాయి)

సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో '12 ఏళ్ల తెలంగాణ ఆకాంక్షల సాధన భవిష్యత్ ప్రయాణం' అనే అంశంపై రాంచందర్‌రావుతో గురువారం 'మీట్ ది ప్రెస్' నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు అడిగిన పలు ప్రశ్నలకు రాంచందర్ రావు సమాధానమిచ్చారు. లక్ష కోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల రైతులకు ప్రయోజనం దక్కలేదని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి పూర్తి స్థాయిలో సిబిఐ విచారణ చేపట్టేలా చూడాలన్నారు.

తెలంగాణ రాష్ట్రాన్ని వ్యతిరేకించిన ఎంఐఎంను కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ఎందుకు అక్కున చేర్చుకున్నాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశారన్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధనలో బిజెపి పోషించిన పాత్ర చారిత్రాత్మకమని, దీనిని ఎవ్వరూ విస్మరించలేరన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గత 12 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి సుమారు రూ.13 లక్షల కోట్ల ఆర్థిక సహకారం అందించిందన్నారు.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో సభ పెట్టుకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చిన నష్టమేమిటని ఆయన ప్రశ్నించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఎపి సిఎం చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు.

**కెటిఆర్ వస్తే బిజెపి పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి చూపిస్తాం:**
కెటిఆర్ తనతో వస్తే బిజెపి పాలిత రాష్ట్రాలలో జరిగిన అభివృద్ధిని చూపిస్తానని రాంచందర్‌రావు అన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న 'సర్' (ఓటరు జాబితా ప్రక్షాళన) ప్రక్రియ కేంద్రానిదో, బిజెపిదో కాదని, భారత ఎన్నికల సంఘం చేపట్టే స్వతంత్ర ప్రక్రియ అని అన్నారు. రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో బిజెపి ఒంటరిగానే పోటీ చేసే ఆలోచనలో ఉందని, కానీ పొత్తులపై తుది నిర్ణయం జాతీయ నాయకత్వానిదేనని ఆయన అన్నారు. ఈ మీట్ ది ప్రెస్ కార్యక్రమానికి సీనియర్ జర్నలిస్టు ఉమా సుధీర్ సమన్వయ కర్తగా వ్యవహరించగ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వరికుప్పల రమేష్ వేదిక పైన ఆసీనులయ్యారు.

## ఉత్తమ పోలీసు శిక్షణా సంస్థలలో ఒకటిగా తెలంగాణ పోలీస్ అకాడమీ

డిజిపి సి.వి.ఆనంద్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజా బహదూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీ దేశంలోని ఉత్తమ పోలీసు శిక్షణా సంస్థలలో ఒకటిగా ఎదిగిందని రాష్ట్ర డిజిపి సి.వి.ఆనంద్ ప్రశంసించారు. శిక్షణలో ఉత్తమ ఫలితాల కోసం అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం, టీమ్ వర్క్, సంస్థాగత స్ఫూర్తి ఎంతో అవసరమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట రామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీని గురువారం డిజిపి సందర్శించి, అకాడమీ కార్యకలాపాలు, శిక్షణా సదుపాయాలను సమీక్షించారు. అకాడమీ డైరెక్టర్ అభిలాషా బిస్త్ డిజిపికి స్వాగతం పలికారు. యూనిట్ ఆసుపత్రి, పరిపాలనా విభాగం, ఆడిటోరియం, తరగతి గదులు, మెస్‌లు, క్రీడా భవన్, ఫైరింగ్ రేంజ్, పరేడ్ గ్రౌండ్ తదితర శిక్షణా సదుపాయాలను డిజిపి స్వయంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో అకాడమీ డైరెక్టర్ ఇండక్షన్, ఇన్‌సర్వీస్ శిక్షణా కార్యక్రమాలు, సిలబస్, మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలు, నిర్వహించిన వర్క్‌షాప్‌లు, సెమినార్లు అకాడమీ ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సి.వి. ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్లు, జిల్లా శిక్షణా కేంద్రాలతో పాటు ఇతర శిక్షణా సంస్థలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణా కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన అన్ని అనుమతులు, సహకారాన్ని చీఫ్ ఆఫీస్ నుంచి అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మాదకద్రవ్యాల నియంత్రణ (ఎన్‌డిపిఎస్), సైబర్ నేరాల దర్యాప్తు, మోటారు వాహనాల చట్టం అమలు, రోడ్డు భద్రత, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. మహిళా పోలీసు సిబ్బంది సాధికారత, భాగస్వామ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో 'తెలంగాణ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్ ఇన్ పోలీస్' కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అకాడమీకి చెందిన సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## లక్ష ఎకరాలకు సాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతున్న మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ –1 పనులను పరిశీలించారు. ప్యాకేజ్ –1లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సాయంత్రం జోగులాంబ గద్వాల జిల్లాకు చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధరూర్ మండలం గుడ్డందొడ్డి హెలిప్యాడ చేరుకున్నారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్, జవహర్ లాల్ నెహ్రూ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం ఫేజ్–1ను పరిశీలించారు. గుడ్డందొడ్డి రిజర్వాయర్ ప్రస్తుత సామర్థ్యం 1.5 టిఎంసిలు కాగా 15 టిఎంసిలకు పెంచాలని ప్రతిపాదన సాధ్యాసాధ్యాలపై పరిశీలించారు. నెట్టెంపాడు ఫేజ్–1 పంప్ హౌస్ పరిశీలన, ఫొటో ఎగ్జిబిషన్ వీక్షించారు. పాలమూరు ప్రాజెక్టుల పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యంపై వీడియో ప్రదర్శించారు. ఆ తర్వాత హెలికాప్టర్ ద్వారా బయలుదేరి సాయంత్రం 6 గంటలకు నాగర్ కర్నూలు జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిలకు చేరుకున్నారు. అక్కడి మృగవాణి రిసార్ట్ రివర్ ఫ్రంట్‌లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కొల్లాపూర్‌లోని సోమశిలలోనే సిఎం బస చేశారు. గురువారం నాటి కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసురాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డా.వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీహెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీధర్, చీఫ్ ఇంజనీరు సత్యనారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ హెచ్.టి.శ్రీధర్‌లు హాజరయ్యారు.

## ఎబోలా అనుమానితుడు

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తున్నారు. నమూనాలు సేకరించి సిసిఎంబికి వైద్యులు పంపించడం జరిగింది. సిసిఎంబి నుంచి పూణేలోని వైరాలజీ ల్యాబ్‌కు నమూనాలను తరలిస్తారు. టెస్ట్ రిజల్ట్ వారం రోజుల్లో వచ్చే అవకాశముంది. ఎబోలా అనుమానిత రోగికి ప్రాణాపాయం లేదని ఎబోలా స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. ఎబోలా నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణికులకు థర్మల్ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల ట్రావెల్ హిస్టరీ కారణంగా అనుమానితుల శ్యాంపిల్లను సేకరిస్తున్నారు. ప్రస్తు తం ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వైరస్ కేసులు అధికంగా నమోదు అవుతున్న విషయం తెలిసిందే. దీంతో తెలంగాణ ఆరోగ్యశాఖ విమానాశ్రయాల వద్ద ప్రత్యేక స్క్రీనింగ్ చేపడుతోంది. ఎబోలా మేనేజ్‌మెంట్ కోసం తెలంగాణలో గాంధీ ఆస్పత్రిని నోడల్ సెంటర్‌గా గుర్తించారు. ఇక్కడ ప్రత్యేకమైన ఐసోలేషన్ వసతులు ఏర్పాటు చేశా రు. ఎబోలా కేసులకు చికిత్స అందించేందుకు కొన్ని మెడికల్ బృందాలను స్టాండ్‌బై పెట్టుకున్నారు.

## జనం కిటకిట

(మొదటి పేజీ తరువాయి)

కీలక నిర్ణయం తీసుకుంది. రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ సజావుగా సాగడం కోసం, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటం కోసం గురువారం పనివేళలను రాత్రి 7:30 గంటల వరకు పొడిగిస్తూ రెవెన్యూ శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కార్యాలయంలో టోకెన్లు పొందిన వారందరికీ రిజిస్ట్రేషన్లు పూర్తయ్యేలా చూడాలని ఉన్నతాధికారులు సబ్ రిజిస్ట్రార్లను ఆదేశించారు. ప్రభుత్వం పనివేళలను పొడిగించి ఊరట కల్పించినప్పటికీ, ఒకేసారి వేల సంఖ్యలో జనం తరలిరావడంతో రిజిస్ట్రేషన్‌ల వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి నెలకొంది.

**ఎందుకీ పెంపు? :** బహిరంగ మార్కెట్‌లో ఉన్న వాస్తవ ధరలకు, ప్రభుత్వ అధికారిక రిజిస్ట్రేషన్ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించడం (హేతుబద్ధీకరణ) ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకోవాలని సర్కారు భావిస్తోంది. ఈ మేరకు అధికారులు ఇప్పటికే కసరత్తు పూర్తి చేసి, కొత్త ధరల డేటాను ఐజిఆర్‌ఎస్ వెబ్‌సైట్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా అప్లోడ్ చేశారు.

తాజా సవరణతో వ్యవసాయ భూములు, ప్లాట్లు, ఇండ్లు, అపార్టమెంట్ ఫ్లాట్లు ఇలా అన్ని కేటగిరీల రిజిస్ట్రేషన్ విలువలు భారీగా పెరగనున్నాయి. నేటి నుండి రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు కచ్చితంగా ఈ పెరిగిన మార్కెట్ ధరల ప్రకారమే అదనపు ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది.

అదనపు ఆర్థిక భారం నుంచి తప్పించుకునేందుకు కొనుగోలుదారులు పోటీ పడటంతో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగే పరిస్థితులు నెలకొన్నాయి.

## కాంగ్రెస్ అడ్డుకట్ట

(మొదటి పేజీ తరువాయి)

గమనిస్తున్నారనడానికి ఇదొక సూచన'' అన్నారు. ఈ తీర్మానం ప్రకారం ట్రంప్ పశ్చిమాసియా నుండి సైన్యాలను ఉపసంహరించాలి. లేకపోతే పశ్చిమాసియాలో ఎందుకు యుద్ధం ప్రారంభించాల్సివచ్చిందో, యుద్ధా న్ని ఎందుకు కొనసాగించాల్సిన అవసరం ఉందో తెలియజేస్తూ మరోసారి దేశాధ్యక్షుడు కాంగ్రెస్ ఆమోదం పొందవలసి ఉంటుంది. ఐతే ప్రతినిధుల సభ చేసిన ఈ తీర్మానం చట్టబద్ధంగా ఎంత మేరకు చెల్లుబాటు అవుతుంది? చట్టపరంగా ట్రంప్‌కు ఇతర మార్గాలు ఉన్నాయా? అనే విషయం పూర్తిగా తెలియలేదు. ట్రంప్‌కు లభించిన ప్రత్యేక యుద్ధాధికారాలను అడ్డుకోవడంలో కాంగ్రెస్ ఇంకా చాలా వెనుకబడే ఉందని పేర్కొంటూ వైట్‌హౌస్ వర్గాలు ఈ తీర్మానం యోగ్యతను కొట్టి పారేశాయి. ఇది రాజ్యాంగ విరుద్ధమైన ప్రయత్నమంటూ తీర్మానాన్ని తిరస్కరించాయి. ఎంతవరకూ ఈ తీర్మానంవల్ల ట్రంప్‌కు చట్టబద్ధంగా లభించిన యుద్ధ అధికారాలను అడ్డుకోవచ్చుననే విషయం చర్చనీయాంశమైంది. ఐతే నిర్ణీత గడువులోపు ట్రంప్ ఇరాన్‌పై యుద్ధ దాడులను నిలిపివేశారు. అందువల్ల ఆయన యుద్ధాధికారాల నిబంధనలను ఉల్లంఘించలేదని, ప్రస్తుతం కొనసాగుతున్నది చర్చల ప్రక్రియేతప్ప దాడుల పరంపర కాదని వైట్ హౌస్ అధికార వర్గాలు ప్రకటించాయి. యుద్ధ అధికారాల తీర్మానాన్ని ఆమోదించడంకోసం ఈ ఓటింగ్ జరిగింది. సెనేట్ కూడా మే నెలలో ఇలాంటి తీర్మానాన్నే ముందుకు తెచ్చింది. కానీ ఇంకా పూర్తిస్థాయిలో ఈ తీర్మానంపై ఓటింగ్ జరగలేదు. యుద్ధంకోసం నిధులు కేటాయించాల్సి రావడం, అందుకు సభ ఆమోదం అవసరం పడటం,పెట్రోలు ధరలు భగ్గుమని మండుతూ జనం ఇబ్బందులు పడుతూ ఉండటం, ప్రజల వ్యతిరేకత, యుద్ధంపై కూడా అ మెరికాలో పెరుగుతున్న వ్యతిరేకతల మధ్య కాంగ్రెస్‌లో ఈ తీర్మానం చేయడం ఒక అనివార్యమైన విషయంగా మారింది. రాజకీయ మిత్రులకోసం ట్రంప్ ప్రతిపాదించిన 1.8 బిలియన్ డాలర్ల ఆయుధీకరణ నిరోధ నిధి బిల్లును దిగువసభలో సంప్రదాయవాదులు వ్యతిరేకించిన కొద్ది రోజుల తర్వాత కాంగ్రెస్‌లో ఈ తీర్మానం ఆమోదం పొందడంతో అధికార రిపబ్లికన్‌పార్టీలో ఏర్పడిన విభేదాలకు ఇది ఒక తాజా సంకేతంగా మారింది.

**వాళ్ళకి దేశభక్తి లేదు:ట్రంప్ ఎదురుదాడి**
కాంగ్రెస్‌లో యుద్ధ వ్యతిరేక తీర్మానాన్ని సమర్థిస్తూ ఓటింగ్‌లో పాల్గొన్న చట్టసభ సభ్యులపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎదురుదాడి చేశారు. వారికి దేశభక్తి లేదు అని విమర్శించా రు.

ఇరాన్‌తో యుద్ధం ముగించడానికి నేను తుది విడత చర్చల్లో ఉన్నాను, తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాను, ఈ దశలో ఈ తీర్మానంపై ఓటు వేశారంటే దేశభక్తి లేనివాళ్ళు తప్ప ఇలాంటి పనులు ఇంకెవరు చేస్తారు అని విమర్శించారు. డెమోక్రాట్లు ట్రంప్ వ్యతిరేక సిండ్రోమ్‌తో రెచ్చిపోతున్నారు, వారు అనేక విజయాలలో మరో విజయాన్ని ట్రంప్‌కు ఇవ్వడానికి బదులుగా మన దేశం విఫలమైపోవడానికే ఇష్టపడుతున్నారని అన్నారు. యుద్ధ అధికారాల వ్యతిరేక తీర్మానాన్ని సమర్థించిన ఆ నలుగురు రిపబ్లికన్లదీ ఇక వేరే కథ, వాళ్ళంతా ఆర్భాటాలు చేసేవాళ్ళు అని విమర్శించారు.

## కెఎస్ఆర్ ఫ్యాషన్స్ బుగ్గిపాలు

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే షాపింగ్ కాంప్లెక్స్‌లో మంటలు చెలరేగడంతో ప్రజలు షాక్‌కు గురయ్యారు. చూస్తుండగానే మూడంతస్తుల భవనంలో ఏర్పాటైన టాయ్స్ షాప్, హెల్మెట్ షాప్, కేఎస్ఆర్ రెడీమేడ్ ఫ్యాషన్స్‌లోకి వ్యాపించాయి. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్షణాల్లోనే పక్కనే ఉన్న ఇతర దుకాణాల్లోని ప్లాస్టిక్, ఫ్యాషన్ రెడీమేడ్స్, బట్టలకు త్వరితగతిన మంటలు వ్యాపించడం జరిగింది.

మరోవైపు ప్రమాదంపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, మధురానగర్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపు చేసేందుకు మూడు గంటల పాటు తీవ్రంగా శ్రమించారు. ప్రమాద ప్రాంతంలో దట్టమైన పొగలు అలుముకోవడంతో చుట్టుపక్కల ప్రజలు, స్థానిక వ్యాపారులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు లోనవుతున్నారు. ఈ నేపథ్యంలోనే పోలీసులు అత్యంత రద్దీ రహదారిగా పేరొందిన అమీర్‌పేట్‌ఎస్‌ఆర్‌నగర్‌లో ట్రాఫిక్‌ను మళ్లించారు. వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పరిస్థితిని సమీక్షించారు. కాగా మంటలు పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు డిసిపి, ఏసిపిల పర్యవేక్షణలో మధురానగర్ సీఐ హెచ్.ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది చర్యలు చేపట్టారు.

**ఎగ్జాస్ట్ ఫ్యాన్ కారణమా?**
ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన టాయ్‌షాప్ యజమాని మాట్లాడుతూ.. హర్ష మెస్ ఎగ్జాస్ట్ ఫ్యాన్ నుంచి మంటలు వచ్చాయని.. మంటలను అదుపు చేసేందుకు 20 నిమిషాలు యత్నించామని.. అయినా మంటలను అడ్డుకోలేకపోయామని తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 కోట్ల ఆస్తినష్టం సంభవించినట్లు పేర్కొన్నారు. గతంలో హర్ష మెస్‌పై ఫిర్యాదు చేశామని సదరు యజమాని తెలిపారు.

**ఘటనా స్థలానికి నేతలు**
అమీర్‌పేట్ ప్రధాన రహదారిలో వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోకి వచ్చే ప్రాంతంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ప్రదేశాన్ని ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు నవీన్‌యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పరిస్థితిని సమీక్షించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ... అగ్ని ప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మెట్రో రైలుకు నష్టం జరగలేదు**
అగ్నిప్రమాదం కారణంగా హైదరాబాద్ మెట్రో రైలు వ్యవస్థకు నష్టం జరగలేదని హెచ్‌ఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. మెట్రో రైల్ వ్యవస్థ పూర్తిగా పనిచేస్తోందని, ప్రభావితమైన ఆస్తులపై లోతైన అంచనా వేయడం జరిగిందన్నారు. మెట్రో రైలు సేవలకు ఏ విధంగానూ అంతరాయం కలగలేదని, రైళ్ల కార్యకలాపాలు యథావిధిగా కొనసాగాయని ఆయన పేర్కొన్నారు. దట్టమైన పొగ వల్ల కొంత అసౌకర్యం కలిగినా, మెట్రో రైలు కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం పడలేదన్నారు.

మెట్రో స్తంభాలపై అమర్చిన ప్రకటనల బోర్డుల వినైల్ షీట్లపై మాత్రమే అగ్నిప్రమాదం ప్రభావం ఉందని ఆయన వివరించారు. మెట్రో వ్యవస్థ నిర్మాణాలు, కట్టడాలకు నష్టం జరగలేదని ఆయన తెలిపారు.

## ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం

**ముంబయి:** ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు విరాట్ కోహ్లీ దూరం కానున్నాడు. అతను తొడకండరాల నొప్పితో బాధపడుతున్నట్లు తెలిసింది. ఇటీవల ముగిసిన ఐపిఎల్ టోర్నీలో.. ఆర్‌సిబి బ్యాటర్ విరాట్ కోహ్లీ అద్భుత ప్రదర్శన ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే జూన్ 13వ తేదీ నుంచి ఆఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు కోహ్లీని ఎంపిక చేయడం లేదని తెలిసింది. తొడకండరాల నొప్పి వల్ల అతను వన్డే సిరీస్ ఆడకపోవచ్చు అని బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు. 37 ఏళ్ల కోహ్లీ.. ఈ యేటి ఐపిఎల్‌లో 675 రన్స్ చేసి తన ఫిట్‌నెస్ చాటుకున్నాడు. ఈ సీజన్‌లో అతను ఓ సెంచరీ, అయిదు హాఫ్ సెంచరీలు కొట్టాడు. అయితే ఆఫ్ఘన్‌తో సిరీస్‌కు అతను అందుబాటులో లేకపోవడం భారత జట్టుకు లోటే అవుతుంది. ఫిట్‌నెస్‌లో అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్న అతను వన్డే సిరీస్ మిస్ కావడం చాలా అరుదైన అంశం. అయితే రోహిత్ శర్మ ఈ సిరీస్‌కు అందుబాటులో ఉంటాడో లేదో ఇంకా తెలియదు. ఐపిఎల్‌లో రోహిత్‌కు కూడా తొడకండరాలు పట్టేసిన విషయం తెలిసిందే. అయినా అతన్ని భారత జట్టుకు తీసుకున్నారు. టెస్టు క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న కోహ్లీ, రోహిత్‌లు.. వన్డేలపై దృష్టి పెట్టారు. అయితే వచ్చే ఏడాది నవంబర్‌లో దక్షిణాఫ్రికాలో జరగనున్న వన్డే వరల్డ్‌కప్‌లో ఆ ఇద్దరూ ఆడుతారేమో అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక ఆఫ్ఘనిస్తాన్‌తో లక్నోలో 17న రెండో వన్డే, చెన్నైలో 20న మూడో వన్డే జరగనున్నది.



## పారా అథ్లెట్లకు సన్మానం



ప్రజాపక్షం/బంజారాహిల్స్: అంతర్జాతీయ వేదికలపై దేశ కీర్తిని చాటిన పారా అథ్లెట్లను సత్కరించారు. ఇన్ఫినిటీ పారా స్పోర్ట్స్ అకాడమీ, రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఆదిత్య మెహతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన 14వ పురస్కారాల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా విచ్చేశారు. ఈ సందర్భంగా పారాఅథ్లెట్లను సత్కరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచేందుకు వీలుగా కృత్రిమ అవయవాలు, క్రీడా పరికరాలు, స్కాలర్షిప్‌లు, స్పాన్సర్ షిప్‌లు, ఇతర సహాయక సామగ్రిని గవర్నర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులకు నూతన అవకాశాలను సృష్టించడంలో ఆదిత్య మెహతా ఫౌండేషన్ చేస్తున్న కృషిని ప్రశంసించారు. ముఖ్యమంత్రితో సంప్రదించి ఈ క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆంధ్రప్రదేశ్ మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, ఆదిత్య మెహతా ఫౌండేషన్ ట్రస్టీ అంజనా సిన్హా, సినీనటి లక్ష్మీ మంచు, ఫ్యాషన్ డిజైనర్, ఆదిత్య మెహతా ఫౌండేషన్ ట్రస్టీ శిల్పారెడ్డి, పత్తికొండ (ఆంధ్రప్రదేశ్) ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్, ఆదిత్య మెహతా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆదిత్య మెహతా తదితరులు పాల్గొని ప్రసంగించారు.



## టిజి20 లీగ్ బరిలో తిలక్, సిరాజ్

### 7న ఆటగాళ్ల వేలం

టీమిండియా స్టార్ ప్లేయర్లు తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్ హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సిఎ) ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టిజి20 లీగ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు. ఈ మెగా లీగ్ తొలి ఎడిషన్ వేలంలో ఈ ఇద్దరు ఐకాన్ కేటగిరీలో బరిలో నిలిచారు. ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే ఆటగాళ్ల వేలానికి మొత్తం 1300 మంది క్రికెటర్లు రిజిస్టర్ చేసుకున్నారు. రోహిత్ రాయుడు, రాహుల్ బుద్ధి, సీవీ మిలింద్, తన్మయ్ అగర్వాల్ హైదరాబాద్ సీనియర్ ప్లేయర్లు ఎనిమిది ఫ్రాంచైజీల హాట్ కేక్స్‌గా మారే అవకాశం ఉంది. వేలం కోసం ప్రతీ ఫ్రాంచైజీకి రూ.60 లక్షల బడ్జెట్ కేటాయించారు. ఇందులో కనీసం రూ. 54 లక్షలు చేసి గరిష్టంగా ఒక్కో జట్టు 20 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయొచ్చు. వేలం ప్రక్రియ మొదట ఐకాన్ కేటగిరీతో ప్రారంభం అవుతుంది. తర్వాత ఏ ప్లస్, ఏ, బి, సి1, సి2 కేటగిరీల వారీగా కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో.. ప్రతి ఫ్రాంచైజీ కనీసం నలుగురు జిల్లా ఆటగాళ్లను జట్టులోకి తీసుకోవాలి. కాగా, ఈ నెల 21న టీజీ 20 లీగ్ ప్రారంభం అవుతుంది. మొత్తం 32 మ్యాచ్‌లు ఉప్పల్ స్టేడియంలోనే జరగనున్నాయి.

## ఇండోనేషియా ఓపెన్ నుంచి సింధు ఔట్

**జకార్తా:** ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు.. ఇండోనేషియన్ ఓపెన్‌లో ఇవాళ ఓటమి పాలైంది. వరల్డ్ నెంబర్ వన్ ప్లేయర్ ఆన్ సే యంగ్ చేతిలో ఆమె పరాజయాన్ని చూవిచూసింది. 17–21, 14–21 స్కోరుతో దక్షిణ కొరియా క్రీడాకారిణి విజయాన్ని నమోదు చేసింది. అయితే ఇటీవల వరుసగా రెండోసారి ఆన్ సే యంగ్ చేతిలో పీవీ సింధు ఓడింది. గత వారం సింగపూర్ ఓపెన్ క్వార్టర్స్‌లోనూ సింధు ఓటమి పాలైన విషయం తెలిసిందే. అయితే ఇప్పటి వరకు ఆన్ సే యంగ్, సింధు మధ్య 10 మ్యాచ్‌లు జరిగాయి. అన్నింటిలోనూ సింధు ఓడింది. ఇప్పటి వరకు ఆన్‌పై సింధు విక్టరీ నమోదు చేయకపోవడం గమనార్హం. ఇవాళ జరిగిన రౌండ్16 మ్యాచ్‌లో తొలి గేమ్ ఆసక్తికరంగా సాగింది. ఓ దశలో ఇద్దరూ 10–10 స్కోరుతో సమంగా నిలిచారు. కొరియన్ ప్లేయర్‌ను కాసేపు వత్తిడిలో పెట్టింది సింధు. ఆ తర్వాత 15–14 లీడ్ సాధించింది. కానీ ఆన్ దూకుడు ఆటతో సింధు వెనుకబడింది. తొలి గేమ్ చివరలో 41 షాట్ల ర్యాలీ ఆడారు. ఆ తర్వాత ఓపెనింగ్ గేమ్‌ను కొరియన్ క్రీడాకారిణి సొంతం చేసుకున్నది. రెండో గేమ్‌లోనూ ఆన్ ఈజీగా విజయాన్ని నమోదు చేసింది.

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## ప్రపంచంలో అత్యధికంగా పాడి పశువులు కలిగిన దేశం

- క్రింది వానిలో ఏది ప్రాథమిక హక్కు కాదు?
  ఆస్తి హక్కు
- మొదటి కర్ణాటక యుద్ధం?
  1746–1748
- ప్రాచీన ఆర్యులు ఎక్కడ స్థిరపడ్డారు.
  సింధులోయ
- ప్రపంచంలో 'పుట్టుగూళ్ళ' పెంపకంలో ప్రథమ స్థానంలో ఉన్న దేశం ఏది?
  భారత్
- మహారాష్ట్ర రాజ్య నిర్మాత ఎవరు?
  శివాజీ
- తేయాకు, రబ్బరు, కాఫీ ఏ రేవు ద్వారా ఎక్కువగా ఎగుమతి అవుతుంది?
- కొచ్చిన్ రేవు
- పట్టు పరిశ్రమకు పేర్గాంచిన నగరం
  బెంగళూర్
- 'రోష్ని' పథకం దేనికి సంబంధించినది?
  మైనారిటీలకు సంక్షేమ ఉపాధి పథకాలు అమలు
- పుష్పభాగాలని అంటిపెట్టుకుని ఉండే ఉబ్బిన నిర్మాణం
  పుష్పాసనం
- ఫ్రెంచ్ ప్రజల జాతీయ దినోత్సవం
  జులై 14
- టొమాటోలకు దేనివల్ల రంగు వస్తుంది?
  కెరోటినాయిడ్లు
- గ్లూకోజ్‌ను, గ్లైకోజిన్‌గా మార్చే హార్మోను
  ఇన్సులిన్
- వేరుశనగ శాస్త్రీయనామం
  అరాకిస్ హైపోజియా
- అయొడిన్ ఈ క్రింది వానిని కనుగొనడానికి ఉపయోగిస్తారు:
- పిండిపదార్థం
- ప్రపంచంలో అత్యధికంగా పాడి పశువులు కలిగిన దేశం
  భారతదేశం
- రాయపూర్ దేనికి రాజధాని?
  ఛత్తీస్‌గఢ్
- దేశంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకంగా పేరుపొందిన చొక్కారావు దేవాదుల) ఎత్తిపోతల పథకంను ప్రారంభించిందేవరు?
  సోనియాగాంధీ
- భారతదేశంలో 14 బ్యాంకులను జాతీయం చేసిన రోజు
- 1969, జులై 19
- ఇటీవల బంగాళాఖాతంలో సునామీ ఎప్పుడు ఏర్పడింది?
  2004, డిసెంబరు 26
- భారత్ దేశంలో ఎలాంటి న్యాయవ్యవస్థ అమల్లో ఉంది?
  ఏకీకృత స్వతంత్ర న్యాయవ్యవస్థ
- వధువును డబ్బు ఇచ్చి కొనుక్కునే వివాహ పద్ధతి ఏది?
  అసుర
- ప్రపంచ విపత్తుల్లో భూకంపాలు, సునామీల శాతం ఎంత?
  8%
- నాలుక అంచులో ఏ గ్రాహకాలు కలవు?
  పులుపు
- తక్కువ ఖర్చుతో తాగే నీటిని పరిశుభ్రపరిచే పద్ధతి:
  వడపోత
- ఇంటిలో వాడే సిలిండర్లో ఉండే మిశ్రమం
  పెట్రోలియం వాయువు, కిరోసిన్
- ఇది సైబీరియాలోని ప్రముఖ నగరం
  ఇర్‌కుటస్క్
- వీరిలో ఎవరు భవన నిర్మాత కాదు?
  ఔరంగజేబు
- విశ్వనాగరిక నగరం
  ఢిల్లీ
- ఎఫ్ఎఒ అనగా
  ఆహారము, వ్యవసాయ సంస్థ (Food and Argicultural Organisation)
- శౌర్య క్షిపణులు వేటికి రూపాంతరాలు?
  సాగరిక
- రెండు టన్నులకు పైగా బరువు ఉండే ఉపగ్రహాలను జియోసింక్రోనస్ కక్ష్యలోకి ప్రవేశపెట్టడానికి కింది ఏ వాహక నౌకలను భారత్ వినియోగిస్తోంది?
  జీఎస్ఎల్వీ
- భారత్ స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి దీర్ఘవ్యాప్తి సబ్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి ఏది?
  నిర్భయ్
- భారత ఆర్థిక రాజ్యాంగంగా వర్ణించిన పారిశ్రామిక విధాన తీర్మానం?
  1956 తీర్మానం
- హైదర్ అలీ ఏ మైసూరు యుద్ధ సమయంలో మరణించాడు?
  రెండో
- జీవులను మొదటిసారిగా శాస్త్రీయంగా వర్గీకరించడానికి ప్రయత్నించిన శాస్త్రవేత్త
  అరిస్టాటిల్
- భూమధ్యరేఖా మండలంలోని అత్యధిక వర్షపాత ప్రాంతం
- కామెరూన్ శిఖరం
- దామోదర్ నదీ పథకం ఈ రాష్ట్రంలో వుంది:
  బీహార్
- ఆర్మీ డేను పాటించే రోజు ?
  జనవరి 15
- ప్రణాళిక వనరుల అంచనాతో కూడిన జాతీయ ప్రణాళిక రూపకల్పనకు తగిన నిర్దేశక సూత్రాలను తయారుచేసే బాధ్యత ఉండేది?
  జాతీయ అభివృద్ధి మండలి
- జమ్మూకశ్మీర్కు చెందిన కాంగ్రెస్ నేత గిరిధర్లాల్ డోగ్రా జమ్మూకశ్మీర్ ఆర్థికమంత్రిగా ఎన్నిసార్లు రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు?
  24 సార్లు
- కర్ణాటక రాజ్య రాజధాని ఏది?
  ఆర్కాట్
- 'ప్లానింగ్ ఫర్ ది పూర్' గ్రంథ రచయిత?
  బి.ఎస్. మిన్స్
- పునరుద్ధరింపదగని వనరు
  పెట్రోలియం



## మహిళా సాధికారతకు పాలక ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి

### సిపిఐ సీనియర్ నాయకుడు కె.స్వామి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సాధికారత కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును ఎలాంటి నిబంధనలు లేకుండా తక్షణమే ప్రవేశపెట్టి అమలు చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు, ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి డిమాండ్ చేశారు. గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన జాతీయ మహిళా సమాఖ్య 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్లమెంటేరియన్ గీతా ముఖర్జీ పోరాటాల ఫలితంగా వచ్చిన 33% మహిళా రిజర్వేషన్ బిల్లును నేటికీ ఆమోదించకుండా, బూటకపు వాగ్దానాలతో కేంద్ర ప్రభుత్వం మహిళలను మభ్యపెడుతోందని ఆయన విమర్శించారు. కుంటి సాకులు చెప్పకుండా వెంటనే బిల్లును ఆమోదించాలని కోరారు. దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో పాలక ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. ఈ సందర్భంగా జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు మడికొండ ఓదెమ్మ మహిళా సమాఖ్య పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం లో సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, మహిళా సమాఖ్య నాయకులు ఆసాల రమ తదితరులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులతోనే సామాజిక న్యాయం సాధ్యం

### సిపిఐ రాజకీయ శిక్షణ శిబిరంలో మాజీ ఎంఎల్ఎ సిహెచ్ రాజారెడ్డి

**ప్రజాపక్షం / నల్లబెల్లి :** భారత దేశంలో 72 ఏండ్లుగా ఆర్థిక , రాజకీయ , సామాజిక న్యాయం సాధించడంలో కాంగ్రెస్, బిజెపి పార్టీలు ఘోరంగా విఫలం చెందాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనగామ మాజీ ఎంఎల్ఎ సిహెచ్ రాజారెడ్డి విమర్శించారు. గురువారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రంలో సుమంగళి ఫంక్షన్ హాల్‌లో రెండో రోజు జరుగుతున్న సిపిఐ వరంగల్ జిల్లా రాజకీయ శిక్షణ శిభిరానికి ముఖ్య అథితిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సిహెచ్ రాజారెడ్డి పార్టీ నిర్మాణం ప్రజా సంఘాల బలోపేతం అనే అంశంపై కార్యకర్తలకు బోధించి మాట్లాడారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జనగామ మాజీ ఎంఎల్ఎ సిహెచ్ రాజారెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని కేంద్రంలో 12 ఏండ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టి వేసిందని మండిపడ్డారు . దేశ ప్రదాని నరేంద్రమోదీ నిత్యవసరాలు తగ్గించుకోవాలని బంగారం కొనవద్దని, విదేశీ యాత్రలు ఆపాలని చెబుతూ సంక్షోబానికి ప్రజలే కారకులని అన్నట్లు మాట్లాడటం బిజెపి దివాళు కోరుతనానికి నిదర్శమన్నారు. ప్రజల సోమ్ముతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అమ్ముతున్నారని, కార్పొరేట్లు ఎగ్గోటిన రూ.16 లక్షల కోట్ల రుణాలను ప్రజల పన్నుల ఖజాన నుండి భ్యాంకులకు సర్ధుబాట్లు కార్పొరేట్లకు మోదీ ప్రభుత్వం ఊడిగం చేస్తుందన్నారు. ప్రజలకు నిజం తెలియకుండా మతం, దేవుడి పేరుతో మోసం చేస్తు ద్వేషలు రెచ్చగోడుతున్నారని అరోపించారు. నిరుద్యోగ సమస్యలపై నిర్లక్ష్యం చేస్తు 2014 ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉపాధి కల్పించడం లేదన్నారు. ప్రైవేటు కంపెనీల నుండి వేలాది మందిని యువ ఉద్యోగులను తొలగిస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్యలు పరిష్కరం కావాలంటే యువత కమ్యూనిజం వైపు పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె బాషుమియా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, దండు రమేష్, గుండె బద్రీ, పనాస ప్రసాద్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు దామెర కృష్ణ, చెన్నకేశవులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి సిలువేరు విజయ, అక్కపెల్లి రమేష్, సాంబయ్య తదితరులు పాల్గోన్నారు.



## మహిళల హక్కుల కోసం ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు నిరంతర పోరాటాలు

### ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళిని రెడ్డి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** మహిళల హక్కుల కోసం ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు నిరంతరం పోరాడుతొందపి ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళిని రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో భారత మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు) 72వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర సహాయ కార్యదర్శి ముడుపు నళిని రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల హక్కుల సాధన, రక్షణ కోసం ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు నిరంతరం పోరాడుతోందన్నారు. మహిళా సమాఖ్య చేసిన ఉద్యమాల వల్లే స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు సాధ్యమయ్యాయని గుర్తు చేశారు. పార్లమెంట్, అసెంబ్లీలలో కూడా 33 శాతం మహిళా రిజర్వేషను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అనేక పోరాటాలు చేస్తున్నామని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహిళలను రాజకీయ రంగంలో ముందుకు రాకుండా అడ్డుకుంటోందని మండిపడ్డారు. దేశంలో మహిళలు తిరగబడితే నరేంద్ర మోడీ ప్రభుత్వానికి భవిష్యత్తు ఉండదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి అమీనాఖాన్, నాయకులు లలిత, పుష్ప, లక్ష్మీ , కాంతాబాయి, శాంతాబాయి పాల్గొన్నారు.

### బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు : దేవరం మల్లేశ్వరి

బిజెపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని భారత జాతీయ మహిళా సమైక్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు) జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలో ధర్మభిక్షం భవనంలో నిర్వహించిన 72వ భారత జాతీయ మహిళ సమైక్య ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఉప్పునూతల కోటమ్మ, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్ష్మి , దంతాల పద్మరేఖ, నియోజక వర్గ అధ్యక్ష కార్యదర్శులు దేశగాని హేమలత, పొదిల వెంకటమ్మ, కోనేటి జయమ్మ, పి. అలివేలు, పి. మౌనిక, పసుపులేటి జ్యోతి, హైదరాబాద్ సుగుణమ్మ పాల్గొన్నారు.

### మహిళల పక్షాన చారిత్రక పోరాటాలు: ఏపూరి లతాదేవి

మహిళల పక్షాన భారతదేశంలో చారిత్రిక పోరాటాలను నిర్వర్తించిన ఘనత భారత మహిళా సమా ఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు)కు దక్కుతుందని భారత మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి తెలిపారు. దశాబ్దాల పోరాట చరిత్రలో అనేక పోరాట విజయాలను మహిళా సమాఖ్య సాధించిందని ఆమె తెలిపారు. మహిళా సమాఖ్య 72వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో మహిళా సమాఖ్య పతాకాన్ని ఏపూరి లతాదేవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య రాష్ట్ర నాయకురాలు పోటు కళావతి, జిల్లా బాధ్యులు జమ్ముల లక్ష్మి , మందడపు రాణి, దండి రాజేశ్వరి, ఓరుగంటి ప్రమీల, భవాని, సృజన, కృష్ణవేణి, సౌజన్య, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

### హనుమకొండలోని బాలసముద్రంలో

భారతీయ జాతీయ మహిళా సమాఖ్య వ్యవస్థాపక దినోత్సవం గురువారం హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమకొండలోని బాలసముద్రంలో గల జిల్లా కార్యాలయంలో ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షురాలు రాసమల్ల దీనా ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్వరూప, లక్ష్మి , ప్రతిభ, ఝాన్సీ రాణి, మంగ, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సూర్యపేటలో....



ఖమ్మంలో....



హనుమకొండలో..

## 6న మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ సమస్యల పరిష్కారానికి చలో హైదరాబాద్

### ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు



**ప్రజాపక్షం/కోరుట్ల :** తెలంగాణ రాష్ట్రంలోని మధ్యాహ్న భోజన పథకం లో పనిచేసే వర్కర్ల సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వ హామీలు అమలు చేయాలని హైదరాబాద్‌లో జరిగే మహాసభలు జయప్రదం చేయుటకు తరలిరావాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములు పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా కోరుట్ల రెవె న్యూ డివిజన్ కేంద్రంలోని సి.ప్రభాకర్ భవన్‌లో గురువారం మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడు తూ ప్రభుత్వ పాఠశాలలు సెలవులు అనంతరం ఈ నెల 12న ప్రభుత్వ పా ఠశాలలు ప్రారంభం జరుగుతున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి విద్యార్థులకు అల్పాహారం అందించాలని అక్షయపాత్ర ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం వ్యతిరేకిస్తూ ఈ కార్మికుల చేతనే అల్పహార టిఫిన్ అందించాలని కోరారు. అలాగే ఎన్నికల ముందు ఈ వర్కర్స్‌కు హామీ ఇచ్చి న ప్రకారం ప్రతి నెల గౌరవ వేతనం రూ.10,000లు అమలు చేయాలని అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు నిత్యవసర వస్తువులు కోడి గుడ్లు,వంట గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను ప్రతినెల 5వ తేదీలోపు ఇవ్వాలని కోరారు. ఈ మూడవ రాష్ట్ర మహాసభల లో చర్చలు తీర్మానాలు భవిష్యత్ కార్యక్రమాలు నూతన కమిటీ ఎన్నుకోబడుతుందన్నారు. ఈ మహాసభలకు అన్ని జిల్లాల నుండి ప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా నాయకులు వెన్న మహేష్,మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు, సంఘం పద్మ,కార్యదర్శి గుగ్గిల శారద,సరస్వ తి, అగ్గిమల్ల రాధ, ములుగురి హనుమంతు, రియల్ కార్ అంకుష్,చొప్పరి గంగాధర్, కొంక భాగ్యలక్ష్మి , చిన్నవేణి దశరథం, సనిగారం భూమయ్య, లక్ష్మి ,రాజక్క గంగవ్వ,తదితరులు పాల్గొన్నారు.



## రైతుల ధాన్యం కొనుగోళ్లలో జాప్యం తగదు

### అధికారులను ఆదేశించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వీరేశం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులతో కలిసి ప్రభుత్వ విప్,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు అమ్మిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి, ఎలాంటి జాప్యం లేకుండా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. కావాల్సిన లారీలు, హమాలీల అందుబాటు, ధాన్యం నిల్వ, తరలింపు ప్రక్రియ, కొనుగోలు కేంద్రాల్లో ఏర్పడుతున్న సమస్యలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామంలో గురువారం మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక భారీ పోలీస్ బందోబస్తు నడుమ ప్రశాంతంగా జరిగాయి. అనంతరం ఎన్నికల అధికారి జె. కమల మీడియాకు ఎన్నికల వివరాలను వెల్లడించారు. మొత్తం 93 ఓట్లకు గాను 86 ఓట్లు పోలవగా, 7 చెల్లని ఓట్లు వచ్చినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో బంటు సైదులు, నక్క నాగేందర్, దొంతగాని నాగయ్య, బంటు నాగయ్య, నక్క లింగయ్య, వనం సైదులు, బంటు మట్టయ్య, దొంతగాని పద్మ, పల్లా సుగుణమ్మలు సభ్యులుగా ఎన్నికైనట్లు వివరించారు. శుక్రవారం అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి పదవులకు ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ ఎన్నికలను డిఎస్‌పి ప్రసన్నకుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి రాంబాయి, ఏపిఓ చంద్రకళ, ఆత్మకూర్(ఎస్), సూర్యాపేట రూరల్ ఎస్‌ఐలు ఐలయ్య, బాలునాయక్, పెన్‌పహాడ్, చివ్వేంల ఏఎస్‌ఐలు రాములు, సుధాకర్ రెడ్డి, నిరంజన్, గురుస్వామయ్య, సంతోష్ పాల్గొన్నారు.

## హోరాహోరిగా కోదాడ పెద్ద చెరువు మత్స్య సహకార సంఘం ఎన్నిక



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పెద్ద చెరువు మత్స్య సోసైటీ ఎన్నికలు పోలీస్ బందోబస్తు మధ్య హోరాహోరీగా జరిగాయి. కోదాడ పెద్ద చెరువు సోసైటీలో 550 మంది సభ్యులు ఉన్నారు. కాగా 9 మంది డైరెక్టర్ పదవులు ఉన్నాయి. కాగా ఒక పదవి ఏకగ్రీవం కాగా గురువారం 8 మంది డైరెక్టర్ పదవులకు ఎన్నికల అధికారులు పోలింగ్ నిర్వహించారు. మధ్యాహ్నం అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టారు. సోసైటీకి మహేష్ ఫ్యానల్, నాగేంద్రబాబు ఫ్యానల్ పోటీ పడగా నాగేంద్రబాబు తో పాటు 7 డైరెక్టర్ పదవులు కైవసం చేసుకున్నారు. ప్రత్యర్థిగా ఉన్న మహేష్ ఫ్యానల్‌లో మహేష్ తప్ప ఎవరు విజయం సాధించలేదు. దీంతో నాగేంద్రబాబు చైర్మన్‌గా, ఎన్నిక అవుతారని ఆ ఫ్యానల్ వర్గాలు భావిస్తున్నాయి. ఓట్ల లెక్కింపులో తీవ్రమైన జాప్యం జరగడంతో పొద్దుపోయే వరకు కూడా తుది ఫలితం వెల్లడి కాలేదు. ఓట్ల లెక్కింపు పూర్తయిన అనంతరం ఎన్నికల అధికారి తుధి పలితాలు వెల్లడించారు.

## మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బారావు కన్నుమూత

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ ప్రాంత ప్రజాస్వామిక ఉద్యమాల్లో చైతన్యవంతమైన పాత్ర పోషించిన హక్కుల నేత, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు పొన్నూరు సుబ్బారావు (92) స్థానిక జ్యోతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం అమరులయ్యారు. త్రిపురాంతకం, కిష్టయమ్మ దంపతులకు జూలై 1, 1934న అమరావతిలో జన్మించిన సుబ్బారావు.. విద్యాభ్యాసం అనంతరం ఆగస్టు 14, 1956న మిర్యాలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1971లో ఇంగ్లీషు లెక్చరర్‌గా పదోన్నతి పొంది, 1982లో లెక్చరర్‌గా స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు. అనంతరం చైతన్య పాఠశాల ద్వారా అనేకమంది విద్యార్థులకు ఆంగ్ల ఉపాధ్యాయునిగా సుపరిచితులయ్యారు.

**కన్నీటి నివాళులర్పించిన ప్రముఖులు :** ఆయన మరణవార్త తెలుసుకుని వివిధ రంగాల ప్రముఖులు భారీగా తరలివచ్చి పార్థివ దేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నివాళులర్పించిన వారిలో ప్రముఖ కవి వరవరరావు, ప్రజాకవి గోరేటి వెంకన్న, మానవ హక్కుల నేత జీవన్ కుమార్, శాసనసభ్యులు లక్ష్మి రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు జూలకంటి రంగారెడ్డి, వేముల వీరేశం (విప్), మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు ఉన్నారు. అలాగే మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ రాజు, డాక్టర్ ముప్పా రామారావు, మానవ హక్కుల వేదిక గురవయ్య, మోహన్, విద్యావంతుల వేదిక అంబటి నాగయ్య, మట్టి మనిషి వేనేపల్లి పాండురంగారావు, గ్రంథాలయ ఉద్యమ నేత ప్రభాకర్, ప్రజా సంఘాల జేఏసీ రామయ్య, టీపీఎఫ్ సుధాకర్ రెడ్డి శ్రోతలై నిలిచి అంజలి ఘటించారు. సుబ్బారావు కుమారులు రమేష్, అజయ్, కుమార్తెలు కిరణ్మయి, నీరజలతో పాటు నజీర్, ఉదయ అంతిమ నివాళులు అర్పించారు.

**నేడు దేహదానం :** శుక్రవారం ఉదయం 8 గంటలకు నార్కట్‌పల్లిలోని కామినేని వైద్యశాలకు సుబ్బారావు భౌతిక దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం అప్పగించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటివరకు మిర్యాలగూడ శాంతినగర్‌లోని ఆయన స్వగృహంలోనే పార్థివ దేహాన్ని సందర్శకుల సందర్శనార్థం ఉంచినట్లు వెల్లడించారు.



## మిర్యాలగూడ నియోజకవర్గ పల్లెలకు బస్సుల్లేవు..

### ఆర్‌టిసి ఎండికి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వినతి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పైలట్ ప్రాజెక్టులకు ఎంపికైన గ్రామాలతో పాటు నియోజకవర్గంలోని అనేక పల్లెలకు సరైన రవాణా సౌకర్యాలు లేక ప్రజలు అల్లాడిపోతున్నారని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చిన తెలంగాణ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి ఐపీఎస్‌ను ఎమ్మెల్యే కలిసి మర్యాదపూర్వక పూర్వక నివేదిక సమర్పించారు. బస్టాండ్ ఆవరణలోని లోటుపాట్లను ఎండీకి వివరించిన అనంతరం.. పట్టణాన్ని డిజిటల్ బస్టాండ్‌గా మార్చాలని కోరారు. విద్యార్థులు, రైతులు, ఉద్యోగుల సౌకర్యార్థం ఐదు మండలాల పరిధిలోని పలు రూట్లలో ఉదయం, సాయంత్రం వేళల్లో కొత్త బస్సు సర్వీసులు నడపాలని కోరారు.

**ప్రతిపాదించిన బస్సు సర్వీసుల వివరాలు :** మాడుగులపల్లి మండలంలో మిర్యాలగూడ కుక్కడం తోపుచర్ల ఇసుకబావిగూడెం పుచ్చకాయలగూడెం బొమ్మకల్ భీమనపల్లి కల్వల పాలెం పాములపాడు సూర్యాపేట రూట్, వేములపల్లి మండలంలో వేములపల్లి అన్నపరెడ్డిగూడెం గోగుగూడెం రూట్లతో పాటు మంగాపురం వరకు బస్సు పొడిగింపును కోరారు. అడవిదేవులపల్లి మండలంలో ముదిమాణిక్యం గ్రామానికి, మిర్యాలగూడ మండలంలో కామేపల్లి, రామోజీ తండా, జాల్బాయి తండా, అన్నారం రూట్లలోని పలు పల్లెలకు ఉదయం, సాయంత్రం సర్వీసులు నడపాలని కోరారు. దామచర్ల మండలంలో దామచర్ల కేంద్రంగా రాగడప, గణేష్‌పాడు, మంగళదుబ్బ తండా వైపు వెళ్లే మూడు విభిన్న రూట్లలో వేలాది మంది ప్రయాణికుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే తెచ్చిన ప్రతిపాదనలపై ఎండీ నాగిరెడ్డి సానుకూలంగా స్పందిస్తూ డిపో అధికారులతో సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ మిర్యాలగూడ డిపో మేనేజర్, ఆర్టీసీ సిబ్బంది, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## సమాజంలో మహిళలు ప్రముఖ పాత్ర పోషించాలి

### జెండర్ రిసోర్స్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/చండూరు:** పెట్టుబడిదారి వ్యవస్థలో ఆర్థిక బంధాలు అధిగమించి సమాజంలో మహిళలు ప్రముఖ పాత్ర పోషించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గురువారం చండూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం వద్ద గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రాన్ని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిఆర్‌డిఓ అధికారి శేఖర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సదర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి మహిళ చదువు నేర్చుకోవలసిన అవసరం ఉందని అన్నారు. పురుషులతో పాటు మహిళలు సమానంగా ఉంటూ సమాజంలో ప్రముఖపాత్ర సోషించే విధంగా ఎదగాలని అన్నారు. నేటి పాలక ప్రభుత్వాలు మహిళలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పిస్తున్నందున వాటిని అందిపుచ్చుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా కుటుంబ వివాదాలు ,గృహ హింస వంటి విబేధాలను ప్రారంభ దశలోనే పరిష్కరించకోవడానికి ఉచిత కుటుంబ సలహా కేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. ఉచిత కుటుంబ సలహా కేంద్రాలు ప్రతి మంగళవారం , శుక్రవారం ఉదయం 10గంటల కుండి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జిల్లా పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శేఖర్ రెడ్డి , చండూరు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కోడి శ్రీనివాసులు , చండూరు ఏఎంసి చైర్మన్ నారాయణ ,డిపిఓలు రామలింగయ్య , సోమయ్య , మండల సమాఖ్య అధ్యక్షురాలు అహల్య, ఏపిఎం యాదయ్య , కౌన్సిలర్ కటకం రమేష్ , కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం , సిపిఐ నాయకులు నల్పరాజు రామలింగయ్య , నల్పరాజు సతీష్ కుమార్ , భూతరాజు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్గోలో పటిక కలకలం

### రాజమహేంద్రవరం నుంచి కోదాడకు చేరిన నాలుగు బస్తాల అనుమానాస్పద సరుకు

### అక్రమ సారా తయారీ కోణంలో దర్యాప్తు ప్రారంభం



**ప్రజాపక్షం/కోదాడ:** సూర్యాపేట జిల్లా కోదాడలో ఆర్టీసీ కార్గో కేంద్రంలో పటిక సరుకు కలకలం రేపింది. రాజమహేంద్రవరం నుంచి కోదాడకు నాలుగు బస్తాల్లో పంపిన అనుమానస్పద సరుకు గురువారం కార్గో కేంద్రానికి చేరుకుంది. బస్తాలపై నమోదైన వివరాలు సరుకు స్వభావంపై అనుమానాలు వ్యక్తం కావడంతో కార్గో సిబ్బంది వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు కార్గో కేంద్రానికి చేరుకుని తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 200 కిలోల మేర ఉన్న నాలుగు బస్తాల పటికను స్వాదీనం చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం భద్రత శాఖ కార్యాలయానికి తరలించారు. ప్రాథమిక విచారణలో ఈ సరుకు రాజమహేంద్రవారిని చెందిన సింహాద్రి అనే వ్యక్తి పంపినట్లు కోదాడలో రవి అనే వ్యక్తి స్వీకరించాల్సి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పటికను సాధారణంగా పలు పారిశ్రామిక, వాణిజ్య అవసరాలకు వినియోగించినప్పటికీ అక్రమ సారా తయారీలో కూడా ఉపయోగించే అవకాశాలు ఉన్నందున అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో సరుకు రవాణా వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం ఏమీటనే అంశంపై లోతైన దర్యాప్తు చేపట్టారు. బుకింగ్ సమయంలో సమర్పించిన ఫోన్ నెంబర్లు, చిరునామాలు గుర్తింపు వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అలాగే సరుకు పంపిన వ్యక్తి సిం హద్రి స్వీకరించాల్సిన రవి మధ్య ఉన్న సంబంధాలు సరుకు వినియోగం రవాణ మా ర్గం తదితర అంశాలపై సమాచారం సేకరిస్తున్నారు. ఈ వ్యవహారంలో అక్రమ సారా తయా రీ ముఠాల ప్రమేయం ఉందా లేదా అన్న కో ణంలో కూడా విచారణ సాగుతుంది. పూర్తిస్థా యి దర్యాప్తు అనంతరం మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## దేశంపై సుంకాలు విధిస్తున్నా మోదీ నోరు మెదపకపోవడం దుర్మార్గం




**ప్రజాపక్షం/సూర్యాపేట :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దేశంపై సుంకాలు విధిస్తున్నా మోదీ నోరు మెదపకపోవడం దుర్మార్గమని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. నాగయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సిపిఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన హాజరై మాట్లాడారు. ప్రపంచంలో తన సామ్రాజ్యవాదాన్ని కాపాడుకోవడం కోసం ట్రంప్ చేస్తున్న విధానాలకు దేశ ప్రధాని లొంగిపోయి భారతదేశ అలీన విధానాన్ని విదేశాలకు తాకట్టుపెట్టాడని విమర్శించారు. అమెరికా బరితెగించి ఇరాన్, ఇజ్రాయిల్‌పై దాడులు చేస్తే కనీస ప్రకటన కూడా చేయకపోవడం సరికాదన్నారు. ఇరాన్ ఇజ్రాయిల్‌పై దాడి సందర్భంగా అమెరికా వేస్తున్న భారాలను మోడీ ప్రజలపై ధరల భారం మోపుతున్నాడని అన్నారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం పెరిగిందని వాటిని అరికట్టడంలో కేంద్రం విఫలమైందన్నారు. ఉపాధి హామీ గ్రామీణ చట్టాన్ని నీరుగార్చి వివిజి రాంజి బిల్లుగా మార్చడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. భూమిలేని పేదలకు రూ.12వేలు ఇస్తామని నేటికి ఏ ఒక్కరికి కూడా అందజేయలేదన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు తప్ప నిరుపేదలకు దక్కడం లేదన్నారు. ప్రచార ఆర్భాటం తప్ప సంక్షేమ పథకాల అమలులో చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి , జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరి రావు, కోట గోపి పాల్గొన్నారు.

## రైతులకు నాణ్యమైన విత్తనాలు

**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం మండల వ్యవసాయ అధికారి, పోలీసు అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణాలలోని స్టాక్‌ను పరిశీలించి, స్టాక్ బుక్‌లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా దుకాణా యాజమానులతో మండల వ్యవసాయ అధికారి నీరజ్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, రైతులకు విత్తనాలను విక్రయించిన వెంటనే రశీదును వారికి అందజేయాలని సూచించారు. రైతులు కూడా దుకాణాలలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన వెంటనే రశీదును అడిగి తీసుకోవాలని అన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ఎఎంఆర్‌పి హైలెవెల్ కెనాల్ లైనింగ్ పనులు

### రైతులకు ఇబ్బంది కలగొద్దు : కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ(కనగల్) :** ఏఎంఆర్‌పీ హైలెవెల్ కెనాల్ లైనింగ్ పనుల అమలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.గురువారం కనగల్ మండలం రేగట్ట వద్ద ఏఎంఆర్‌పీ కెనాల్ లైనింగ్ పనులను కలెక్టర్ పరిశీలించి పురోగతిని అడిగి తెలుసుకున్నారు.అక్కంపల్లి నుంచి మూసీ వరకు 67 కిలోమీటర్ల మేర కెనాల్ లైనింగ్ పనులు చేపట్టామని, నాలుగేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు వివరించారు.పనుల కారణంగా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులతో ముందస్తు అవగాహన సమావేశాలు నిర్వహించి పూర్తి సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల వారీగా సర్పంచులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమస్యలు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట ఈఈ నెహ్రూ నాయక్, ప్రాజెక్టు మేనేజర్ అభిషేక్, డీఈఈ జితేందర్,డీఈ సంపత్, ఏఈలు, సంబంధిత అధికారులు ఉన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో రోగుల పట్ల వైద్యుల నిర్లక్ష్యం

### అదనపు జిల్లా కలెక్టర్ భాస్కరరావు ఆగ్రహం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి మున్సిపాలిటీ ప్రభుత్వ వైద్యశాలలో రోగుల పట్ల వైద్యులు చూపిస్తున్న నిర్లక్ష్య ప్రవర్తనపై యాదాద్రి భువనగిరి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా గురువారం మూడవ వార్డు కౌన్సిలర్ రావుల జంగయ్య అధ్యక్షతన జరిగిన వార్డు సభలో ఆయన పాల్గొన్నారు. వైద్య సిబ్బందిని పిలిపించి రోగులకు మంచి ప్రవర్తనతో వైద్యం అందించే బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని మందలించారు. ప్రజా సమస్యల పట్ల చర్చించారు. రేవనపల్లిలో కరెంట్ సమస్యల గురించి చర్చించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ శాఖ సీనియర్ ఇంజనీర్ ను ఆదేశించారు. వార్డు సభలో సభ్యులు తమ సమస్యల గురించి వివరించి, పరిష్కారం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి.అంజన్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రాజేష్, మున్సిపాలిటీ సిబ్బంది గ్రామ పారిశుద్ధ్య కార్మికులు వార్డు ఆఫీసర్లు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## 'ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక' ముగింపు సభ

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ముగింపు కార్యక్రమం స్థానిక 12, 13 వార్డులో మున్సిపల్ కమిషనర్ కే చంద్ర ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో వార్డు సభ్యులు తోటకూర విజయలక్ష్మి వెంకటేష్, గుర్రాల సంతోష శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్ పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇట్టి ముగింపు సభలలో పట్టణ ప్రజలకు సాలిడ్ వేస్ట్ మేనేజిమెంట్ రూల్స్, 2026, జల్ సంచయ్ జల్ భగీరత పథకం క్రింద ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టుట, మురికి కాలువల శుభ్రం చేయుట, పూడిక తీయు పనులు, వర్షాకాల సంసిద్ధతపై కార్యాచరణ ప్రణాళిక, మంచి నీటి సరఫరా, నిర్వహణ, నీరు నిలువ ప్రాంతాల నివారణ, పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ, వీది దీపాలు, మొక్కలు , పర్యావరణ సంరక్షణ కార్యక్రమాలు, ఫిర్యాదుల పరిష్కారం వంటి పలు అంశాలపై అవగాహన కల్పించుటకు గాను వార్డు సభలలో చర్చించ వలసిన అవసరం ఉన్నదని తెలిపారు. ప్రతి రోజు 10 వార్డుల చొప్పున , చివరి రోజున 5 వార్డులలో వార్డు సభలు నిర్వహించవబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ అధికారులు, వార్డు అధికారులు పాల్గొన్నారు.



## యాదాద్రి జిల్లా విద్యాశాఖను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలి

### జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా విద్యాశాఖను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉంచడం కోసం మండల విద్యాధికారులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేసి, విద్యార్థులను అధిక సంఖ్యలో చేర్పించాలని ఆయన కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో మండల విద్యాధికారులతో సమావేశం నిర్వహించి వివిధ అంశాలను మండల విద్యాధికారులకు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న అన్ని చర్యలను విద్యార్థుల తల్లిదండ్రులు, సామాజంలోని యువత మరియు అన్ని వర్గాలకు తెలియజేయాలని కోరారు. బడిబాటలో ప్రతి రోజు రాష్ట్ర విద్యా శాఖ ఇచ్చిన షెడ్యూలు ప్రకారం వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. బడి తెరిచే నాటికి పాఠశాల పారిశుధ్య కార్మికుల సేవలు వినియోగించుకొని, జూన్ 12 నాడు పండుగ వాతావరణంలో పాఠశాలలు ప్రారంభం అయ్యేలా చూడాలని కోరారు.

ఈ విద్యా సంవత్సరం ప్రత్యేకంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు మరియు చైర్మన్లు అయిన మహిళా సంఘాల ప్రతినిధుల భాగస్వామ్యంతో ఒక ఉద్యమ స్ఫూర్తితో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అందరు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు మరియు చైర్మన్ల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించేలా చూడాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న బడి ఈడు పిల్లలను 100 శాతం ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలన్నారు. జిల్లాలో నూతనంగా 62 ప్రీ ప్రైమరీ పాఠశాలలను ప్రారంభిస్తున్నామని, వాటిలో కనీసం 20 మంది విద్యార్థులకు తగ్గకుండా చేర్పించాలని కోరారు. ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడం తెలియ చేయాలన్నారు. అంగన్వాడీ టీచర్లు, ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, కెజిబివిలు,ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు అందరూ సమన్వయంతో కలిసికట్టుగా పనిచేసి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలలో చేర్పించాలన్నారు. ఈ సమావేశంలో సెక్టోరియల్ అధికారులు పెసరు లింగారెడ్డి, శ్రీహరి అయ్యంగార్, జానీ అఫ్జన్, మండల విద్యాధికారులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం
Telugu National Daily

ఖమ్మం
శుక్రవారం
05-06-2026
www.prajapaksham.in

హీరో సత్యదేవ్ నటిస్తున్న కొత్త చిత్రానికి 'సమవర్తి' అనే టైటిల్ ను ఖరారు చేశారు. ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. 'సమవర్తి' సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ , పంచభూత ప్రొడక్షన్స్ నిర్మిస్తున్నారు.

రీల్

# మొదటి రోజు చాలా భయపడ్డాను

## 'సింగ్ గీతం' హీరోయిన్ అహల్యా బమ్రూ



లెజెండరీ డైరెక్టర్ సింగీతం శ్రీనివాస రావు తాజా ప్రాజెక్ట్ 'సింగ్ గీతం'. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా పై నాగ్ అశ్విన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆయాన్, అహల్యా బమ్రూ, శాలిని కొండెపుడి ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషించారు. దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. 'సింగ్ గీతం' జూన్ 11న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అహల్యా బమ్రూ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.మాది పుదుచ్చేరి. ఇంగ్లీష్, ఫ్రెంచ్, బెంగాలీ వంటి భాషలు మాట్లాడే ఒక ఇంటర్నేషనల్ కమ్యూనిటీలో పెరిగాను. నేను ఎప్పుడూ యాక్టర్ అవ్వాలని అనుకోలేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో కంటెంట్ క్రియేట్ చేస్తుంటాను. నాగ్ అశ్విన్ నా కంటెంట్ చూసి ఈ సినిమా గురించి చెప్పారు. నా ఆడిషన్ కూడా ఇన్‌స్టాగ్రామ్ ద్వారానే ఇచ్చాను.ఇది సంగీతం నేపథ్యంలో ఉండే సినిమా. నాకు పాటలు పాడటం, గిటార్ వాయించడం అంటే చాలా ఇష్టం. కాబట్టి ఇది నాకు తెలుగులో మంచి ఆరంభం అవుతుందని అనుకున్నాను. సింగీతం తీసిన చిత్రాలన్నీ కూడా కాలానికి ముందున్నవే. సింగ్ గీతం కూడా అలాంటి సినిమానే. ఇండియన్ సినిమాలో ఇప్పటివరకు ఎవరూ ప్రయత్నించని కాన్సెప్ట్ ఇది. 94 ఏళ్ల వయసులో కూడా ఇంత మోడ్రన్ ఆలోచనతో సినిమా చేయడం ఆయనకే సాధ్యం.మొదటి రోజు చాలా భయపడ్డాను. ఎందుకంటే నాకు తెలుగు రాదు. సినిమా ప్రారంభానికి ముందే నేను ఆన్లైన్లో తెలుగు నేర్చుకోవడం మొదలుపెట్టాను. ఆ శిక్షణ నాకు చాలా ఉపయోగపడింది. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి చాలా ప్రత్యేకమైన సంగీతాన్ని అందించారు. పాటలు చాలా యూనిక్గా ఉంటాయి.. జూన్ 11న థియేటర్లలో ఈ చిత్రాన్ని చూసి ఎంజాయ్ చేయాలి.బాలీవుడ్‌లో దర్శకుడు షూజిత్ సిర్కార్ దర్శకత్వంలో అభిషేక్ బచ్చన్ తో ఒక సినిమా చేశాను. సింగ్ గీతం నాకు రెండో సినిమా. అలాగే తెలుగులో ఇది నా తొలి చిత్రం.నాకు యాక్షన్ సినిమాలు చేయడం చాలా ఇష్టం. భవిష్యత్తులో అలాంటి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను.ప్రస్తుతం తమిళంలో ఒక సినిమా చేస్తున్నాను.



## దేశభక్తి నేపథ్యంలో 'అభినవ్'

శ్రీ లక్ష్మి ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో సంతోష్ ఫిలిమ్స్ బ్యానర్ పై అభినవ్ లఘు చిత్రాన్ని నిర్మించారు. భారతీయ సంస్కృతి, దేశభక్తి విలువలను ప్రతిబింబించే వందేమాతరం ఫ్రేమ్స్ జాతీయ లఘుచిత్ర పోటీలో పాల్గొన్న సంతోష్ ఫిలిమ్స్ రూపొందించిన అభినవ్ లఘుచిత్రం ప్రత్యేక ప్రివ్యూ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఫిలిం నగర్ లోని ఫిలిం ఛాంబర్ ప్రివ్యూ థియేటర్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్మాత లీడర్ భీమగాని సుధాకర్ గౌడ్ ను మాజీ మంత్రివర్యులు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రజాసేవా ప్రస్థానాన్ని కొనియాడుతూ నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ ను ఘనంగా సన్మానించారు. . దేశభక్తి, సంస్కృతి పరిరక్షణ, యువలో జాతీయ చైతన్య వికాసం వంటి అంశాలపై నిర్మించిన లఘు చిత్రానికి విశేష ఆదరణ లభించిందని భీమగాని సుధాకర్ గౌడ్ చెప్పారు.

## హీరో రామ్ నితిన్ స్పెషల్ పోస్టర్ రిలీజ్

'మ్యాడ్' చిత్రంతో యువ ప్రేక్షకుల్లో మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్న హీరో రామ్ నితిన్ మరో యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రాన్ని వల్లభనేని గిరిబాబు సమర్పణలో ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై ధీరజ్ మొగిలినేని నిర్మిస్తున్నారు. 'యూత్' మూవీని తెలుగు ఆడియన్స్ ముందుకు తీసుకొచ్చిన ప్రొడ్యూసర్స్ వినీత్, సందీప్ తమ ఈ2సీ టాకీస్ బ్యానర్ పై సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. నారా రోహిత్ 'సుందరకాండ' ఫేమ్ డైరెక్టర్ వెంకటేష్ నిమ్మలపూడి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.హీరో రామ్ నితిన్ బర్త్ డే సందర్భంగా ఆయన నటిస్తున్న కొత్త సినిమా బర్త్ డే స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ మూవీ బర్త్ డే స్పెషల్ పోస్టర్ కలర్ ఫుల్ కాలేజ్ ఫెస్ట్ వైబ్స్ తో ఆకట్టుకుంటోంది.




## 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్ రిలీజ్



మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' . శివ నిర్వాణ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్ను విడుదల చేశారు.'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్‌లో ఒక కామన్ మ్యాన్ ప్రపంచాన్ని ఆకట్టుకునేలా చూపించారు. తన కూతురే అతని ప్రపంచం. ఆమె ఆనందం కోసం తీసుకునే నిర్ణయాలే అతని జీవితాన్ని నడిపిస్తాయి. తండ్రీకూతుళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని ఎంతో సహజంగా, హృదయానికి హత్తుకునేలా ఈ గ్లింప్స్‌లో ఆవిష్కరించారు. అది కేవలం ఒక త్యాగంలా కాకుండా, తన కూతురిపై ప్రేమతో, భక్తితో తీసుకున్న నిర్ణయంగా కనిపిస్తుంది. చివర్లో కనిపించే ఇరుముడి విజువల్స్ భావోద్వేగాన్ని మరింత పెంచి ప్రేక్షకుల మనసులను తాకాయి.బేబీ నక్షత్ర రవితేజ కూతురి పాత్రలో ఆకట్టుకుంది. ఆమె, రవితేజ మధ్య వచ్చే సన్నివేశాలు గ్లింప్స్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సినిమాటోగ్రాఫర్ విష్ణు శర్మ విజువల్స్ కథలోని భావోద్వేగాలను అందంగా తెరపై ఆవిష్కరించారు. జి.వి. ప్రకాష్ కుమార్ అందించిన బ్యాక్గ్రౌండ్ స్కోర్ గ్లింప్స్‌కు ప్రాణంలా నిలిచి భావోద్వేగాలను మరింతగా ఎలివేట్ చేసింది. 'ది హార్ట్ ఆఫ్ ఇరుముడి' గ్లింప్స్ ఒక తండ్రి ప్రపంచంలోకి తీసుకెళ్లే ఆహ్వానంలా ఆకట్టుకుంది. ఈ గ్లింప్స్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. మాస్ మహారాజా రవితేజ, ప్రియా భవానీ శంకర్, సాయి కుమార్, బేబీ నక్షత్ర, అజయ్ ఘోష్, రమేష్ ఇందిర, స్వాసిక, మీసాల లక్ష్మ ణ్, రాజ్ కుమార్ కసిరెడ్డి, రమణ భార్గవ్, కిషోర్ కంచెరపాలెం, కార్తీక్ అదుసుమల్లి, మహేష్ నటించారు.

## ఊరికి పేరులేదు 'పెద్ది'

'పెద్ది' రివ్యూ



గేమ్ ఛేంజర్ అట్టర్ ఫ్లాప్ తరువాత రిలీజైన రామ్ చరణ్ సినిమా పెద్ది. ఉప్పెన సినిమా దర్శకుడు బుచ్చి బాబు సానా దర్శకత్వం వహించిన ఈ సినిమా జూన్ 4న విడుదలైంది. రామ్ చరణ్ సరసన దివంగత నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటించింది. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కించిన ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోవడం కొంచెం కష్టమే అనిపిస్తోంది. మొదటి రోజు అభిమానులతో థియేటర్లు సందడిగా ఉన్న తరువాత ఈ సినిమాకు ప్రేక్షకులు థియేటర్ కు రావడం కష్టమే. క్రీడల నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రామ్ చరణ్ వరకు బాగానే కష్టపడ్డాడు. కుస్తీ పోటీల కోసం బాడీ ట్రాన్స్ఫర్మేషన్ వంటి అంశాల్లో రామ్ చరణ్ కష్టాన్ని మెచ్చుకోవలసిందే. కానీ ఈ ట్రాన్స్ఫర్మేషన్ సన్నివేశాలతో సినిమాను లాక్కెళ్లే ప్రయత్నం చేశాడు దర్శకుడు. ఇంతకీ ఎన్నో ఆశలు పెట్టుకుని పని చేసిన రామ్ చరణ్ కు పెద్ది సినిమా పెద్ద సంబురం ఇచ్చిందా? లేక నిరాశపరిచిందా? అం సినిమా చూడాల్సిందే.

**కథ:** పెద్ది (రామ్చరణ్) ఓ క్రికెటర్. బతుకుతెరువు కోసం బెల్లం తయారు చేసే ఫ్యాక్టరీలో పనిచేస్తుంటాడు. పెద్ది ఊరికి పేరుతో పాటు రోడ్డు సౌకర్యం ఉండదు. ఆ ఊరివాళ్లకు ఓటుహక్కు లేకపోవడంతో అందరూ చులకనగా చూస్తారు. విజయనగరం వెళ్లాలం కొండలు, వాగులు దాటాల్సివస్తుంది. పెద్ది ఊరి మీదుగానే రైల్వే ట్రాక్ ఉంటుంది. కానీ స్టేషన్ లేకపోవడంతో ఒక్క ట్రైన్ కూడా ఆగదు. ఊరికి రైల్వే స్టేషన్ సౌకర్యం కల్పించాలని అప్పలసూరి (జగపతిబాబు) ప్రయత్నాలు చేస్తుంటాడు. పెద్ది గొప్ప క్రికెటర్‌గా విజయనగరం, బొబ్బిలి ఏరియాల్లో ఫేమస్ అవుతాడు. కానీ అప్పలసూరి మరణం కారణంగా తనకు ఇష్టమైన క్రికెట్‌ను వదిలి కుస్తీని ఎంచుకుంటాడు. పెద్ది ఆ నిర్ణయం తీసుకోవడానికి కారణం ఏమిటి? అప్పలసూరి ఎలా చనిపోయాడు? తన ఊరికి గుర్తింపు తీసుకురావడానికి పెద్ది ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకున్నాడు? కుస్తీలో ఫైనల్ వరకు వెళ్లిన పెద్ది చివరకు ఆటకే దూరం కావాల్సిన పరిస్థితి ఎందుకొచ్చింది? తనను ప్రేమించిన అచ్చియమ్మను (జాన్వీకపూర్) పెద్ది పెళ్లి చేసుకున్నాడా? పెద్దికి అండగా నిలిచిన గౌర్నాయుడు (శివరాజ్కుమార్) ఎవరు? రామ్బుజ్జి(దివ్యేందు శర్మ), వీరభద్రంతో (తారక్ పొన్నప్ప) పెద్ది ఎందుకు గొడవలు జరిగాయి? అన్నదే మిగిలిన కథ. క్లైమాక్స్‌లో ఎమోషనల్ యాక్టింగ్‌తో మెప్పించాడు. హీరోయిజం హంగులకు దూరంగా సాగే ఇలాంటి క్లైమాక్స్‌ను యాక్సెప్ట్ చేయడానికి ధైర్యం కావాలి. చరణ్ తర్వాత అప్పలసూరి పాత్ర ఈ సినిమాకు హైలైట్‌గా నిలిచింది. ఈ పాత్రకు జగపతిబాబు న్యాయం చేశారు. గురువు పాత్రకు శివరాజు కుమార్ హుందాతనం తీసుకొచ్చారు. ఫస్ట్ హాఫ్లో కాస్త ఎక్కువే జాన్వీకి స్క్రీన్ స్పేస్ దక్కింది. స్పెషల్ సాంగ్‌లో శృతి హాసన్ తేలిపోయింది. శృతి హాసన్ లాంటి అందాల తారతో ఐటెం సాంగ్ చేయించినపుడు ''ఊ అంటావా మావా ఊ ఊ అంటావా మావ' అన్న గురువు సుకుమార్ కం బాగా తీయాల్సింది కానీ స్పెషల్ సాంగ్ ను స్పెషల్ గా తీయడంలో బుచ్చిబాబు మొహమాటపడినట్టు ఉన్నాడు. పాన్ ఇండియా సినిమాగా విడుదల అయినప్పటికీ విజయనగరం యాసలో డైలాగులు పలికించాడు. బుచ్చిబాబు సొంత గడ్డ వాసనను మరచిపోలేదనిపిస్తోంది. గ్రామీణ నేపథ్యంలో ఇలాంటి కథలు గతంలో కూడా వచ్చినా బుచ్చిబాబు రూపొందించిన కథనం తీరు జనాన్ని ఆకట్టుకునేలా ఉంది. కాకపోతే ఫస్ట్ హాఫ్ అంత కమర్షియల్ , కొంత బోర్ కొట్టిస్తుంది. అసలు కథ సెకండాఫ్ లోనే స్టార్ట్ అవుతుంది.ఏ ఆర్ రెహ్మాన్ సంగీతం ఈ సినిమా నిలబడటానికి కొంతమేర ఉపయోగపడుతుంది. తన ఊరితో పాటు ఊరి ప్రజలను గెలిపించడం కోసం ఓ ఆటగాడు సాగించిన పోరాటం పెద్ది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమాలు చాలా వరకు లాజిక్‌లకు దూరంగా సాగుతాయి. క్లైమాక్స్లో హీరో గెలవడం ఈ జానర్ సినిమాల్లో కామన్‌గా కనిపిస్తుంది. కానీ పెద్దిని కొంత వైవిధ్యంగా చూపించే ప్రయత్నం చేశాడు బుచ్చిబాబు. ఇందులో ఒకే ఆటను కాకుండా క్రికెట్, రెజ్లింగ్‌తో పాటు రన్నింగ్ గేమ్‌ను చూపించాడు. రొటీన్ తెలుగు సినిమాయే తప్ప చెప్పుకోదగ్గ కొత్త అంశాలు ఏమీ పెద్దగా కనిపించవు. ఈవెంట్స్ లో రామ్ చరణ్ చెప్పినట్టుగానే ఆయన కెరీర్ లో చెప్పుకునే సినిమా అవుతుందేమో కానీ ప్రేక్షకులు గుర్తుపెట్టుకునేంత సినిమాగా నిలబడదు.

**జార్ఖండ్ రాష్ట్ర తరహాలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం, సంక్షేమానికి ప్రత్యేక చట్టాన్ని రూపొందించి, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో శాశ్వత యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని టిజెఎస్ నాయకుల తెలంగాణ ఉద్యమకారుల కమిటీని కోరారు. ఈ మేరకు టిజెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ ' తెలంగాణ ఉద్యమకారుల కమిటీ' గురువారం వినతిప్రతం అందజేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్ర, ఉద్యమకారుల త్యాగాలు, సేవలను విద్యా పాఠ్యాంశాల్లో చేర్చి భావితరాలకు అందించాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించారు. ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం ఇవ్వాలని, సంక్షేమం, ఉపాధి, వైద్య సదుపాయాలను కల్పించాలని వారు కోరారు.**

# విద్యావ్యవస్థ నాశనం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. నీట్‌యూజీ పరీక్షల్లో అవకతవకలు జరిగాయని వార్తలు రావడంతో తీవ్ర నిరాశకు గురైన మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాకు చెందిన నీట్ అభ్యర్థి ఆకాంక్ష చతుర్వేది, నాగ్‌పూర్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు మీడియాలో వార్తలు వచ్చిన నేపథ్యంలో మోదీ ప్రభుత్వంపై గాంధీ ఈ విమర్శలు చేశారు. 'ఆకాంక్ష డాక్టర్ కావాలని, దేశానికి, సమాజానికి సేవ చేయాలని కలలు కన్నది. ఆకాంక్ష తండ్రి ఒక రైతు. తన కుమార్తె డాక్టర్ కావాలనే కలను నెరవేర్చడానికి, ఆయన తన కిసాన్ క్రెడిట్ కార్డుపై రూ. 3 లక్షల రుణం తీసుకున్నారు. తన కుమార్తె నాగ్‌పూర్‌లో కోచింగ్ తరగతులకు హాజరయ్యేందుకు వీలుగా, ఆయన స్వయంగా అక్కడే వంటవాడిగా కూడా పనిచేశారు' అని గాంధీ తన హిందీ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఒక తండ్రి మానవమాత్రుడిగా చేయగలిగినదంతా చేశారని, ఆ తర్వాత, నీట్ పేపర్ లీక్ అయింది. పరీక్ష రద్దయింది. ఆ అనిశ్చితి మధ్య ఆకాంక్ష మనల్ని శాశ్వతంగా విడిచి వెళ్లిపోయిందని ప్రతిపక్ష నాయకుడు అన్నారు. ఆకాంక్ష మరణం ఆత్మహత్య కాదు.. ఇది ప్రధాని మోదీ హయాంలోని అవినీతి, విచ్ఛిన్నమైన వ్యవస్థకు సంబంధించిన విషాదకరమైన పర్యవసానం అని రాహుల్‌గాంధీ ఆరోపించారు. 'ఇక ధర్మేంద్ర ప్రధాన్ విషయానికొస్తే? ఆయన ఈనాటికీ తన పదవిలో పటిష్టంగా పాతుకుపోయి ఉన్నారు. అవే పాత కమిటీలు. అవే పాత బదిలీలు. అవే పాత విచారణలు. సంస్కరణలు లేవు; న్యాయం లేదు' అని రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. 'మోదీ గారూ, అధికారం శాశ్వతం కాదు అది వస్తూ పోతూ ఉంటుంది. కానీ గత 12 ఏళ్లుగా మీరు విద్యా వ్యవస్థను నాశనం చేసిన తీరుకు, ఇప్పుడు భారతదేశ యువతరం మొత్తం మూల్యం చెల్లిస్తోంది' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో, మే 3న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించాల్సిన నీట్ (యూజీ) 2026 పరీక్షను మే 12న రద్దు చేశారు. ఈ ఆరోపణలపై ప్రస్తుతం సిబిఐ దర్యాప్తు చేస్తోంది. జూన్ 21న పునఃపరీక్షను నిర్వహించనున్నారు.

# ప్రజాస్వామ్య మనుగడ అసాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

అవసరంలేదు. కానీ, ఆ అభిప్రాయాన్ని చెప్పే హక్కును కాపాడటం సమాజ బాధ్యత' అని ఆయన స్పష్టం చేశారు. పత్రికలకు, విశ్లేషకులకు తమ విశ్వసనీయ వర్గాల ద్వారా వచ్చే సమాచారాన్ని విశ్లేషించే హక్కు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కల్పించిందని, 'నీకు ఎవరు చెప్పారు?' అని అడగడానికి ఎవరికీ హక్కు లేదన్నారు. రాజకీయాల కోసం అస్థిత్వవాదానికి, ప్రాంతీయవాదానికి తేడా తెలియకుండా మాట్లాడుతున్నారని, ప్రాంతీయ విద్వేషాలను రగల్చడం ఉగ్రవాదం కంటే ప్రమాదకరమని హెచ్చరించారు. నాగేశ్వర్‌పై అక్రమ కేసులు పెట్టడం అంటే సమాజంలో భయానక వాతావరణం సృష్టించి, ఎవరూ ప్రశ్నించకుండా చేయడమేనని జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

**నాగేశ్వర్ గొంతును కాపాడుకోవాలి: కూనంనేని సాంబశివరావు**



సమావేశానికి అధ్యక్షత వహించిన కూనంనేని సాంబశివరావుమాట్లాడుతూ ప్రొఫెసర్ నాగేశ్వర్ రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఒక విజ్ఞాన ఖని లాంటివారని, ప్రజా గొంతుకైన ఆయనను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఒక విశ్లేషణపై వివాదం చెలరేగినప్పుడు నాగేశ్వర్ పెద్ద మనసుతో తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నాక కూడా, దానిని ఇంకా పెద్ద వివాదంగా మార్చడం వెనుక ఉన్న రాజకీయ కుట్రలను అర్థం చేసుకోవాలన్నారు. పొరుగు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఇక్కడికి వచ్చి బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం, కమ్యూనిస్టులపై విమర్శలు చేయడం తగదన్నారు. తెలంగాణ సమాజం అందరినీ ప్రేమిస్తుందని, అయితే ఇక్కడి అస్థిత్వంపై దాడి చేస్తే ఊరుకోదని సాంబశివరావు స్పష్టం చేశారు.

**భావప్రకటన స్వేచ్ఛను గౌరవించాలి : ప్రొఫెసర్ కోదండరామ్**



ఎంఎల్‌సి ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ భావప్రకటన స్వేచ్ఛను గౌరవించడం ప్రజాస్వామ్య సమాజానికి అత్యవసరమని అన్నారు. నాగేశ్వర్ వ్యక్తపరిచే అభిప్రాయాలు అందరికీ నచ్చాల్సిన అవసరం లేదని, విభేదాలు ఉంటే వాటిని చర్చల ద్వారా, ప్రత్యామ్నాయ అభిప్రాయాల ద్వారా వ్యక్తపరచాలని సూచించారు.

**నాగేశ్వర్‌పై దాడి ఖండనీయం.. వివాదాలకు ముగింపు పలకాలి: అద్దంకి దయాకర్**



ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజమేనని, వాటిని చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు.పవన్ కళ్యాణ్ తెలంగాణకు రావడాన్ని ఎవరూ వ్యతిరేకించడంలేదని, అయితే తెలంగాణ ఉద్యమకారుల మనోభావాలను గౌరవించడం అవసరమన్నారు. నాగేశ్వర్ అంశాన్ని ఆధారంగా చేసుకుని రాజకీయ ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య విభేదాలు పెరిగేలా వ్యవహరించడం ఎవరికీ మేలు చేయదన్నారు. పవన్ కళ్యాణ్‌పై తెలంగాణ ప్రజలకు వ్యక్తిగత వ్యతిరేకత లేదని, ఈ వివాదాన్ని ఇక్కడితో ముగించే దిశగా అందరూ ముందుకు రావాలని కోరారు.

**భావప్రకటన స్వేచ్ఛను కాపాడాలి: పశ్య పద్మ**



ప్రజల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ అవగాహన పెంపొందించేందుకు ప్రొఫెసర్ నాగేశ్వర్ నిరంతరం చేస్తున్న కృషిని గౌరవించాల్సింది పోయి, ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ అన్నారు. నాగేశ్వర్‌పై ఏర్పడిన పరిస్థితిని నిరసిస్తూ రెండు తెలుగు రాష్ట్రాల్లో సమావేశాలు, సభలు జరుగుతున్నాయని, ఆయనపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. రాజకీయాల్లో అరాచక ధోరణులకు తావివ్వకుండా ప్రజాస్వామ్య పద్ధతులను అనుసరించాలని, భావప్రకటన స్వేచ్ఛను కాపాడుతూ ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటి మేధావుల ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలన్నారు.

**నాగేశ్వర్‌పై కేసులు ఎత్తివేయాలి.భావప్రకటన స్వేచ్ఛను కాపాడాలి: కె.శ్రీనివాస్**



సీనియర్ సంపాదకులు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాంతీయవాదాన్ని జాతీయ భద్రతా సమస్యగా లేదా ఉగ్రవాదంతో పోల్చే వ్యాఖ్యలు అత్యంత అభ్యంతరకరమని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజాస్వామ్య చర్చలను దెబ్బతీస్తాయని, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య అనవసర వైరుధ్యాలను సృష్టించే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు సహజ మిత్రులని, వారి మధ్య విద్వేష సంబంధాలు లేవని స్పష్టం చేశారు.ప్రొఫెసర్ నాగేశ్వర్ ఒక రాజకీయ విశ్లేషకుడిగా తన అభిప్రాయాలను వెల్లడించారని, విశ్లేషకులు, జర్నలిస్టులను రాజకీయ ప్రత్యర్థులుగా భావించి లక్ష్యంగా చేసుకోవడం ప్రమాదకర ధోరణి అని విమర్శించారు. అభిప్రాయ భేదాలు ఉన్నా వాటిని చర్చల ద్వారా ఎదుర్కోవాలే తప్ప వ్యక్తిగత దాడులు, ట్రోలింగ్‌లు సమర్థనీయం కాదని పేర్కొన్నారు.

**పవన్ కళ్యాణ్ వెనుక బిజెపి ఎజెండా: ఎస్. వీరయ్య,**



సిపిఎం నేత ఎస్ వీరయ్య మాట్లాడుతూ ప్రొఫెసర్ నాగేశ్వర్ అంశం ఆంధ్రాతెలంగాణ పంచాయితీ కాదని, అది కేవలం మీడియా స్వేచ్ఛకు సంబంధించిన విషయమన్నారు. అయితే, ఎపి ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సరిగ్గా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజే ఇక్కడికి వచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం పుండు మీద కారం చల్లడమేనన్నారు.

**సిరా ఇంకేవరకు రాస్తూనే ఉంటాను.. గొంతు ఉన్నంతవరకు మాట్లాడుతాను: ప్రొఫెసర్ కె.నాగేశ్వర్**



ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మాట్లాడుతూ గత 15 రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో అన్ని ప్రజాసమస్యలను పక్కనబెట్టి తన చుట్టూనే చర్చలు నడపడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, రైల్వే జోన్ లాంటి కీలక అంశాలపై చర్చించని మీడియా ఛానళ్లు, తనపై గంటల తరబడి చర్చలు పెట్టడం వెనుక ఉన్న అధికార వర్గాల విశృంఖలత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. 'నా మాటల్లో ఎక్కడా కుల ప్రస్తావన గాని, అల్లర్లు రేపే ఉద్దేశం లేదన్నారు. అయినా హైకోర్టులు కొట్టేసిన సెక్షన్లను నాపై ప్రయోగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ నేను భయపడను. పదవుల కోసమో, ప్రలోభాల కోసమో నేను మాట్లాడటం లేదు; ప్రజాపక్షాన నిలబడటమే నా బాధ్యత. నా గొంతులో ప్రాణం ఉన్నంతవరకు, నా పెన్నులో సిరా ఇంకేవరకు నేను రాస్తూనే ఉంటానని, మాట్లాడుతూనే ఉంటాను తప్పితే ఎలాంటి నిర్బంధాలకూ లొంగే ప్రసక్తే లేదని నాగేశ్వర్ స్పష్టం చేశారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సాధినేని వెంకటేశ్వర్లు, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నాయకురాలు రమ మాట్లాడుతూ నాగేశ్వర్‌పై పెట్టిన అన్ని అక్రమ కేసులను ప్రభుత్వం బేషరతుగా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. భిన్నాభిప్రాయాలను గౌరవించే ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య వాతావరణాన్ని కాపాడుకోవడానికి, రాజ్యాంగ పరిరక్షణకు తెలుగు నేలపై అందరూ కలిసికట్టుగా ఉద్యమించాలని కోరారు.

**భావప్రకటన స్వేచ్ఛను గౌరవించుకుంటామని ప్రతిజ్ఞ**

ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన సభికులతో రాజ్యాంగం హామి ఇచ్చిన భావ ప్రకటన స్వేచ్ఛను గౌరవించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా ప్రొఫెసర్ నాగేశ్వర్ రాజకీయ విశ్లేషణ పై ఆంధ్ర ప్రదేశ్ లో కొన్ని పార్టీలు, వారి సోషల్ మీడియా బృందాలు చేస్తున్న కక్షపూరిత దాడి, ట్రోలింగ్ ను ఈ అఖిల పక్ష సమావేశం తీవ్రంగా ఖండిస్తు తీర్మానం చేసింది. ఇప్పటికే నాగేశ్వర్ తన మాటలను ఉపసంహరించుకున్నా, విద్వేషపూరిత దాడి కొనసాగించడం సరికాదని .జనసేన ఆ అంశానికి ముగింపు పలికినట్లు ప్రకటించినప్పటికీ నాగేశ్వర్ పైఆంధ్రప్రదేశ్ లో కేసులను ఎత్తివేయలేదని,తక్షణమే ఈ అంశానికి ముగింపు పలికి, నాగేశ్వర్ పై కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సభ అధ్యక్షులు కూనంనేనిసాంబశివరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రౌండ్ టేబుల్ సమావేశంఏకగ్రీవంగా ఆమోదించింది. అలాగే భావ ప్రకటన స్వేచను పరిరక్షించాలని, ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య సామరస్య వాతావరణం పరిఢవిల్లాలని అఖిల పక్ష సమావేశం అభిప్రాయపండింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్ తదితరులు పొల్గొన్నారు.

# కేరళను తాకిన 'నైరుతి'

(మొదటి పేజీ తరువాయి)

సముద్రంలోని మిగిలిన ప్రాంతాలు, పశ్చిమమధ్య, తూర్పుమధ్య అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, మొత్తం లక్షద్వీప్ దీవులు, కేరళ, మాహే, కర్ణాటక, తమిళనాడులోని కొన్ని ప్రాంతాలు, కొమరిన్ ప్రాంతంలోని మిగిలిన భాగాలు, ఆగ్నేయ బంగాళాఖాతం, నైరుతి, పశ్చిమమధ్య, తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలలోకి మరింతగా విస్తరించాయి అని ఐఎండి తెలిపింది. అటు తమిళనాడుపై కూడా రుతుపవనాల ప్రభావం కనిపిస్తోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయి. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కేరళలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ఇప్పుడు క్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నాయి. సాధారణ పరిస్థితులు కొనసాగితే వచ్చే వారం రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రస్తుతం తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాలకు ఉపశమనం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతంలో వాతావరణ శాఖ మే 26నే కేరళలో రుతుపవనాలు ప్రారంభమవుతాయని అంచనా వేయగా, వాటి రాక ఆలస్యమైంది. కాగా, కాలానుగుణ వర్షపాతంపై అంచనాను సవరించి, అది సాధారణం కంటే తక్కువగా ఉంటుందని సూచించింది. ఈ సంవత్సరం భారతదేశంలో వర్షపాతం దీర్ఘకాల సగటు (ఎల్‌పిఎ)లో సుమారు 90 శాతంగా ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేస్తోంది. 1971 నుండి 2020 వరకు ఉన్న డేటా ఆధారంగా, దేశవ్యాప్తంగా రుతుపవన వర్షపాతం యొక్క దీర్ఘకాల సగటు (ఎల్‌పిఎ) 87 సెం.మీ.గా ఉంది. రుతుపవన కాలంలో ఎల్‌పిఎ వర్షపాతంలో 90 శాతం కంటే తక్కువ నమోదైతే, ఐఎండి దానిని లోటుగా వర్గీకరిస్తుంది. సాధారణం కంటే తక్కువ వర్షపాతానికి ఒక కారణం ఎల్ నినో పరిస్థితులు ఏర్పడటం కావచ్చు, దీనివల్ల దేశంలో రుతుపవన కాలంలో వర్షపాతం తగ్గుతుంది. ప్రస్తుతం, భూమధ్యరేఖ పసిఫిక్ ప్రాంతంలో తటస్థ ఎల్ నినోసదరన్ ఆసిలేషన్ పరిస్థితులు ఎల్ నినో పరిస్థితులుగా మారుతున్నాయి. జూన్‌లో ఎల్ నినో పరిస్థితులు బలహీనంగా, సెప్టెంబర్‌లో మధ్యస్థం నుండి బలంగా ఉండే అవకాశం ఉందని ఐఎండి తెలిపింది.

# ఐదుగురు సజీవ దహనం

(మొదటి పేజీ తరువాయి)

అంతటా వ్యాపించి, దానిని దట్టమైన పొగతో నింపేసింది. మొత్తం ఐదుగురు సజీవ దహనం కాగా, పలువురు గాయపడ్డారని, వారు వివిధ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నట్లు ముజఫర్‌పూర్ మున్సిపల్ కమిషనర్ రితురాజ్ సింగ్ తెలిపారు. ఉదయం ఐసియులో సుమారు 13 నుంచి 15 మంది రోగులు చికిత్స పొందుతున్నారని, వారిని ఇప్పుడు కుటుంబ సభ్యులు ఇతర ఆసుపత్రులకు తరలించారని ముజఫర్‌పూర్ జిల్లా మేజిస్ట్రేట్ సుబ్రత్ కుమార్ సేన్ తెలిపారు. మృతుల బంధువులను, ఇతర రోగులను సంప్రదించడానికి తాము ప్రయత్నిస్తున్నామని, మంటలను అదుపులోకి తీసుకువచ్చామని సేన్ అన్నారు. ప్రాథమిక నివేదికల ప్రకారం... షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు కనిపిస్తోందని, సమగ్ర దర్యాప్తు తర్వాతే అసలు కారణం తెలుస్తుందని ఆయన అన్నారు. ఈ ఘటనపై విచారణ జరిపేందుకు కలెక్టర్ ఐదుగురు సభ్యులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారని సింగ్ తెలిపారు. ఈ ఘటనను ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి అత్యంత విషాదకరంగా అభివర్ణించి, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు తక్షణమే రూ. 4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించాలని ఆదేశాలు జారీ చేశామని, స్థానిక యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉందన్నారు. గాయపడిన వారి చికిత్స కోసం జిల్లా ఆసుపత్రులలో తగిన ఏర్పాట్లు చేసినట్లు ఎక్స్‌లో పేర్కొన్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు అధికారులు విచారణ జరుపుతున్నారని, ఈ విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి విజయ్ కుమార్ చౌదరి తెలిపారు. ఈ అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం పట్ల బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన హృదయ విదారకమని మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అన్నారు, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com